అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 23-1-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 332 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

పూర్తయిన ప్రాణప్రతిష్ట


మోడీ చుట్టే తిరిగిన అయోధ్య ఈవెంట్

అంతా తానై నడిపిన ప్రధాని



ఆ రేఖ చెరిగిపోయింది

మతపరమైన కార్యక్రమంలో మోడీ క్రియాశీలకంగా వ్యవహరించడాన్ని గమనిస్తే ప్రభుత్వానికి, మతానికి మధ్య ఉన్న సూత్రప్రాయమైన దూరం అస్పష్టంగా ఉన్నదని, దానిని అర్థం చేసుకోవడం కష్టమని పండితులు, నిపుణులు అభిప్రాయపడ్డారు. ఒక లౌకిక దేశంగా భారత్ పునాదిని ఈ దూరం నిర్దేశిస్తోందని తెలిపారు. 'ఒకరు రాజు మాదిరిగా వ్యవహరిస్తున్నారు. తనలో దైవత్వం ఉన్నదని ఆయన ప్రకటించాడు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి తనను దైవం ఎంచుకున్నాడని భావించాడు. దీనిని ఏమంటారు? ప్రభుత్వానికి, మతానికి మధ్య ఉన్న రేఖ చెరిగిపోయింది. మతం, మత కార్యక్ర మాలను ఎలా నిర్వహించాలో ప్రభుత్వం నిర్దేశించినప్పుడే ఆ రేఖ చెరిగిపోయింది' అని రాజకీయ శాస్త్రవేత్త రాజీవ్ భార్గవ తెలిపారు.



- బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతల కనుసన్నలలో కార్యక్రమం
- ప్రధానిపై పోటీ పడి ప్రశంసలు
- మతానికీ ప్రభుత్వానికీ మధ్య చెరిగిన రేఖ

అయోధ్య : సుదీర్ఘకాలం ఎదురు చూసిన తర్వాత రాముడు తన ఇంటికి వచ్చాడని ప్రధాని మోడీ అన్నారు. 'ఎన్నో చెప్పాలని అనుకున్నాను. కానీ నా గొంతు ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మన రామ్ లల్లా ఇకపై టెంటులో ఉండడు. ఆలయంలో ఉంటాడు. ఇది క్యాలండర్‌లో ఒక రోజు కాదు. నూతన కాలచక్రానికి ఆరంభం' అని చెప్పారు. అనేక శతాబ్దాల పాటు రాముడిని వేచి ఉండేలా చేసినందుకు క్షమాపణలు కోరుతున్నానని అన్నారు. దేశం యావత్తూ నేడు దీపావళిని జరుపుకుంటోందని మోడీ తెలిపారు.

అయోధ్యలో నిర్మాణంలో ఉన్న రామ మందిరంలోని రామ్ లల్లా విగ్రహానికి సోమవారం జరిగిన ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం యావత్తూ ప్రధాని నరేంద్ర మోడీ చుట్టూనే తిరిగింది. ప్రాణ ప్రతిష్ట సమయంలో జరిగిన క్రతువులో మోడీ అంతా తానై వ్యవహరించారు. మోడీతో పాటు ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రాష్ట్ర గవర్నర్ ఆనందీబెన్ పటేల్ మినహా మరెవ్వరినీ గర్భగుడిలోకి అనుమతించలేదు. మధ్యాహ్నం 12.20 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం ఎనిమిది నిమిషాల పాటు కొనసాగింది. అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. ప్రాణ ప్రతిష్ట జరిగిన బాల రాముడి విగ్రహం 51 అంగుళాల పొడవు ఉంది. వివిధ రకాల ఆభరణాలతో విగ్రహాన్ని అలంకరించారు. మైసూరుకు చెందిన శిల్పి అరుణ్ యోగి రాజ్ ఈ విగ్రహాన్ని రూపొందించారు.

దేవాలయ నిర్మాణం వచ్చే సంవత్సరం కానీ పూర్తి కాదు. ఇప్పటి వరకూ కేవలం మొదటి అంతస్తు నిర్మాణం మాత్రమే జరిగింది. కార్యక్రమాన్ని దేశంలోని అన్ని ప్రధాన టీవీ ఛానల్స్‌లోనూ, సామాజిక మాధ్యమాలలోనూ ప్రత్యక్ష ప్రసారం చేశారు. మోడీ, భగవత్, ఆదిత్యనాథ్, ఆనందిబెన్ ప్రధాన ఆకర్షణగా నిలిచారు. వీరిలో కూడా కేవలం మోడీ పైనే కెమేరా ఫోకస్ అయింది.

ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ ప్రముఖులనేకులు హాజరయ్యారు. ప్రతిపక్షాల నేతలెవరూ కనిపించలేదు. సోనూ నిగమ్, శంకర్ మహదేవన్, అనురాధ పౌడ్వాల్ ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.


ప్రధానిపై పొగడ్తలు

ప్రార్థనల అనంతరం పండితులు, రాజకీయ నాయకులు అతిథుల వద్దకు చేరుకున్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ...11లో

ప్రభుత్వ కార్యక్రమంగా మార్చేశారు

ఇది రాజ్యాంగ విరుద్ధం

- మతం, ప్రభుత్వం మధ్య రేఖ పలచబడుతోంది
- అయోధ్య ప్రాణ ప్రతిష్టపై పినరయి వ్యాఖ్య




తిరువనంతపురం : అయోధ్యలో జరిగిన ప్రాణ ప్రతిష్టను ప్రభుత్వ కార్యక్రమంగా మార్చడాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తప్పుపట్టారు. ఇతర మతాలను కించపరుస్తూ, ఏదో ఒక మతానికి ప్రాచుర్యం కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. మతం, ప్రభుత్వం మధ్య ఉండే రేఖ ఇప్పుడు పలచబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

'భారత ప్రజాస్వామిక రిపబ్లిక్‌కు లౌకికతత్వం ఆత్మ. జాతీయోద్యమ కాలం నుండి ఒక దేశంగా మన గుర్తింపులో అది ఓ భాగం. వివిధ మత విశ్వాసాలు కలిగిన వారు, ఏ మతంతోనూ సంబంధం లేని వారు స్వాతంత్రోద్యమంలో భాగస్వాములయ్యారు. ఈ దేశం ప్రజలందరిదీ. భారతీయ సమాజంలోని అన్ని వర్గాలదీ. ఇందులో అందరూ సమానమే. మతం అనేది ప్రైవేటు వ్యవహారం. ఎవరి మత విశ్వాసాలు వారు అనుసరించే స్వేచ్ఛ ప్రజలందరికీ ఉంది. అభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛ అందరికీ ఉన్నదని రాజ్యాంగం చెబుతోంది. మతాన్ని ఆచరించేందుకు, దానిని ప్రచారం చేసేందుకు హక్కు ఉంది. భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని ప్రమాణం చేసే మనం దేశంలోని ప్రతి వ్యక్తికీ సమాన హక్కులు ఉండేలా చూడాల్సి ఉంది. అదే సమయంలో ఏదో ఒక మతానికి ప్రాచుర్యం కల్పించకూడదు. ఇతర మతాలను కించపరచకూడదు' అని పినరయి తెలిపారు. 'భారతీయ లౌకికవాదం అంటే మతాన్ని, ప్రభుత్వాన్ని వేరు చేయడమేనని తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభిప్రాయపడ్డారు. దానిని కొనసాగించే బలమైన సంప్రదాయం కూడా మనకు ఉంది. అయితే మతం, ప్రభుత్వం మధ్య ఉండే రేఖ ఇటీవలి కాలంలో సన్నబడిపోతోంది. మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొనవద్దని రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు గతంలో హెచ్చరించారు. అయితే ఇప్పుడు ఆ కాలం లేదు. ఫలితంగా ఓ లౌకిక దేశంగా మన విశ్వసనీయతలపై అపోహలు కలుగుతున్నాయి' అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

దేశంలో ఓ ప్రార్థనా స్థలం ప్రారంభోత్సవాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా జరుపుకోవడాన్ని ఇప్పుడు చూస్తున్నామని పినరయి వ్యాఖ్యానించారు. తమలో చాలా మందిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించారని చెబుతూ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేసిన వారిగా దానికి హాజరయ్యేందుకు నిరాకరించామని, తద్వారా తమ లౌకిక స్వభావాన్ని చాటిచెప్పామని, రాజ్యాంగ బాధ్యతలను నిర్వర్తించామని అన్నారు.

మతం, భాష, ప్రాంతం, వర్గ వైవిధ్యాలకు అతీతంగా దేశ ప్రజలందరి మధ్య సామరస్యాన్ని, సోదర భావాన్ని పెంపొందించాలని పినరయి చెప్పారు. శాస్త్రీయ దృక్పథాన్ని, మానవత్వాన్ని, సంస్కరణల స్ఫూర్తిని పెంపొందించుకొని దేశం మరింత సౌభాగ్యవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు.

సోషల్ మీడియాలో రాజ్యాంగ పీఠిక షేర్


THE CONSTITUTION OF INDIA
PREAMBLE
WE, THE PEOPLE OF INDIA, having solemnly resolved to constitute India into a '[SOVEREIGN SOCIALIST SECULAR DEMOCRATIC REPUBLIC] and to secure to all its citizens :
JUSTICE, social, economic and political:

- రామ మందిర ప్రారంభం రోజు
- మలయాళ నటులు, డైరెక్టర్ల వినూత్న చర్య

వివరాలు 11లో..



ఆత్మ విమర్శ తక్కువ.. పరనింద ఎక్కువ...

లోపాలు, లొసుగులు, బలహీనతలపై అగ్రనేతల సమీక్ష నామమాత్రమే

- బీఆర్ఎస్ పార్లమెంటు సన్నాహక సమావేశాల తీరిది
- అధిష్టానానికి మాస్టర్ స్ట్రోక్ ఇచ్చిన క్యాడర్
- ఎంపీ స్థానాలపై ముగిసిన భేటీలు
- అధినేత కేసీఆర్ వద్దకు రిపోర్టులు
- త్వరలోనే ముఖ్యులతో గులాబీ బాస్ భేటీ
- ఫిబ్రవరి మొదటి వారం నుంచి 'అసెంబ్లీ' సమీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్... ఆ ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకోవటంపై కాకుండా అధికార కాంగ్రెస్‌పై విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నట్టు కనబడుతోంది. ఈనెల మూడు నుంచి సోమవారం వరకూ మొత్తం 16 రోజులపాటు ...10లో

రాహుల్ యాత్రకు ఆటంకం

బారికేడ్లతో అడ్డుకున్న అసోం పోలీసులు మండిపడ్డ కాంగ్రెస్ అగ్రనేత



దిస్‌పూర్ : అసోంలోని నాగాన్ సమీపంలో ఉన్న హైబర్‌గాన్ వద్ద కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ యాత్రను సోమవారం రెండు గంటల పాటు నిలిపివేశారు. ప్రార్థనా స్థలమైన బటద్రవ థాన్ వద్దకు వెళ్లేందుకు రాహుల్ ప్రయత్నించగా పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఉదయం భారత్ జోడో న్యాయ్ యాత్రను ప్రారంభించిన రాహుల్ బటద్రవ థాన్ వైపు వెళ్లేందుకు ముందుకు కదిలారు. అయితే ఆ మార్గాన్ని పోలీసులు బారికేడ్లతో మూసివేశారు. ఈ ప్రాంతం వైష్ణవ గురువు, సంస్కరణవాది అయిన శ్రీమంత శంకరదేవ జన్మస్థలం. అసోంలోని వైష్ణవులకు ఇది అత్యంత పవిత్ర ప్రదేశం.

బారికేడ్లు అడ్డుగా ఉండడంతో రాహుల్ యాత్ర ముందుకు సాగలేదు. దీంతో ఆయన కార్యకర్తలతో పాటు నేల మీదే కూర్చుని 'రఘుపతి రాఘవ రాజా రామ్' అంటూ గీతాలు ...11లో

గణతంత్ర వేడుకల్లో తెలంగాణ శకటం



- ప్రజాస్వామ్య పరిరక్షణ.. ఉద్యమ స్ఫూర్తే ఇతివృత్తంగా ప్రదర్శనకు సిద్ధం

వివరాలు 11లో..

రెండు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయండి



- మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు

వివరాలు 11లో..

మళ్లీ తెరపైకి వీఆర్వో, వీఆర్ఎ వ్యవస్థలు ?

ధరణి స్థానంలో భూమాత పోర్టల్

- బడ్జెట్ సమావేశాల్లో రెవెన్యూ పునరుద్ధరణ బిల్లు!
- కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మళ్లీ వీఆర్వో, వీఆర్ఎ వ్యవస్థలు జీవం పోసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం భారీ కసరత్తు చేస్తోంది. ప్రభుత్వానికి, గ్రామాలకు మధ్య వారధిగా పనిచేస్తూ వచ్చిన గ్రామ రెవెన్యూ వ్యవస్థ మళ్లీ పునరుద్ధరించడం తప్ప మరో మార్గం లేదనే ఆలోచనలోనున్నట్టు సమాచారం. గత సర్కార్ తీసుకొచ్చిన ధరణిలో మార్పులు చేసి భూమాత పోర్టల్‌ను అందుబాటులోకి తేనున్నారు. త్వరలో వీటికి సంబంధించి విధాన పరమైన నిర్ణయం వెలువడే అవకాశముంది.

గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను గతంలో కంటే మరింత పటిష్టంగా తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకొనున్నది. ఈ మేరకు రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గ్రామ రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని ...11లో

ఓట్లే లక్ష్యంగా..అయోధ్యకు బీజేపీ ప్రత్యేక రైళ్లు

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా తరలింపు

- ఒక్కో ఎంపీ స్థానం నుంచి 1400 మంది తరలింపు
- 200 మందికో ఇన్‌చార్జి నియామకం

ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 15 వరకు అస్థా రైళ్లు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అయోధ్యలో రామ మందిరాన్ని చూపెట్టి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు రాల్చుకునే పనికి బీజేపీ పూనుకున్నది. ప్రజల్లోని భక్తి అనే సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకునే ప్రయత్నంలో తెలంగాణ శాఖ పడింది. అందులో భాగంగానే అయోధ్యకు అస్థాపేరుతో ప్రత్యేక రైళ్లను బుక్‌చేసింది. వాటి ద్వారా రోజుకు 1400 మంది చొప్పున అయోధ్య పర్యటనకు తరలించనున్నది. ఈ రైళ్లు ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 15 వరకు నడువనున్నాయి. ఒక్కో రైలులో 20 బోగీలుంటాయి. ప్రతి బోగికి ఒక ఇన్‌చార్జి ఉంటారు. పార్లమెంట్ ఎన్నికల్లో రామాలయం సెంటిమెంట్‌ను ఉపయోగించుకుని తెలంగాణలో వీలైనంత మేరకు ఎక్కువ ఎంపీ స్థానాలను దక్కించుకోవాలనే వ్యూహంలో భాగంగానే ఈ పర్యటనలని ప్రచారం జరుగుతున్నది.

అయోధ్యకు తెలంగాణ నుంచి సందర్శకులను తీసుకెళ్లేందుకు బీజేపీ తెలంగాణ శాఖ షెడ్యూల్‌ను తయారు చేసింది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 200 మందికి అవకాశం కల్పించనున్నట్టు తెలిసింది. ఒక్కో ట్రైన్‌లో పార్లమెంట్ స్థానం పరిధిలోని1400 మందికి అవకాశం కల్పించనున్నారు. అయోధ్య పర్యటనకు వెళ్లి రావడానికి ఐదు రోజుల సమయం పడుతుంది కాబట్టి ఒక్కో భోగికి ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ విభాగాలకు చెందినవారు, బీజేపీ నాయకులు ఇన్‌చార్జిగా ఉంటారని తెలిసింది. మొదటి రైలులో సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి సంబంధించిన వారిని ఈ నెల 29న తీసుకెళ్లనున్నారు. ఒక్కో నియోజకవర్గం వారిని ఒక్కో రోజు తీసుకెళ్లనున్నారు. ఈ పర్యటన జహీరాబాద్ నియోజకవర్గంతో ఫిబ్రవరి 15న ముగియనున్నది. ఇందులో పార్టీలతో సంబంధం లేకుండా దైవ భక్తి ఎక్కువగా ఉండేవారినీ, గ్రామంలో ఎక్కువ మందిని ప్రభావితం చేసే వారిని తరలించాలనే నిర్ణయానికి వచ్చింది. ఇదంతా ప్రజలను అయోధ్య యాత్రకు తీసుకెళ్లి హిందూత్వ భావజాలం వైపు పూర్తిగా మోల్డ్ చేసే పనిలో భాగమేనని తెలుస్తోంది. వారి ద్వారా గ్రామాల్లోని ఓటర్లను ప్రభావితం చేసి ఓట్లు మలుచుకునే ప్రయత్నం దాని ...11లో

నియోజక వర్గాల వారీగా..

1. సికింద్రాబాద్ - జనవరి 29
2. వరంగల్ - జనవరి 30
3. హైదరాబాద్ - జనవరి 31
4. కరీంనగర్ - ఫిబ్రవరి 1
5. మల్కాజ్ గిరి - ఫిబ్రవరి 2
6. ఖమ్మం - ఫిబ్రవరి 3
7. చేవెళ్ల - ఫిబ్రవరి 5
8. పెద్దపల్లి - ఫిబ్రవరి 6
9. నిజామాబాద్ - ఫిబ్రవరి 7
10. ఆదిలాబాద్- ఫిబ్రవరి 8
11. మహబూబ్నగర్- ఫిబ్రవరి 9
12. మహబూబ్ బాద్ -ఫిబ్రవరి 10
13. మెదక్- ఫిబ్రవరి 11
14. భువనగిరి - ఫిబ్రవరి 12
15. నాగర్ కర్నూల్- ఫిబ్రవరి 13
16. నల్గొండ - ఫిబ్రవరి 14
17. జహీరాబాద్ - ఫిబ్రవరి 15

ఇజ్రాయెల్ దాడులతో గాజాలో 25 వేల మందికిపైగా మృతి

గాజా :పాలస్తీనా భూభాగం కోసం ఇజ్రాయెల్ గత మూడున్నర నెలలుగా గాజాపై యుద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది అక్టోబర్ 7వ తేదీన ప్రారంభమైన ఈ యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇజ్రాయెల్ దాడుల వల్ల ఇప్పటివరకు 25, 105 మంది మృతి చెందారు. గడచిన 24 గంటల్లో 178 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని పాలస్తీనా ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రతినిధి అష్రఫ్ అల్‌ఖుద్రా ఆదివారం తెలిపారు. వేలాది మంది మృతి చెందడానికి కారణమైన ఇజ్రాయెల్ చర్యలను ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీ ఆంటోనియా గుటెరస్ తీవ్రంగా ఖండించారు. జనవరి 21, 22 తేదీల్లో ఉగాండా రాజధాని కంపాలాలో జీ77 ప్లస్ చైనా సమ్మిట్ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్ని యుఎస్ సెక్రటరీ జనరల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గుటెరస్ అల్‌జజీరాతో మాట్లాడుతూ.. నేను యుఎస్ సెక్రటరీ జనరల్‌గా ఉన్న సమయంలో ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలు, సామూహిక విధ్వంసం, పౌరుల మరణాలు ఊహించని స్థాయిలో పెరిగాయి. ఇజ్రాయెల్ చర్యల్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. కేవలం రెండు మార్గాలే ఈ సమస్యకు పరిష్కారం. ఒకటి, పాలస్తీనియన్ల రాజ్యాధికార హక్కును అంగీకరించడం. రెండోది రెండు రాష్ట్రాల ఏర్పాటుకు అంగీకరించడం. వీటిద్వారానే దశాబ్దాల తరబడి కొనసాగుతున్న ఈ సమస్యకు మార్గాలు.' అని ఆయన అన్నారు.

ఏపీలో 2024 ఓటర్ల తుది జాబితా విడుదల

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 2024 ఓటర్ల తుది జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాల వారీగా విడుదల చేసింది. సీఈఓ ఆంధ్రా వెబ్‌సైట్‌లో జిల్లాల వారీగా తుది ఓటర్ల జాబితా విడుదల చేసినట్టు ప్రకటనలో తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాలను ఎన్నికల సంఘం ప్రచురించింది. నియోజకవర్గాల వారీగా పీడీఎఫ్ ఓటర్ల జాబితాలను సీఈఓ ఆంధ్రా వెబ్‌సైట్‌లో ఈసీ అప్ లోడ్ చేసింది. ఓటర్ల జాబితాను ఎక్కడికక్కడే విడుదల చేయాలని ఈసీ.. జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

గురుకుల పాఠశాలలో విద్యార్థిని మృతి

నవతెలంగాణ-కొండమల్లేపల్లి


(ఫైల్)

గురుకుల పాఠశాలలో ప్రార్థన సమయంలో ఓ విద్యార్థిని కండ్లు తిరిగి కింద పడిపోయి మృతి చెందింది. ఈ ఘటన సోమవారం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి పట్టణంలో జరిగింది. ఎస్ఐ వీరబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. పీఏపల్లి మండలం, అంగడిపేట గ్రామానికి చెందిన దాసరి ఆంజనేయులు - అండాలు కూతురు దాసరి భార్గవి(14) స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నది. భార్గవి ఉదయం పాఠశాలలో ప్రార్థన చేస్తున్న సమయంలో కండ్లు తిరిగి కింద పడిపోయింది. ఉపాధ్యాయులు వెంటనే విద్యార్థిని పట్టణంలోని మెడికేర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిశీలించిన వైద్యులు బాలిక పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్టు చెప్పారు. దీంతో ఆగ్రహించిన బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు స్థానిక రహదారిపై గంటకుపైగా రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సంఘటనా స్థలానికి వచ్చి విద్యార్థిని తల్లిదండ్రులను ఓదార్చారు. పాఠశాల విద్యార్థిని మృతి చెందడం ఎంతో బాధాకరమని, కుటుంబ సభ్యులు అధైర్య పడొద్దని చెప్పారు. విద్యార్థిని కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థిని మృతి పట్ల విచారణ జరిపిస్తామన్నారు. అదేవిధంగా గురుకుల విద్యాలయాల తరపున బాలిక తల్లిదండ్రులకు రూ.50 వేలు అందజేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించారు. బాలిక తండ్రి దాసరి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వీరబాబు తెలిపారు. విద్యార్థిని మృతిపై అనుమానాలున్నాయంటూ విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



గురుకుల పాఠశాల విద్యార్థినికి పాము కాటు

అంబులెన్స్‌లో తరలింపు

నవతెలంగాణ-వైరా

వైరా లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కొంగల ప్రసన్న సోమవారం రాత్రి పాముకాటుకు గురైంది. డైనింగ్ హాల్ లో భోజనం ముగించుకుని వసతి భవనం లోకి వెళుతున్న సమయంలో పాము కరిచింది. వెంటనే అక్కడ ఉన్న ఉపాధ్యాయినీలకు తెలుపగా, 108 అంబులెన్స్ పిలిపించి వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ప్రస్తుతం ప్రసన్న ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుస్తుంది.



అయోధ్య రామమందిర కార్యక్రమం సందర్భంగా హైదరాబాద్‌లోని రాంకోఠీలో స్పేర్ పార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

'గృహజ్యోతి'కి కసరత్తు

వరంగల్ ఎన్పీడీసీఎల్‌లో లెక్కలు పూర్తి?

200 యూనిట్ల విద్యుత్‌కు రూ.1,327.56 కోట్లు ఖర్చు

- 16 జిల్లాల పరిధిలో 36,83,006 మంది వినియోగదారులు
- యూనిట్ల వారీగా లెక్కలేసిన అధికారులు
- ఇప్పటికే ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గృహజ్యోతి పథకానికి సంబంధించి వరంగల్ కేంద్రంగానున్న నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్పీడిసిఎల్)లో అధికారులు లెక్కలు సిద్ధం చేస్తున్నారు. 200 యూనిట్లకు సంబంధించి విద్యుత్ వాడుకునే వినియోగదారులకు బిల్లులు మాఫీ చేస్తే ప్రతియేటా రూ.1,327.56 కోట్లు ప్రభుత్వంపై భారం పడనున్నట్లు తెలిసింది. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎన్పీడీసీఎల్‌కు చెల్లించాల్సి వుంటుంది. దీని పరిధిలో 200 యూనిట్లలోపు వినియోగించుకునే వినియోగదారులు 36 లక్షల 83 వేల మంది వున్నారు. ప్రతినెలా రూ.110.63 కోట్లు ప్రభుత్వం చెల్లించాలి.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి వేగంగా పావులు కదుపుతుంది. ఈ ఆరు గ్యారెంటీలలో 'గృహజ్యోతి' పథకంలో భాగంగా 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే వారికి బిల్లును మాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఆ మేరకు వాటి అమలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఎన్పీడిసిఎల్) పరిధిలో 16 జిల్లాలున్నాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, హన్మకొండ, జగిత్యాల, జనగామ, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, వరంగల్ జిల్లాలు వున్నాయి. ఈ జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్లకు దిగువన వినియోగించుకునే విద్యుత్ వినియోగదారులు 36 లక్షల 83 వేల మంది వున్నారు.

'గృహజ్యోతి'పై రాజకీయం

గృహజ్యోతి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు బిల్లులను మాఫీ చేయనుంది. ఈ విషయమై ఎన్పీడిసిఎల్, ఎస్పీడిసిఎల్ కంపెనీ అధికారులు ఓ వైపు కసరత్తు చేస్తుండగానే బీఆర్ఎస్, ఇతర పార్టీల నేతలు విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. కరెంటు బిల్లులు ఎవరూ కట్టొద్దని, కరెంటు బిల్లులను సోనియా గాంధీకి పంపాలని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్య లతో కాంగ్రెస్ మంత్రులు తీవ్రంగా మండిపడ్డారు. కేటీఆర్ చెప్పినా, చెప్పకపోయినా, ఎంత రెచ్చకొట్టినా, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందని, 200 యూనిట్లలోపు విద్యుత్ బిల్లులను మాఫీ చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

జిల్లా	వినియోగదారులు	డిమాండ్ (కోట్లలో)
ఆదిలాబాద్	1,55,228	4.73
ఆసిఫాబాద్	1,05,410	2.76
భద్రాద్రి	2,54,705	7.93
భూపాలపల్లి	1,36,071	3.35
హన్మకొండ	2,63,238	9.01
జగిత్యాల	2,87,702	8.41
జనగామ	1,31,249	2.97
కామారెడ్డి	2,25,788	5.68
కరీంనగర్	3,13,762	10.51
ఖమ్మం	3,87,289	12.32
మహబూబాబాద్	1,59,198	3.52
మంచిర్యాల	2,07,890	6.64
నిర్మల్	1,81,033	5.28
నిజామాబాద్	4,53,898	14.22
పెద్దపల్లి	1,93,643	6.31
వరంగల్	2,26,902	7.00
మొత్తం	36,83,006	110.63

యేటా రూ.1327.56 కోట్లు

ఎన్పీడిసిఎల్ పరిధిలోని 16 జిల్లాల్లో గృహజ్యోతి పథకం అమలు చేయడం ద్వారా ప్రతియేటా రూ.1,327.56 కోట్లు ప్రభుత్వానికి ఖర్చు అవుతుందనేది అధికారుల అంచనా. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రాథమిక నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్టు తెలిసింది. ఈ పథకాన్ని ఎప్పటి నుండి అమలు చేస్తారనేది తేలాల్సి వుంది. విద్యుత్ వినియోగదారులు ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఏడాది మొత్తంలో నెలకు 200 యూనిట్ల చొప్పున వారికి అమలు చేస్తారా? ఎన్ని యూనిట్లు వాడుకున్నా 200 యూనిట్ల వరకు అందరికీ ఇస్తారా? అన్నది ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆధారపడి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తుల ఎంట్రీ పూర్తి అయిన తర్వాత మార్గదర్శకాలు విడుదల చేస్తామని ప్రభుత్వం చెప్పిన విషయం తెలిసిందే.

హైకోర్టుకు యూనివర్సిటీ భూములివ్వడం అన్యాయం

ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ



నవతెలంగాణ-రాజేంద్రనగర్

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు భవన నిర్మాణానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములు వంద ఎకరాలు కేటాయించడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థుల నిరసనకు సోమవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ తరపున మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీని సంప్రదించకుండా.. ఉద్యానవన యూనివర్సిటీకి చెందిన 43.6 ఎకరాలు, వ్యవసాయ యూనివర్సిటీ భూములు 57.4 ఎకరాలను హైకోర్టు నిర్మాణానికి కేటాయించడం సరికాదన్నారు. తొందరపాటుతో జీఓ 55 తీసుకొచ్చారన్నారు. దీని వల్ల యూనివర్సిటీలో ఉన్న 400 రకాల వృక్ష జాతులు, 80 రకాల పక్షి జాతులు, 350 అరుదైన జాతులు అంతరించి, జీవవైవిధ్యం నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ పరిశోధనలకు, జీవ వైవిధ్యానికి నష్టం చేసే చర్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూతన విత్తన అభివృద్ధి, వంగడాల అభివృద్ధి, వ్యవసాయంలో నూతన సంస్కరణల అమలుకు వేలాది ఎకరాల భూమి అవసరం అన్నారు. ఈ భూములను యూనివర్సిటీకే ఉంచి, హైకోర్టుకు వేరే ప్రాంతంలో భూములు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి.శంకర్, జిల్లా నాయకులు ఎం.స్టాలిన్, వేణు ప్రకాశ్, యూనివర్సిటీ విద్యార్థి నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ, శంకర్, వంశీ, అరవింద్, మధుకర్, శివజ్యోతి, నవీన్, విక్రమ్‌రెడ్డి, భానుచందర్, సుభాష్, అజయ్, సురేందర్, తేజ తదితరులు పాల్గొన్నారు.



దిల్‌సుఖ్‌నగర్ బస్ డిపోలో అగ్ని ప్రమాదం

- రెండు బస్సులు దగ్ధం..!

నవతెలంగాణ - చైతన్యపురి

హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ డిపోలో సోమవారం ఆగి ఉన్న బస్సులో మంటలు చెలరేగి మరో బస్సుకు వ్యాపించాయి. ఈ ఘటనలో రెండు బస్సులు దగ్ధమయ్యాయి. డిపోలో తెల్లవారుజామున ఆగి ఉన్న బస్సులో ఒక్కసారిగా పొగలు వచ్చాయి. గమనించిన సిబ్బంది వెంటనే అధికారులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అయితే ఫైర్ సిబ్బంది వచ్చేలోపే మంటలు లేచి ఇంకో బస్సుకు కూడా అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పారు. మిగతా బస్సులకు మంటలు వ్యాప్తి చెందకుండా అదుపులోకి తీసుకొచ్చారు. డిపో మేనేజర్ హరి మలక్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్టు భావిస్తున్నారు.

ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ-వరంగల్



ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని అటవీ దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కలెక్టర్ పి.ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖేడేతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 55 వినతులు స్వీకరించారు. వీటిని పరిశీలించి త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

పిల్లలపై కుక్కల దాడి కలచివేసింది

వారిని తల్లిదండ్రులు ఒంటరిగా వదలొద్దు

- కుక్కల, కోతుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ : దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఆస్పత్రిలో చిన్నారికి పరామర్శ



నవతెలంగాణ-మట్టెవాడ

పిల్లలపై కుక్కల దాడి ఘటన తనను కలచివేసిందని దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ నగర పరిధి 21వ డివిజన్ ఎల్‌బీనగర్‌లో ఆదివారం కుక్కల దాడిలో గాయపడి గార్డియన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని మంత్రి పరామర్శించారు. ప్రభుత్వపరంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. ఆడుకుంటున్న పిల్లలపై కుక్కలు దాడి చేశాయని, ఇదే క్రమంలో తప్పించుకునే క్రమంలో బాబు పరుగెత్తి ఇంటి గద్దెపై పడటం వల్ల తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు. చేతులపై కుక్క గాట్లు ఉన్నాయని, పిల్లలకు యాంటీరెబీస్ ఇంజక్షన్‌లు ఇచ్చినట్టు చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాబుకు ప్లాస్టిక్ సర్జరీ అవసరం ఉన్నట్టుగా వైద్యులు చెప్పారని, ప్రభుత్వం నుంచి ఎల్‌ఓసి అందజేసి ఆదుకుంటామని అన్నారు.

బల్దియా నుంచి ప్రతి రోజూ 30 కుక్కలను పట్టుకొని శస్త్ర చికిత్సలు నిర్వహించి 2-3 రోజులు పర్యవేక్షణలో ఉంచున్నట్టు చెప్పారు. కుక్కలకు శస్త్ర చికిత్సలు చేసి సంతానోత్పత్తిని కట్టడి చేయడం జరుగుతుందన్నారు. పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడూ జీడబ్ల్యుఎంసి అధికారులు అప్రమత్తంగా ఉంటూ తగు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. మంత్రి వెంట బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, గార్డియన్ ఆస్పత్రి అధినేత డాక్టర్ కాళీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

చైనాలో కొండచరియలు విరిగిపడి 47మంది గల్లంతు

బీజింగ్ : వాయవ్య చైనాలో పర్వత ప్రాంతమైన యునాన్ ప్రావిన్స్‌లో సోమవారం కొండచరియ విరిగిపడడంతో ఇద్దరు మరణించగా, మరో 47మంది ఆచూకీ గల్లంతైందని అధికారులు తెలిపారు. స్థానిక కాలమానం ప్రకారం, సోమవారం తెల్లవారు జామున 5.51 గంటలకు ఈ ప్రమాదం జరిగిందని ప్రభుత్వ వార్తా సంస్థ జిన్హువా తెలిపింది. కొండచరియలు విరిగి ప్రాంతం నుంచడి 500మందికి పైగా ప్రజలను ఖాళీ చేయించారు. తక్షణమే అత్యవసర సహాయక బృందాలను రంగంలోకి దింపారు. శిధిలాల కింద చిక్కుకుపోయిన వారిని వెలికి తీసేందుకు చర్యలు చేపట్టారు. గల్లంతైన వారి కోసం గాలింపు మొదలైందని అధికారులు తెలిపారు. 33 అగ్నిమాపక యంత్రాలు, పది లోడింగ్ యంత్రాలతో 200మందికి పైగా సిబ్బంది ఈ గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం అన్ని రకాల చర్యలు చేపట్టాల్సిందిగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశించారు.

ఐర్లాండ్, బ్రిటన్‌ల్లో ఇషా తుపాను బీభత్సం

అంధకారంలో లక్షలాదిమంది

- వందలాది రైళ్లు రద్దు

లండన్:బ్రిటన్, ఐర్లాండ్‌లను శీతాకాలపు తుపానులు ముంచెత్తుతున్నాయి. తాజాగా సోమవారం సంభవించిన ఇషా తుపాను రెండు దేశాల్లో బీభత్సాన్ని సృష్టించింది. తుపాను ధాటికి వందలాది రైళ్ల రద్దయ్యా యి. అనేక విమానాలను రద్దు చేయడమో, దారి మళ్లించడమో చేశారు. వేలాదిమంది ప్రజలు విద్యుత్ లేక అంధకారంలో చిక్కుకు న్నారు. ఐర్లాండ్‌లో దాదాపు 2,30,000 ఇళ్ళకు, వాణిజ్య సంస్థలకు విద్యుత్ లేకుండా పోయింది. పొరుగునున్న మరో దీవిలో 40వేల మంది చీకటిలో చిక్కుకున్నారు. గంటకు దాదాపు 160కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. కుండపోతగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇషా తుపానుకు ముందుగానే అసాధారణమైన గాలులు వీస్తాయని బ్రిటన్ వాతావరణ శాఖ హెచ్చరించింది.

గత రాత్రి పరిస్థితి భయంకరంగా తయారైందని, ఈశాన్య ఇంగ్లండ్‌లో బ్రిజీవుడ్ రాడార్ స్టేషన్ వద్ద గాలుల తీవ్రత గంటకు 160కిలోమీటర్లుగా నమోదైందని అధికారులు చెప్పారు. సెప్టెంబరు నుండి వరుసగా ఐర్లాండ్, బ్రిటన్‌ల్లో తుపానులు విరుచుకుపడు తున్నాయి. ఈ తుపానుల ధాటికి మహా వృక్షాలు సైతం నేలకూలుతున్నాయి. వరదలు ముంచెత్తుతున్నాయి. విద్యుత్ వైర్లు తెగిపడడంతో ప్రజలు అంధకారంలో మగ్గాల్సి వస్తోంది. చెట్లు కూలడం, వరదల తాకిడికి స్కాట్లాండ్, ఉత్తర ఇంగ్లండ్‌ల్లో ప్రధాన రహదారులన్నీ దెబ్బతిన్నాయి. దాంతో రాకపోకలు స్తంభించాయి.

షిండే గ్రూపు ఎమ్మెల్యేలకు సుప్రీం కోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: మహారాష్ట్ర స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్ధవ్ ఠాక్రే గ్రూపు దాఖలు చేసిన పిటీషన్‌పై స్పందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, అతని గ్రూపు ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. షిండే గ్రూపే నిజమైన శివసేన అని స్పీకర్ రాహుల్ నర్వేకర్ నిర్ణయాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్ధవ్ ఠాక్రే పిటీషన్‌ను ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం విచారించింది. రెండు వారాల్లోగా ఈ పిటీషన్‌పై స్పందించాలని షిండే, ఎమ్మెల్యేలను ఆదేశించింది. ఈ పిటీషన్‌ను ముందుగా హైకోర్టులో ఎందుకు వేయలేదని ఉద్ధవ్ ఠాక్రే తరపు న్యాయవాదులను ప్రశ్నించింది. ఈ ప్రశ్నకు వారు సమాధానం ఇస్తూ 'సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగానే అనర్హత ప్రక్రియలను స్పీకర్ నిర్ణయిస్తారు. అలాగే ఎన్నికల ముందు ఈ అంశాన్ని మరింత జాప్యం చేయడం ఇష్టం లేక సుప్రీంకోర్టును ఆశ్రయించాం' అని సమాధానం ఇచ్చారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికీ తీసుకెళ్తాం

- 26న రాష్ట్రవ్యాప్తంగా ట్రాక్టర్, వాహనాల ర్యాలీ
- ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయాలి
- ఎస్‌కేఎం, కార్మిక సంఘాల జేఏసీ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వ తీరును ఇంటింటికీ తీసుకెళ్తామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కార్మిక సంఘాల జేఏసీ, వ్యవసాయ కార్మిక సంఘాలు ప్రకటించాయి. బీజేపీని గద్దెదించడమే తమ లక్ష్యమని పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ సర్కారు అమలు చేస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న రాష్ట్ర రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, వాహనాల ర్యాలీలను నిర్వహిస్తున్నట్టు వెల్లడించాయి. వచ్చేనెల 16న గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయాలని కోరాయి. సోమవారం హైదరాబాద్‌లోని నారాయణగూడ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఎస్‌కేఎం, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎం కన్వీనర్లు టి సాగర్, పశ్యపద్మ, రాయల చంద్రశేఖర్, బిక్షపతి, జక్కుల వెంకటయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్ బాలమల్లేష్ మాట్లాడుతూ చారిత్రాత్మక రైతు ఉద్యమ సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని చేయలేదన్నారు. రుణమాఫీ చట్టం రూపొందించలేదని అన్నారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించలేదని చెప్పారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. దేశంలో సహకార వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. బడ్జెట్‌లో నిధులకు కోత పెడుతున్నారనీ, ఎరువుల సబ్సిడీని తగ్గిస్తున్నారని చెప్పారు. 2013 భూసేకరణ చట్టానికి కేంద్రం తూట్లు పొడిచిందన్నారు. విద్యార్థి, యువజన, మహిళా, సామాజిక సంఘాలు, మేధావులను ఈ ఉద్యమంలో భాగస్వాములను చేస్తామని అన్నారు. రైతు సమస్యలను పరిష్కరించకపోవడం, ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. మతోన్మాదానికి అండగా ఉంటారా?, ప్రజా సమస్యల పరిష్కారానికి అండగా ఉంటారా? రాజకీయ పార్టీల నేతలు నిర్ణయం తీసుకోవాలని కోరారు. బీజేపీకి వ్యతిరేకంగా సాగుతున్న ఈ పోరాటంలో రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 26న హైదరాబాద్‌లోని సుందరయ్య పార్క్ నుంచి ఇందిరాపార్క్ వరకు వాహనాల ర్యాలీని చేపడతామన్నారు. రైతులు, కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను మోడీ ప్రభుత్వం పరిష్కరించకుండా వాటిని దారి మళ్లించటంలో భాగంగానే బాల రాముడి ప్రాణప్రతిష్ట పేరుతో మభ్యపెడుతున్నదని విమర్శించారు. మతం, రాముడు, నమ్మకం, భక్తి వ్యక్తిగతమైనవని అన్నారు. బీజేపీ పాలకులు మతాన్ని రాజకీయాలకు జోడించి హిందూత్వ నినాదాన్ని ముందుకు తెచ్చేందుకు కుట్ర చేస్తున్నారని చెప్పారు. తద్వారా మెజార్టీగా ఉన్న హిందువుల ఓట్లు పొందటానికి చేస్తున్న కుతంత్రం ఇది అని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, మహిళా విభాగం కన్వీనర్ బొప్పని పద్మ, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కె కాంతయ్య, ఎస్‌కేఎం నాయకులు శంకర్, పల్లవి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు ప్రభు లింగం తదితరులు పాల్గొన్నారు.



బీజేపీని గద్దెదించడమే మా లక్ష్యం

ఇన్నేళ్లూ ఏం చేశావు?

- ఎన్నికల వేళ గుర్తొచ్చామా?
- బీజేపీ ఎంపీని అడ్డుకున్న దళితులు



బెంగళూరు : కర్నాటకలోని మైసూరు ఎంపీ ప్రతాప్ సింహకు చేదు అనుభవం ఎదురైంది. తమ గ్రామానికి రావద్దంటూ మైసూరు జిల్లా గుజ్జెగౌడనపురా గ్రామ దళితులు సోమవారం ఆయన్ని అడ్డుకున్నారు. అయోధ్యలో జరిగిన బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని గ్రామ స్థులు ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో ఓ దేవాలయ నిర్మాణం కోసం భూమిపూజను నిర్వ హించారు. దీనికి హాజరయ్యేందుకు ఎంపీ రాగా వారు ఆయన్ని నిలువరించారు. అయోధ్య రామ మందిరంలో ఏర్పాటు చేసిన రామ్ లల్లా విగ్రహానికి అవసరమైన శిలను గ్రామానికి చెందిన దళితుడైన రామదాసు తన భూమి నుంచి విరాళంగా అందజేశారు. దేవాలయ నిర్మాణానికి కావాల్సిన భూమిని కూడా ఆయనే ఉచితంగా ఇచ్చారు.

మెడ చుట్టూ కాషాయ కండువా వేసుకున్న ప్రతాప్ సింహ దళితులలో వాగ్వివాదానికి దిగిన దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యాయి. నిరసన తెలుపుతున్న ఓ వ్యక్తిపై పోలీసులు జులుం ప్రదర్శించారు. అతని మెడపై చేతులు వేసి దౌర్జన్యం చేశారు. 'మీరు గత పది సంవత్సరాలుగా ఈ ఊరికి రాలేదు. ఇప్పుడు రాజకీయ కారణాలతో వచ్చారు. అసలు మీరు ఎప్పుడూ మేము చెప్పేది విన్పించుకోలేదు. మీరు ఇక్కడికి రావడం మాకు ఇష్టం లేదు' అని తాలూకా పంచాయతీ మాజీ సభ్యుడు సురేష్ నిలదీశారు. సింహకు రక్షణగా వచ్చిన పోలీసులు అతన్ని పక్కకు లాగి ఎంపీని వాహనంలో తరలించారు. ఆ సమయంలో స్థానిక జనతాదళ్ (సెక్యులర్) ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ కూడా అక్కడే ఉన్నారు. కాగా రామదాసు బంధువైన స్వామి హరోహల్లి విలేకరులతో మాట్లాడుతూ 'గత సంవ త్సరం ప్రతాప్ సింహ మా దళితుల పైన, నాయకుల పైన అవాకులు చవాకులు పేలారు.

ఆయన ఆదేశాలతో కొందరు గ్రామస్థులను అరెస్ట్ కూడా చేశారు. ఆయన మా గ్రామం గురించి ఎప్పుడూ పట్టించుకోలేదు. మా సమస్యలు అడగలేదు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు దగ్గరకు వచ్చాయి. అందుకే వచ్చారు' అని అన్నారు.

గ్రామస్థుల నుండి తీవ్రమైన ప్రతిఘటన ఎదురు కావడంతో కొద్ది నిమిషాల వ్యవధిలోనే ప్రతాప్ సింహ అక్కడి నుంచి వెళ్లిపోయారు. దళితులకు నచ్చచెప్పేందుకు స్థానిక ఎమ్మెల్యే, ఇతర నేతలు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది.

సింహ గతంలో ఇద్దరు వ్యక్తులకు పార్లమెంట్ విజిటింగ్ పాసులు ఇవ్వడం, వారు ఆ పాసులతో చట్టసభలో ప్రవేశించి గలాభా సృష్టించడం తెలిసిందే. అయినప్పటికీ లోక్‌సభ స్పీకర్ ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- రాజ్యాంగం పుస్తకాన్ని గిరిజన విద్యా సంస్థల్లో ఉంచాలి : సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మార్చిలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులు వంద శాతం ఉతీర్ణత సాధించాలని పంచాయితీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గిరిజన గురుకులాల ప్రిన్సిపల్స్, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమాధికారులతో సోమవారం హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల పరీక్షా ఫలితాల కోసమే కాకుండా..వారి సర్వతోముఖాభివృద్ధికి ఆయా సంస్థల అధికారులు కృషి చేయాలని సూచించారు. తమ చుట్టూ ఉన్న పరిస్థితులతో పాటు జనరల్ నాలెడ్జ్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వీటితో పాటు నైపుణ్య శిక్షణ,కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా పాఠ్యాంశాల్లో భాగంగా ఉండాలని సూచించారు. అధికారులందరూ గిరిజనుల జీవన నేపథ్యం, వారు ఎదుర్కొంటున్న సమస్యల అర్థం కావాలంటే క్షేత్ర స్థాయిలో పనిచేయాలన్నారు. అప్పుడే ప్రభుత్వం ఆశించిన మేరకు అభివృద్ధి జరుగుతుందన్నారు. భారత రాజ్యాంగం పుస్తకాన్ని ప్రతి గిరిజన విద్యా సంస్థలోనూ ఉంచాలనీ, విద్యార్థులకు దీనిపై పూర్తిగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే దానిపై క్విజ్ పోటీలను నిర్వహించి విద్యార్థులు చురుకుగా పాల్గొనేలా చూడాలన్నారు. వంద శాతం ఫలితాలు సాధిస్తామని అధికారులు, ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు మంత్రి సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల్లో చదువుచున్న విద్యార్థులకు పౌష్టిక ఆహారంలో భాగంగా గిరిజన కార్పొరేషన్ తయారు చేసిన తేనెను ప్రతి రోజు 50 గ్రాములు ఉచితంగా ఇచ్చే పథకాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి ఎ.శరత్, గిరిజన సంక్షేమ డైరెక్టర్ ఇవి నరసింహా రెడ్డి, గిరిజన గురుకుల సొసైటీ కార్యదర్శి నవీన్ నికోలస్, ఆడిషనల్ డైరెక్టర్ వి. సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శంకర్, ట్రైకార్ జీఎం శంకర్ రావ్, జాయింట్ డైరెక్టర్‌లు కళ్యాణ్ రెడ్డి, సముజ్వల, డిప్యూటీ డైరెక్టర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మార్పు వస్తుందనే భయంతోనే

రాహుల్ యాత్రపై బీజేపీ గుండాల దాడియత్నం

- నిరసనగా టీపీసీసీ ప్రదర్శన : టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత్ జోడో న్యాయ్ యాత్రతో దేశంలో మార్పు వస్తుందనే భయంతోనే బీజేపీ గుండాలు రాహుల్ గాంధీపై దాడి చేశారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శించారు. అస్సాంలో బీజేపీ గుండాలు అడ్డుకుని దాడికి ప్రయత్నించడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ ఇచ్చిన పిలుపులో భాగంగా టీపీసీసీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ బాబు జగ్జీవన్‌రాం విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షీ, మంత్రి శ్రీధర్ బాబు, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, మధుయాష్కీ, ఎమ్మెల్సీలు మహేష్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్, మాజీ కేంద్ర మంత్రులు బలరాం నాయక్, రేణుక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ దేశంలో నెలకొన్న విపరిణామాలపై న్యాయం కోసం రాహుల్ యాత్ర చేస్తుంటే బీజేపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటివి జరగడం మంచిది కాదని హితవు పలికారు. ప్రజలకు అందుబాటులో లేకుండా బీజేపీ పాలన చేస్తున్నదనీ, దేశంలో న్యాయం కరువైందని విమర్శించారు. దేశంలో అందరూ అన్నదమ్ముల్లా కలిసి ఉండాలనీ, అన్ని కులాలు, మతాలు ఒక్కటేననే ప్రేమతో బతకాలని రాహుల్ భారత్ జోడో యాత్ర చేశారని గుర్తు చేశారు. ఇటీవల దేశంలో హింస పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో రెండు తెగల మధ్య జరిగిన హింసాత్మక ఘటనలపై బీజేపీని రాహుల్ గాంధీ ప్రశ్నించారనీ, మోడీ వైఫల్యాలపై నిలదీశారని తెలిపారు. దానికి కొనసాగింపుగా దేశంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాలను ఎండగట్టాలనీ, ప్రజలను జాగరూకులను చేయాలని న్యాయ యాత్ర చేపట్టారని చెప్పారు. ఈ యాత్రతో దేశంలో ప్రజల్లో ఐక్యంగా ఉండేందుకు మనో ధైర్యం ఇస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను రాహుల్ గాంధీ వెలుగులోకి తెస్తుంటే బీజేపీ సహించలేకపోతున్నదని విమర్శించారు. బీజేపీ నాయకులు ఇలాంటి పద్ధతులను మానుకోవాలని జగ్గారెడ్డి హితవు పలికారు. మాజీ మంత్రి పుష్పలీల, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి -మంత్రి శ్రీధర్ బాబు

రాహుల్ గాంధీకి భద్రత కల్పించడంలో విఫలమైన అస్సాం ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. రాహుల్‌కు వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక బీజేపీ దాడులు చేస్తున్నదని విమర్శించారు. బీజేపీ లాగే కాంగ్రెస్ పార్టీకి కూడా దేశవ్యాప్తంగా కార్యకర్తలు, అభిమానులున్నారనీ, అయినా ఎప్పుడైనా దాడులు చేశామా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని చెప్పారు.

మా దగ్గర ఉన్నప్పుడు ఒకే...కానీ ఇప్పుడే : రేణుకాచౌదరి

అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ తమ దగ్గర ఉన్నప్పుడు బాగానే ఉండేవాడని కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి గుర్తుచేశారు. బీజేపీలోకి వెళ్లాక దారుణంగా తయారయ్యారనీ, అస్సాం ప్రజలు హిమంత్‌ను ఛీ కొడుతున్నారని తెలిపారు.

తమ్మినేనికి అద్దంకి దయాకర్ పరామర్శ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ సోమవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఏఐజీ ఆస్పత్రి వైద్యులను అడిగి మరిన్ని వివరాలు తెలుసుకున్నారు. తమ్మినేని త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి తిరిగి రావాలని దయాకర్ ఆకాంక్షించారు. గుండె, కిడ్నీ, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యతో బాధపడుతున్న తమ్మినేనిని ఈనెల 16న హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. వైద్యుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తున్నది. ఆస్పత్రిని సందర్శించిన వారిలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి ప్రభాకర్ ఉన్నారు.

మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక రెడీ ?

- రూ.3200 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం
- వారం రోజుల్లో సర్కారుకు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో అవినీతి చోటుచేసుకున్నట్టు తెలిసింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ శాఖ రిపోర్టు వారం, పది రోజుల్లో సర్కారుకు చేరే అవకాశాలు ఉన్నాయి. విజిలెన్స్ డీజీ రాజీవ్ రతన్ నేతృత్వంలోని బృందం ఇటీవల మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన సంగతి తెలిసిందే. బ్యారేజీ కుంగడం, తదితర పరిస్థితులపై సమగ్రంగా విచారణ చేసినట్టు సమాచారం. మొత్తం ప్రాజెక్టు మొత్తం నాసిరకంగా ఉన్నట్టు నివేదిక ఇవ్వనున్నట్టు సమాచారం. కాగా మధ్యంతర నివేదికను ప్రభుత్వానికి ఇచ్చేందుకు రాజీవ్‌రతన్ బృందం సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది.కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదిక ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు ఇప్పటి వరకు రూ.1.26 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. ఇంకా రూ. 50 వేల కోట్లు కావాలని పాత సర్కారు అంచనా. అయితే ఇటీవల సాగునీటి, ఆర్థిక శాఖల సమీక్షలో కాళేశ్వరం కోసం ఇంకా కనీసం రూ.25 వేల కోట్లు అవసరమని తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా భారీ ప్రచారం చేసుకున్న బీఆర్ఎస్ సర్కారు ఇప్పుడు కాళేశ్వరం కుంగుబాటు నేపథ్యంలో అప్రతిష్టపాలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోవడానికి ఒక కారణమైంది. దీనిపై ఇంటెలిజెన్స్ సైతం గతంలోనే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నివేదికలిచ్చింది. రాజీవ్ రతన్ త్వరలో ఇచ్చే నివేదికలో సుమారు రూ. 3200 కోట్ల మేర అవినీతి జరిగినట్టు పేర్కొనే అవకాశం ఉన్నట్టు సమాచారం. పూర్తిస్థాయి విచారణ పూర్తికానప్పటికి, త్వరలో పార్లమెంటు ఎన్నికలు ఉన్న నేపథ్యంలో బీఆర్ఎస్‌ను టార్గెట్ చేసేందుకు కాంగ్రెస్ సర్కారు మధ్యంతర నివేదికను తెప్పించుకుంటున్నద నే ప్రచారం రాజకీయవర్గాల్లో జరుగుతున్నది.

గోద్రా సబ్ జైలులో లొంగిపోయిన బిల్కిస్ బానో కేసు దోషులు

అహ్మదాబాద్ : బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషులు గుజరాత్‌లోని పంచమహల్ జిల్లాలో గల గోద్రా సబ్‌జైలులో లొంగిపోయారు. గుజరాత్ ప్రభుత్వం దోషులకు మంజూరు చేసిన రెమిషన్‌ను భారత సర్వోన్నత న్యాయస్థానం ఈ నెల 8న రద్దు చేసిన విషయం విదితమే.

రెండు వారాల్లో జైలు అధికారుల ముందు లొంగిపోవాలని ఈ సందర్భంగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు దోషులు సబ్ జైలులో సరెండరయ్యారు.

జీవో 142ను రద్దు చేయాలి

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మానవ వనరుల హేతబద్ధీకరణ కోసమంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన జీవో 142 లోపభూయిష్టంగా ఉందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ విమర్శించింది. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ నెహ్రూ చంద్ నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. క్షేత్రస్థాయి నుంచి సమాచారం తీసుకోకుండా ఏకపక్షంగా విడుదల చేసిన ఈ జీవో ప్రజారోగ్యరంగానికి గొడ్డలిపెట్టు లాంటిందని తెలిపారు. టీబీ శానిటోరియం, రాష్ట్ర స్థాయి శిక్షణా కేంద్రాల ఎత్తివేత, కొన్ని పోస్టుల రద్దు నిర్ణయాలు సహేతుకంగా లేవని పేర్కొన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ హెల్త్ ఎడ్యుకేషన్ చేసిన హెల్త్ ఎడ్యుకేటర్లను పరిగణలోకి తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 123 ఇన్‌స్టిట్యూట్‌లను రద్దు చేస్తే 4,318 ఉద్యోగాలను కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో రద్దు కాకుండా అమలు చేసేందుకు కొంత మంది ఉన్నతాధికారులు అత్యుత్సాహంతో దొడ్డిదారిన ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జోక్యం చేసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ ఉద్యోగులందరికీ ఒకేసారి వేతనాలివ్వాలి

- డిసెంబర్ నెల వేతనాలు ఇవ్వని జిల్లాలకు తక్షణమే చెల్లించాలి
- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని అంగన్‌వాడీ ఉద్యోగులందరికీ ఒకేసారి వేతనాలివ్వాలనీ, డిసెంబర్ నెల వేతనాలు అందని జిల్లాలకు తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, కోశాధికారి పి.మంగ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణకు ఆన్‌లైన్ ద్వారా లేఖ పంపారు. 'ప్రతి నెలా 14న అందాల్సిన వేతనాలను 21 వేశారు. అదీ కొన్ని జిల్లాలకే. ఆదిలాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి, యాద్రాద్రి భువనగిరి, నిజామాబాద్, మంచిర్యాల, మేడ్చల్, నిర్మల్, రంగారెడ్డి, మెదక్ తదితర జిల్లాల్లో డిసెంబర్ నెల వేతనాలు ఇంకా రాలేదు. కొన్ని జిల్లాలకు వేతనాలు వచ్చి, కొన్ని జిల్లాలకు వేతనాలు ఇంకా రాకపోవడంతో అంగన్‌వాడీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఒకేపని చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులకు వేతనాలిచ్చే సందర్భంలో ఈ విధంగా వ్యత్యాసం చూపించడం సమంజసం కాదు' అని కరుణ దృష్టికి లేఖ ద్వారా తీసుకెళ్లారు. ప్రతినెలా 14వ తేదీనే వేతనాలు చెల్లిస్తామని గత ప్రభుత్వం ఇచ్చిన హామీని కూడా ప్రస్తావించారు. పై అంశాలు పరిశీలించి పరిష్కరించాలనీ, అంగన్వాడీ ఉద్యోగులందరికీ ప్రతినెలా 14వ తేదీన ఒకేసారి వేతనాలు చెల్లించాలని కోరారు.

వేతనాల పెంపు, పర్మినెంట్ కోసం

ఫిబ్రవరి 16న జీహెచ్‌ఎంసీ కార్మికుల సమ్మె : జేఏసీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వేతనాల పెంపు, పర్మినెంట్ కోసం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఫిబ్రవరి 16న కార్మికులంతా సమ్మెలోకి వెళ్లాలని జీహెచ్‌ఎంసీ కార్మిక, ఉద్యోగ సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. సమ్మె సన్నాహకంలో భాగంగా ఈ నెల 26 మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లో వాహనాలతో నిరసన ర్యాలీ తీయాలనీ, ఫిబ్రవరి 6 మధ్యాహ్నం రెండు గంటలకు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద సదస్సు నిర్వహించాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 7 నుంచి 14 వరకు సర్కిల్, జోన్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలనీ, ఫిబ్రవరి 16 సమ్మె విజయవంతం చేయాలని తీర్మానించింది. సోమవారం హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బారామారావు అధ్యక్షతన జేఏసీ సమావేశం జరిగింది. అందులో మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ చైర్మెన్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సీఐటీయూ యూనియన్ నాయకులు జె. వెంకటేష్, పి. సుధాకర్, శ్రావణ్‌కుమార్, మల్లేష్, యాదమ్మ, మంగపతి, అంజయ్య, ఏఐటీయూసీ నాయకులు మద్దిలేటి, హెచ్‌ఎంఎస్ యూనియన్ నాయకులు అంజాద్, భిక్షపతి, బీఆర్‌టీయూ యూనియన్ నాయకులు కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు జేఏసీ బృందం సమ్మె నోటీసు అందజేసింది. కార్మిక చట్టాలను అమలు చేయాలనీ, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలనీ, పీఎఫ్, ఈఎస్ఐని ఖచ్చితంగా అమలు చేయాలని కోరింది. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనీ, కేటగిరీల వారీగా వేతనాలివ్వాలని డిమాండ్ చేసింది. ఆరు గ్యారంటీల్లో మున్సిపల్ కార్మికులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. వయస్సు మీరిన, చనిపోయిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఎలాంటి జాప్యం లేకుండా ఉద్యోగం ఇవ్వాలనీ, బయో మెట్రిక్ హాజరు పట్టీలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని డిమాండ్ చేసింది.

హైకోర్టు తీర్పు ప్రకారం జీహెచ్‌ఎంసీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలనీ, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి-సమాన వేతనం ఇవ్వాలని కోరింది. పారిశుధ్య సేవల్లో ప్రయివేటు చర్యలను ఉపసంహరించాలనీ, రాంకీ తదితర ప్రయివేటు ఇంజినీరింగ్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. గత ఒప్పందాల ప్రకారం జీహెచ్‌ఎంసీ కార్మికులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరింది.

ధరణిపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది

- ఇప్పటికే అనేక సమస్యలను గుర్తించాం
- త్వరలో మధ్యంతర నివేదిక
- ధరణి కమిటీ సభ్యులు కోదండ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధరణిపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందనీ, సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ధరణి కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎం.కోదండరెడ్డి తెలిపారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కమిటీ ధరణి పోర్టల్‌లో ఉన్న సమస్యలపై లోతుగా అధ్యయనం చేస్తున్నదనీ, ఇప్పటి వరకు గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారంపై సాధ్యమైనంత త్వరగా మధ్యంతర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని వెల్లడించారు. ఈ రంగంలో నిష్ణాతులైన ఎంపిక చేసిన నలుగురైదుగురు కలెక్టర్లతో ఈ నెల 24 సమావేశం ఏర్పాటు చేసి వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోనున్నట్టు తెలిపారు. ఆర్డీవో, ఎమ్మార్వోలతో పాటు భూ సమస్యలతో సంబంధమున్న వ్యవసాయ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ తదితర శాఖలతో సమావేశం కానున్నట్టు చెప్పారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి రైతులతో పాటు అన్ని పక్షాల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటామని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోని రెవెన్యూ విధానాలను సైతం అధ్యయనం చేయనున్నట్టు తెలిపారు. 2014కు ముందున్న రెవెన్యూ విధానాన్ని కాదని గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పోర్టల్ తప్పిదాల వల్ల కొంత మంది రైతులు తమ భూ హక్కును కోల్పోయారనీ, ఫలితంగా వారికి రావాల్సిన రాయితీలు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు మాజీ ఐఏఎస్ అధికారి రేమండ్ పీటర్ మాట్లాడుతూ ధరణిలోని సమస్యలను తాత్కాలిక, దీర్ఘకాలిక అని రెండు రకాలుగా విభజించామన్నారు. సాధ్యమైనంత వరకు అన్ని సమస్యలకు పరిష్కారాలు కనుగొని తగిన సిఫార్సులను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మధుసూదన్, సునీల్, లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

సంపాదకీయం

పేదరికం తగ్గిందంట!

దేశంలో కుట్రకు తెరలెగిసింది. పేదలను పేదలే కాదంటున్నారు. ఆ జాబితా నుంచి వారిని తొలగించారు. ఉన్న పళంగా 25 కోట్ల మంది పేదరికం నుంచి బలవంతంగా గెంటివేయబడ్డారు. తాజాగా విడుదలైన నిటి ఆయోగ్ నివేదిక ఫలితం ఇదే. ఇప్పుడు వారికి సంక్షేమ పథకాలు నిరాకరించబడతాయి. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు ఈ రాజకీయ వ్యూహం వెనుక రెండు లక్ష్యాలనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. పాతికకోట్ల మందిని ప్రభుత్వ సంక్షేమ పరిధిలో నుంచి గెంటేయడం ఒకటి అయితే, ఘనత వహించిన పాలనలో పేదల సంఖ్య తగ్గిందని ఎన్నికల ముందు ప్రచారం చేసుకోవడం రెండోది.

2013-14లో 29.17శాతంగా ఉన్న పేదరిక నిష్పత్తి 2022-23 నాటికి 11.28శాతానికి దిగివచ్చిందంటోంది నిటి ఆయోగ్. కానీ, ఇవి అసత్యాలే అని కుండబద్దలు కొట్టి మరి చెబుతుంది ఆక్స్ ఫామ్ నివేదిక. అన్నింటిలోనూ మన దేశం నేల చూపులే తప్ప తలెత్తుకునే పరిస్థితి లేదని ఆ నివేదిక సారాంశం. ఇలా.. ఏ రంగం వైపు చూసినా 'ఏమున్నది గర్వ కారణం' అన్నట్టుగానే పరిస్థితులున్నాయి.

దారిద్ర్య రేఖ దిగువన కొరతల కొలిమిలో మగ్గుతున్న వారెందరో నిగ్గుతేల్చడానికి అనుసరిస్తున్న విధివిధానాలను తప్పులతడకగా నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ గతంలోనే తూర్పారపట్టారు. ఆకలిని, పోషకాహార లోపాల్ని దీటుగా ఎదుర్కోవడంలో 25 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు విఫలమవుతున్నట్టు ఆమధ్య నిటిఆయోగే స్వయంగా వెల్లడించింది. గతంలో మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు వేసిన సురేష్ టెండూల్కర్ కమిటీలాంటివి కూడా పేదరికాన్ని కొలవడానికి నగరాల, పట్టణాలకు, గ్రామాలకు వేర్వేరు కొలమానాలను పెట్టారు. ఇప్పుడు ఆ కొలమానాలు కూడా లేని స్థితిలో నిటి ఆయోగ్ ఇప్పుడు వల్లె వేస్తున్నవన్నీ కేవలం ఉజ్జాయింపు లెక్కలే. జాతీయ నమూనా సర్వే స్థానే పేదరిక అధ్యయనం నిర్వహించాలన్న పార్లమెంటరీ స్థాయీసంఘం సిఫార్సుకు ఆమోదం లభించే దాకా, ఎవరేం చెప్పినా... అవన్నీ కాకిలెక్కలే!

దేశంలో ఆకలితో నకనకలాడుతున్నవారు 50 కోట్లపైనేనని సక్సేనా కమిటీ, 75కోట్లని అర్జున్‌సేన్ గుప్తా కమిటీ లెక్కలుకట్టాయి. దేశవ్యాప్తంగా 81.35 కోట్ల మంది అన్నార్తులకు ఉచితంగా తిండిగింజల పంపిణీ కార్యక్రమాన్ని మరో అయిదేండ్లపాటు ఈ మోడీ ప్రభుత్వమే పొడిగించింది. అంటే దీని అర్థమేమిటి? ఇప్పటికీ వ్యవసాయం, చేనేత, లఘు పరిశ్రమలు వంటివి పడావుపడి సంక్షోభంలో కొట్టాడుతున్న కోట్లాది జీవితాలు అర్ధాకలి, పస్తులతోనే గడుస్తున్నాయి. 125 దేశాలను పరిగణనలోకి తీసుకున్న అంతర్జాతీయ ఆకలిసూచీలో భారత్‌కు111వ స్థానం దక్కడం దేశీయంగా ఆకలి మంటల ప్రజ్వలనాన్ని కళ్లకు కడుతోంది.

> ఏ దేశ సుస్థిరాభివృద్ధికైనా ప్రజారోగ్యం, ప్రజల ఆకలి సమస్యను పరిష్కరించడమే గీటురాయి. అదే సుస్థిరాభివృద్ధి అవుతుంది. కానీ, ఎత్తైన విగ్రహాలు పెట్టడంలోనో, ఉన్న భవనాలను కూల్చి విలాసవంతమైన భవంతులు కట్టడంలోనో ఉండదు. మనిషి అంతరిక్షానికి ప్రయాణిస్తున్న కాలంలో కూడా ఇంకా "ఆకలి" అనేది తీరని సమస్యగానే ఉండటం ఎంత విషాదం..!? "ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్.." అన్న ప్రశ్న ఇప్పుడు గురజాడదే కాదు... తిండికి మలమలలాడుతున్న కోట్లాది భారతీయులది. దీనికెవరు సమాధానం చెప్పాలి?

75ఏండ్ల స్వాతంత్ర్యం తరువాత కూడా ఈ దేశంలో ఆకలే రాజ్యమేలుతుంటే.. ఇన్నేండ్లుగా మన దేశాధినేతలేం చేస్తున్నట్టు..!? ఎన్ని ప్రభుత్వాలు మారినా "అందరిదీ పేదరికంపై యుద్ధమే.." ! పేదరిక నిర్మూలనకే అన్ని పథకాలు. బడ్జెట్‌లో వేలకోట్లు కేటాయింపులు... పథకాలు అమలవుతూనే ఉంటాయి, వేల కోట్లు ఖర్చవుతూనే ఉంటాయి. అయినా అదేం విచిత్రమోగానీ ఇవేవి పేదరికాన్ని నిర్మూలించలేదు సరికదా "ఆకలి సూచి"ని మాత్రం మరింత పెంచుతున్నాయి! గత ప్రధానుల కంటే రెండాకులు ఎక్కువే "చదివి"న మోడీ అధికారంలోకి వచ్చేనాటికి ప్రపంచ ఆకలిసూచీలో 55వ స్థానంలో ఉన్న దేశాన్ని 2021 నాటికి 101వ స్థానానికి తీసుకువెళ్లి "ఆకలి" అభివృద్ధిలో మన దేశాన్ని ఎవరూ అందుకోలేనంత ఎత్తులో నిలబెట్టారు మోడీజీ.



ఒక దేశప్రగతిలో ప్రజారోగ్యం ప్రధాన భూమిక పోషిస్తుంది. అందుకు సరైన పోషక విలువలు కలిగిన సంతులిత ఆహారం అత్యంత ప్రధానం. మన దేశంలో ఎంతమంది ప్రజలకు నాణ్యమైన పౌష్టికాహారం అందుతుంది అనేది ప్రశ్న. పేదరిక నిర్మూలనే తమ ప్రధాన ఎజెండా అంటూ అధికారంలోకొచ్చిన బీజేపీ... పేదరికం, పౌష్టికాహార లోపం, నిరక్షరాస్యత తన ముందున్న అతిపెద్ద సవాళ్లనీ, వీటి నుంచి ఈ దేశాన్ని విముక్తి చేయడమే తన ధ్యేయమనీ కూడా చెప్పింది. కానీ, కమలనాథుల పాలన అందుకు పూర్తి భిన్నం. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఊరిస్తున్నాయి. స్థిరమైన ఉపాధి లేక కాంట్రాక్ట్ ఉద్యోగాలపై ఆధారపడుతున్నారు. చాలీచాలని జీతాలతో విద్యా, వైద్యానికే సరిపోని పరిస్థితి. మరి పౌష్టికాహారం తినడమేలా సాధ్యమవుతుంది. వీటన్నింటిని విస్మరిస్తూ నిటి ఆయోగ్ 25 కోట్ల మంది భారతీయులు పేదరికపు కోరల నుంచి బయటపడ్డారని చెప్పడమంటే దేశాన్ని తప్పుదోవపట్టించడమే.

ఏ దేశ సుస్థిరాభివృద్ధికైనా ప్రజారోగ్యం, ప్రజల ఆకలి సమస్యను పరిష్కరించడమే గీటురాయి. అదే సుస్థిరాభివృద్ధి అవుతుంది. కానీ, ఎత్తైన విగ్రహాలు పెట్టడంలోనో, ఉన్న భవనాలను కూల్చి విలాసవంతమైన భవంతులు కట్టడంలోనో ఉండదు. మనిషి అంతరిక్షానికి ప్రయాణిస్తున్న కాలంలో కూడా ఇంకా "ఆకలి" అనేది తీరని సమస్యగానే ఉండటం ఎంత విషాదం..!? "ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్.." అన్న ప్రశ్న ఇప్పుడు గురజాడదే కాదు... తిండికి మలమలలాడుతున్న కోట్లాది భారతీయులది. దీనికెవరు సమాధానం చెప్పాలి?

ఏమండోయ్! ఎప్పుడూ మీ రాముడి గోలేనా? మా సీతమ్మ తల్లిని పట్టించుకునేది ఏమైనా ఉన్నదా?

మళ్ళీ ఏమిటే కొత్తరకం ఫిటింగ్. దేశమంతా రామమయం అంటూ ఊగిపోతూ విగ్రహ ప్రతిష్టాపన జరగబోతుంటే.

ఊపడం... ఊగటం... అని మీరనుకుంటే సరా? కాస్త వాస్తవాలు కూడా చూడాలిగా...

అదేంటి? నీవు విపక్షాల మాదిరి హిందూ ద్వేషిలా మాట్లాడుతున్నావు?

రాముడి పేరుగాక సీతమ్మ తల్లి పేరెత్తితేనే హిందూ ద్వేషినై పోతానా? మోసాలతో ఏ ఘనకార్యాలు సాధించలేరని మన పురాణాలు కూడా చెబుతున్నాయండీ....

ఇందులో మోసం ఏముంది. శుభమా అంటూ రామ విగ్రహ ప్రతిష్ట జరుగుతుంటే. అందులో ప్రతి ఒక్కరూ భక్తి పారవశ్యంతో పాల్గొనాలని కోరుకోవడం కూడా ఒక మోసమేనా?

ఇలా రండి. అహా. సీతలేకుండా రాముడుంటాడా? హుందాగా గౌరవంగా ఉన్న ఏ జంటను చూసినా, ముచ్చటగా సీతారాముల్లా ఉన్నారని ప్రశంసిస్తారు. అవునా.. అలాగే కేవలం రాముడొక్కన్నే భుజాన వేసుకుని భజన చేయడం నాకు నచ్చలా...

అయోధ్యలో విగ్రహ ప్రతిష్టాపన బాలరాముడిది గనుక అక్కడ సీత ఉండదు. అయోధ్యలోనే రాముడు పుట్టాడు గనుక అందుకు చిహ్నంగా బాలరామున్ని ప్రతిష్ఠిస్తున్నారు.

అయితే 'కౌసల్యా సుప్రజారామా!' అంటూ తల్లి కౌసల్య ఒడిలోని శిశు రాముడ్ని ప్రతిష్ఠించవచ్చుగా. మీరు స్త్రీ ద్వేషులు గనుక రాముడ్నొక్కడ్నే తలకెత్తుకున్నారు. తల్లీ

భార్య లేకుండా ఏ పురుషుడైనా జన్మెత్తగలడా? అసలు సృష్టి ఉంటుందా?

ఉండదు. అయినా మమ్మల్ని స్త్రీ ద్వేషి అంటావేంటి?

మీరు మాత్రం మిమ్మల్ని విమర్శించిన వారిని హిందూ ద్వేషులనటంలా.

కొత్త ఏడాది - కొత్త వేడుక



అది రాజకీయం. హిందువులందర్నీ ఒక్కటిగా చేయడానికి అలా అనాలి.

నేను మోసం అంటున్నాను. మీరు రాజకీయం అని అంటున్నారు.

అయినా రామాయణంలో సీతకు జరిగిన నష్టం ఏమిటే? నీవు తెగ ఇదైపోతున్నావ్.

1. రావణుడు సీతను చెరబట్టి లంకకు తీసుకుపోయి ఆశోకవనం లో బంధించాడు గనుకన అయోధ్యకు తిరిగి రాగానే తన పాతివ్రత్యం నిరూపించుకోమని అగ్నిప్రవేశం చేయించాడు రాముడు. బాధితురా లైన సీతకే అగ్ని పరీక్ష. ఇది సీతకు జరిగిన అన్యాయం కాదా?

2. నిండు గర్భవతి అని చూడక, ఎవడో మతిమాలిన వాని మాటలు విని కానలంకంపడం. ఒక రాజు చేయాల్సిన పనేనా? యుక్తాయుక్త విచక్షణ ఉండదా? నిజనిర్ధారణ చేసుకోడా?

ఈ రెండూ సీతమ్మ తల్లికి రాముడు చేసిన నష్టాలు కష్టాలు కావా? అందుకే లవకుశలు కూడా కోపంతో రాముడ్ని ద్వేషించారు. రాముడు ఇంత నిర్దయుడా? అని ఆక్రోశించారు. చివరకు తండ్రిపైనే విల్లెక్కు పెట్టిన లవకుశలను సీతమ్మ తల్లే శాంత పరచవలసి వచ్చింది. ఈ కథంతా తెలుసుకదా?

తెలుసు అదంతా ధర్మం కోసం అలా జరిగింది. రాముడు పురుషోత్తముడు గనుకనే ఈ అపవాదులన్నీ భరించాడు.

అవును అపవాదులే పురుషులకు, కష్టాలూ బాధలూ...మహిళలకు ఎంతబాగా సెలవిచ్చారండీ...

ఇంతకీ ఏమంటావ్?

పురుషుడనేవాడు స్త్రీల బాధలు పట్టించుకోవాలే తప్ప బాధ పెట్టకూడదని, కన్నీటిని తుడవాలే తప్ప కన్నీళ్లు పెట్టించకూడదని, అన్నిటికన్నా ముఖ్యంగా స్త్రీల హృదయాలను అర్థం చేసుకోవాలనీ...

అంటే శ్రీరామచంద్రుడు సీత హృదయాన్ని అర్థం చేసుకోలేదనా నీ అభిప్రాయం.

అవును. కనుకనే అభిమానవతైన సీతమ్మ తల్లి కనిపెంచిన బిడ్డలు లవకుశలను శ్రీరామచంద్రునికే తిరిగి అప్పగించి, ఎంత వారించినా.. తల్లి భూదేవి ఒడిలోకి జారిపోయింది.

అదేంటి? నీవిలా కన్నీరెడ్తున్నావు?

మనిషిని కదా! స్త్రీల మీద అఘాయిత్యాలు, అత్యాచారాలు రోజు రోజుకూ పెరుగుతుంటే కన్నీరు కాక ఇంకేముంటుందండీ...

అయితే ఈ అయోధ్యరాముని గుడి, విగ్రహ ప్రతిష్టాపన, ప్రారంభోత్సవం- ఇవన్నీ నీకేం వేడుకగా అనిపించడం లేదా?

లేదు, న్యాయానికి మరణం ఉండదు అనేలా సుప్రీం ధర్మాసనం ఈ నెల 8న ఓ విస్పష్టమైన తీర్పు ఇచ్చింది. అదే కొత్త సంవత్సరంలో కొత్త ఆశల చిగురు తొడుగుతున్నది. అదే నాకు వేడుక.

ఏమిటది!

2002లో గుజరాత్‌లో జరిగిన అల్లర్లలో బిల్కిస్‌బానో అనే గర్భవతిపై కొందరు దుండగులు అత్యాచారం చేసారు. ఒక పసిపిల్లతో సహా ఆమె కుటుంబ సభ్యులందర్నీ అతికిరాతకంగా హత్య చేసారు. కోర్టువారికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అయితే గుజరాత్ ప్రభుత్వం, వారి శిక్షాకాలం పూర్తి కాకముందే రెమిషన్‌పై వారిని విడుదల చేసింది. విడుదలైన ఆ నేరస్తులను కొందరు మేళతాళాలతో ఊరేగించారు కూడా. మాలాంటి వారికి ఈ ఘటన పుండుమీద కారం చల్లినట్టయింది.

ఈ ఘటనను సవాల్ చేస్తూ సుభాషిణీ ఆలీ, మహువా మయిత్రి, కపిల్ సిబాల్ వంటి పెద్దలు సుప్రీం కోర్టుకు వెళ్లారు. సుప్రీంకోర్టు కేసు పూర్వాపరాలు పరిశీలించి గుజరాత్ ప్రభుత్వాన్ని బోనులో దోషిగా నిల బెట్టింది. జైలు నుండి విడుదలైన ఆ పదకొండు మంది ఖైదీలను తక్షణం లొంగిపొమ్మని ఆదేశించింది. వారిలో కొందరు ఇప్పుడు పరారీలో ఉన్నారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై నోరు విప్పే వారే కరువవుతున్నారు. నాడైనా నేడైనా మహిళల కష్టాలకు బాధలకు పాలకులు కారణం అనే సత్యాన్ని మీరు కాదనగలరా? రాముడ్ని ఎంతైనా పొగడండి కాదనం. కానీ పక్కనున్న సీతమ్మ కష్టాల్ని గమనించండి. కష్టాలకు కారకులైన వారు కష్టాలను ఎలా గుర్తిస్తారు? అని అంటారా? అది మీ విజ్ఞతకే వది లివేస్తున్నా... మహిళల కష్టాల్ని గుర్తించి వచ్చే ఇలాంటి తీర్పులే... ధర్మం అంటే ఇది కదా!" అనే భరోసా నిస్తాయి. ఏమంటారు?

నిజమే సుమి... అన్యాయాన్ని అన్యాయంగా, న్యాయాన్ని న్యాయంగా చెప్పేవాళ్లు కొద్దిమందే ఉంటారు. నీలాగా...

- కె. శాంతారావు, 9959745723

ఇప్పటికీ వర్తించే లెనిన్ దార్శనికత



ఎం.ఎ. బేబి

కారల్ మార్క్స్ 30వ వర్ధంతి సందర్భంగా 1913లో లెనిన్ ఒక వ్యాసం రాశాడు. బోల్షివిక్ పార్టీ నడిపే 'ప్రాశ్వేనియే' (చైతన్యం) పత్రికలో ఆ వ్యాసం ప్రచురితమైంది. 'మార్క్సిజం మూడు మూలాలు, మూడు అంతర్భాగాలు' అన్న ఆ వ్యాసం చాలా ప్రసిద్ధమైంది. లెనిన్ సూత్రీకరణల్లో ఒక శాశ్వత సత్యంలా స్థిరపడపోయింది. 'మార్క్సిజం సర్వశక్తివంతమైంది. ఎందుకంటే అది సత్యం గనక" అనే ఆయన ప్రసిద్ధ ఉల్లేఖన ఈ వ్యాసంలోనిదే. లెనిన్ శత వర్ధంతి సందర్భంలో మనం ఆయన గురించి కూడా తప్పక చెప్పుకోవలసి వుంటుంది.

ఇంకా 30 ఏళ్లు కూడా నిండని లెనిన్ ప్రచురించిన ఒక సూత్రీకరణను మనం గుర్తు చేసుకోవాలి. "మేము మార్క్స్ సిద్ధాంతాన్ని అనేది సర్వసంపూర్ణమైన అనుల్లంఘనీయమైనదిగా పరిగణించం. అందుకు భిన్నంగా మేము దాన్ని ఒక శాస్త్రానికి పునాది రాయి వేసిందని మాత్రమే భావిస్తాం. సోషలిస్టులు జీవితవేగంతో పోటీ పడాలంటే ఆ విజ్ఞానాన్ని అన్ని దిశల్లోనూ అభివృద్ధి చేయవలసిందే. మరీ ముఖ్యంగా రష్యన్ సోషలిస్టులు మార్క్స్ సిద్ధాంతాన్ని స్వతంత్రంగా విస్తృతపర్చడం అత్యంత అవసరం. ఎందుకంటే ఈ సిద్ధాంతం సాధారణ మార్గదర్శక సూత్రాలను మాత్రమే చెబుతుంది. ఆ సూత్రాలను ఇంగ్లాండులో అన్వయించే తీరు ఫ్రాన్స్‌కు భిన్నంగా వుంటుంది. ఫ్రాన్స్‌లో జర్మనీకి భిన్నంగా, జర్మనీలో రష్యాకు భిన్నంగా వాటిని అన్వయించాల్సి వుంటుంది. అందువల్ల మా పత్రికలో సైద్ధాంతిక సమస్యలపై వ్యాసాలకు సంతోషంగా చోటు కల్పిస్తాము. వివాదాస్పద అంశాలను నిర్మొహమాటంగా చర్చించాల్సిందిగా కామ్రేడ్లను ఆహ్వానిస్తున్నాము (లెనిన్ రచనల కూర్పు, నాల్గవ సంపుటం, పేజీలు 211, 212).

పై ఉల్లేఖన లెనిన్ 1998-99 పార్టీ కార్యక్రమంలోనిది. 1913లో కారల్ మార్క్స్‌కు నివాళిగా రాసిన వ్యాసంలోని వాక్యాలు 1917 అక్టోబర్ విప్లవానికి కేవలం నాలుగేళ్ల ముందటివి. మొదట చూడగానే ఇవేవో వైరుధ్య భరితంగా కనిపించవచ్చు. మార్క్సిజం సత్యం గనకే సర్వశక్తి వంతమైంది అని 1913 వ్యాసం నొక్కిచెబుతోంది. మార్క్స్ సిద్ధాంతంలో భాగంగా కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్‌లు రూపొందించిన ప్రతిదీ వేదవాక్యం లాంటిదనే భావనకు ఇది దారితీయొచ్చు. మరోవైపున లెనిన్ ఆరవ సంపుటం లోంచి తీసుకున్న రెండవ ఉల్లేఖనం 'మార్క్స్ సిద్ధాంతం సర్వసంపూర్ణమైనదీ అనుల్లంఘనీయమైనదీ కాదు అంటున్నది. ఈ వాక్యాలను ఊరికే పైపైన చూస్తే కేవలం పదిహేనేళ్ల కాలవ్యవధిలోనే లెనిన్ పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యానాలు చేశారనిపించవచ్చు. లెనిన్ సైద్ధాంతికంగా అస్థిమితంగా వున్నారని కూడా ఆరోపించవచ్చు.

ముందు నిలిచిన లెనిన్


అయితే గతితర్క సిద్ధాంతం, ఆచరణ బాగా తెలిసిన వారెవరైనా అలాంటి విమర్శతో ఏకీభవించరు. మార్క్స్ సూత్రీకరణలూ వాటికి అనుబంధంగా చెప్పినవి కూడా గతితార్కిక చారిత్రిక భౌతికవాదం పరిణామశీలతను శాస్త్రీయ స్వభావాన్ని నొక్కిచెప్పేవే. వాస్తవం ఏమంటే మార్క్స్ సిద్ధాంతం ఒక శాస్త్రానికి పునాదిరాయి మాత్రమే. సోషలిస్టులు, కమ్యూనిస్టులు ఆ పునాదిని అన్ని దిశల్లోనూ నిరంతరాయంగా అభివృద్ధిపరచాల్సి వుంటుంది. ఒక్కో దేశానికి అనుగుణంగా మార్క్స్ సిద్ధాంతాన్ని విశదపర్చుకోవడం రష్యన్ విప్లవానికి చాలా అవసరమని అదే విభాగంలో లెనిన్ గట్టి గా చెప్పారు. ఆ విధంగా సైద్ధాంతిక అవగాహనకు పదును పెట్టుకోవడానికే మన పత్రికలో నిర్మొహమాటంగా చర్చలు జరగాలనీ, వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ విధమైన సైద్ధాంతిక సాహసం, విశ్వాసం వున్నందువల్లనే లెనిన్ ఆయన నాయకత్వం లోని బోల్షివిక్ పార్టీలు రష్యాలో సైన్యం సహకారంతో కార్మిక, కర్షక కలయికతో విప్లవానుకూల పరిస్థితులను సద్వినియోగపర్చుకోగలిగారు. ఆ విధంగానే అక్టోబరు విప్లవం జయప్రదం కాగలిగింది. లెనిన్ రాసిన ఏప్రిల్ థీసిస్ రూపుదిద్దుకుంటున్న విప్లవ పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించగల సమర్థతకు నిదర్శనం, ఆ విధంగానే ఆయన వింటర్ ప్యాలెస్ ముట్టడికి సరైన సమయంలో సరైన దిశానిర్దేశం చేయగలిగారు.

రష్యాలో మార్క్సిజానికి పితృ సమానుడుగా పరిగణించబడే జార్జి ప్లెఖనోవ్ (1856-1918) పిడివాదాలపై కూడా ఈ క్రమంలో లెనిన్ ఎదుర్కొనవలసి వచ్చింది. ఫ్రెడరిక్ ఏంగెల్స్ శిష్యుడుగా పరిగణించబడే కారల్ కాట్స్కీ (1854-1938)తో కూడా అదే విధంగా తలపడవలసి వచ్చింది. అక్టోబరు విప్లవానికి, కార్మికవర్గ నియంతృత్వానికి వ్యతిరేకంగా కాట్స్కీ చాలా తీవ్రమైన రివిజనిస్టు వాదనలను ఎదుర్కొనాల్సి వచ్చింది. 'శ్రామికవర్గ విప్లవం విద్రోహి కాట్స్కీ' అన్న తన ప్రసిద్ధ రచనలో లెనిన్ ఆయన వాదనలను తిప్పికొట్టారు. లెనిన్ అనేక కీలకమైన సైద్ధాంతిక ఆచరణాత్మక రచనలు అందించాడు. అవేమంటే, కార్మికవర్గ పార్టీ సవివర సూత్రీకరణలు వ్యవస్థాగత నిర్మాణం, కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలు, విప్లవ దశలు, సామ్రాజ్యవాద గొలుసులో అత్యంత బలహీనమైన లింకును తెగ్గొట్టడం, ఒక దేశంలో సోషలిజం సిద్ధాంతం అభివృద్ధి స్థిరీకరణ, అందులో భాగమైన నూతన ఆర్థిక సిద్ధాంతం, పెట్టుబడి దారీ విధానం సామ్రాజ్యవాదంగా పెరగడం, కొమింటర్న్ ద్వారా కమ్యూనిస్టుల అంతర్జాతీయ కృషి ప్రాధాన్యత, అతి వాద సంస్కరణవాద పెడధోరణులపై పోరాటం, పార్టీ కార్యక్రమాన్ని ప్రజలను ఉత్తేజపర్చే నినాదాలుగా మలచి భూమి శాంతి ఆహారం వంటి పిలుపివ్వడం చూస్తాం. సోవి యట్లకే సమస్త అధికారం అన్న పిలుపు ఆఖరుదైనా చాలా ముఖ్యమైందే.

సిద్ధాంత పటిష్ఠతలో వెనకబాటు

అయితే లెనిన్ 54 ఏళ్లు కూడా నిండకుండానే కన్ను మూయడం ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఒక పెద్ద విషాదం. ఆయన మరణానంతరం కూడా సోవియట్ యూనియన్‌లో చెప్పుకోదగిన విజయాలు సాధించబడ్డాయి. వ్యవసాయం, పరిశ్రమలు, ఆరోగ్యం, విద్య, విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక శాస్త్రం, మహిళా సమానత సాధికారత, సంస్కృతి, గృహ నిర్మాణం, దారిద్ర్యం, నిరక్ష రాస్యతా నిర్మూలన తదితర రంగాల్లో సాధించిన ఘన విజయాలు బాగా తెలిసినవే. ఫాసిజాన్ని నాజీయిజాన్ని ఓడించడంలో సోవియట్ ఎర్రసైన్యం వీరోచిత పాత్ర ఒక మహా సంచలనాత్మక వాస్తవం. జాతీయ విముక్తి ఉద్యమాలకు నూతన స్వతంత్ర దేశాలకు సోవియట్ యూనియన్, సోషలిస్టు దేశాల కూటమి ఇచ్చిన తోడ్పాటును ప్రత్యేకంగా చెప్పుకోవాలి. యుగ ప్రాధాన్యతగల ఈ పరిణామాలకు పునాది వేసింది లెనినే. దోపిడీ వ్యవస్థల నుంచి దోపిడీ రహితమైన ప్రయోగాల వైపు సమానతా సమాజం, సోషలిజం ఆ తర్వాత దశల వైపు వెళ్లేందుకు బాట వేసింది అవే.

ఏమైనా లెనిన్ మరణించిన 67 ఏళ్ల తర్వాత సోవియట్ తూర్పు యూరప్ సోషలిస్టు ప్రయోగాలు విచ్ఛిన్నమైనాయి. లెనిన్ స్థాపించిన సోవియట్ కమ్యూనిస్టు పార్టీకి ఆ స్థితి ఎందుకు వచ్చిందనేది ఇక్కడ ప్రశ్న. 1992లో మద్రాసులో జరిగిన సీపీఐ(ఎం) 14వ మహాసభ ఇందుకు గల కారణాలను విశ్లేషించేందుకు ఒక ప్రయత్నం చేసింది. ఇప్పుడు మనం దాన్ని మరో రూపంలో చెప్పుకోవచ్చు. లెనిన్ చెప్పినట్టుగా చేయడంలో సోవియట్ కమ్యూనిస్టు పార్టీ విఫలమైంది. మార్క్స్ సిద్ధాంతం పునాది వేసిన శాస్త్రం పునాదిపై అన్ని దిశల్లో అభివృద్ధి చేయలేక పోయింది. 'శాస్త్రీయ సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించడం' అనే లెనిన్ సృజనాత్మక వైఖరి ప్రత్యక్ష ప్రభావం ఈ నాటి ప్రపంచంలో కూడా మనం చూడొచ్చు. చైనా ఆర్థిక రంగంలోనూ, విపరీత దారిద్ర్యం నిర్మూలనలోనూ గణనీయమైన సాధారణ అభివృద్ధి సాధిస్తున్నది. మొత్తం సంక్షోభ పరిస్థితులను ఎదుర్కోవడంలో సానుకూల ఫలితాలు ఇంకా వున్నాయి. ఇవన్నీ లెనిన్ నూతన ఆర్థిక విధానం ప్రయోగాలను చైనాకు నిర్దిష్టంగా అన్వయించిన ఫలితాలే. వియత్నాం, క్యూబా వంటి దేశాల గురించి కూడా ఇదే చెప్పొచ్చు.



కేరళలో అనుభవాలు

కేరళలో 1957 కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మేము చేయడానికి ప్రయత్నిస్తున్నది కూడా కొంత పరిమితమైన అర్థంలో ఈ విధంగానే చూడవలసి వుంటుంది. ఎందుకంటే బూర్జువా భూస్వామ్య వ్యవస్థ వున్న దేశంలో కేరళ ఒక చిన్న రాష్ట్రం మాత్రమే. ఏమైనా భూసంస్కరణలతో మొదలుపెట్టి ప్రజా పంపిణీ వ్యవస్థ ఆరోగ్య వ్యవస్థ లను బలోపేతం చేయడం, శ్రమజీవులకు ఉపయోగకరంగా వుండేలా సంక్షేమ కార్యక్రమాలను సృజనాత్మకంగా అమలు పర్చడం, స్థానిక సంస్థల వరకూ అధికారాల వికేంద్రీకరణ, ప్రజా ప్రణాళికలు ఇవన్నీ లెనిన్ చూపిన మార్గంలో ఉత్తేజం పొంది చేపట్టిన చర్యలే, కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ నిర్ణయాలు రాష్ట్రాన్ని విజ్ఞానాధారిత సమాజంగా ఆర్థిక వ్యవస్థగా పెంపొందించేందుకు ప్రపంచంలోని మధ్య తరహా ఆర్థిక వ్యవస్థల స్థాయికి చేర్చేందుకు ఉద్దేశించబడ్డాయి. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలో దుర్భర దారిద్రాన్ని పూర్తిగా తొలగించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు తీసుకోవడం ఈ క్రమంలో చెప్పుకోదగిన మరో అంశం. దేశంలో నయా ఉదారవాద విధానాలు ప్రబలంగా అమలు జరుగుతున్న రీత్యా ఈ చర్యలు ఒక సమూలమైన మార్పునకు దారితీస్తాయి.

మారిన ప్రపంచంలో మన కర్తవ్యం

అనేక కారణాల వల్ల నేటి ప్రపంచం పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు సాంకేతిక ఆధారిత గూఢచర్యం, కృత్రిమ మేధ (ఎ.ఐ) పరికరాలు పనిచేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రతి దేశంలోని కమ్యూనిస్టులు వస్తున్న మార్పులను లోతుగా విశ్లేషించవలసి వుంది. వివిధ తరగతుల ప్రజల జీవితాలపై, ప్రజాస్వామిక ఉద్యమాలపై, ఆ మార్పుల తీరు తెన్నులు ప్రభావం ఎలా వుంటున్నదీ పరిశీలించాలి. అప్పుడు మాత్రమే విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి సరైన వైఖరి రూపొందించుకోవడం సాధ్యమవుతుంది. తన సహచరుల సాయంతో లెనిన్ ఒక్క చేత్తో చేసిన ఆ పని ఇప్పుడు శ్రామికవర్గ పార్టీ, పార్టీలూ మొత్తంగా సమిష్టిగా చేపట్టవలసి వుంటుంది. అభివృద్ధి చెందిన ఇతర యూరప్ పెట్టుబడిదారీ దేశాలన్నిటికంటే ముందుగా రష్యాలో విప్లవ వెల్లువ అవకాశాలను మార్క్స్, ఏంగెల్స్ దార్శనికతతో గ్రహించగలిగారనేది ఆసక్తికరమైన విషయం. ఆ దేశ విప్లవోద్యమం నుంచి కొంతమంది చాలా ప్రతిభావంతులైన కామ్రేడ్లు ముందుకు రావచ్చని కూడా వారు చెప్పగలిగారు.

1882లో వెలువడిన 'కమ్యూనిస్టు ప్రణాళిక' రష్యన్ ముద్రణకు మార్క్స్, ఏంగెల్స్ ఉభయులూ ముందు మాట రాశారు (దాన్ని జార్జి ప్లెఖనోవ్ జెనీవాలో అనువదించారు). రష్యన్ గ్రామసీమలలో ఉమ్మడి భూయాజమాన్య పద్ధతులు వున్న కారణంగా ఆ దేశం ఒకేసారి సోషలిస్టు సమాజంగా మారే అవకాశం గురించి వారు దాని చివరి పేరా గ్రాఫులో చర్చించారు. అయితే దీనికన్నా దశాబ్ది ముందే ఏంగెల్స్ 1872లో జర్మన్ విప్లవకారుడు ఫిలిప్ బెకర్‌కు రాసిన లేఖలో ఈ అంశం ప్రస్తావించాడు. జర్మన్ భాషలో వెలువడిన 'పెట్టుబడి' మొదటి అనువాదం ఇంగ్లీషులో ఫ్రెంచిలో కన్నా ముందే రష్యన్ భాషలో వచ్చింది. ఆ గ్రంథం మొదటి సంపుటంలో రష్యన్ విప్లవావకాశాలపై చర్చ వుంటుంది. దానికి రష్యన్ ప్రజల్లో విస్తారమైన ఆదరణ లభించింది. అదిచూసిన తర్వాతనే ఏంగెల్స్ తన లేఖలో ఇలా రాశాడు: "మొత్తంగా రష్యన్లను తీసుకుంటే గతంలో యూరప్‌కు వచ్చిన కులీనులు రాజవంశీకులకూ ఇప్పుడు వస్తున్న వారికి మధ్య చాలా తేడా కనిపిస్తోంది. వీరంతా మామూలు ప్రజలు. వారి ప్రతిభన నడతనూ బట్టి చూస్తే వారిలో కొందరు మన పార్టీలో వున్న అత్యుత్తమ శ్రేణికి చెందిన వారి కోవకు చెందుతారు. కష్ట సహిత, గుణవంతమైన సమర్థత, అదే సమయంలో సిద్ధాంతంపై పట్టు కనిపిస్తున్నాయి. ఇవి ప్రశంసనీయమైన లక్షణాలు."

మార్క్స్, ఏంగెల్స్‌లు రష్యన్ విప్లవ భవిష్యత్తు గురించిన ఏ మేధాశకలాలుగా భావించారో అదే మహా ప్రతిభావంతుడైన లెనిన్ విప్లవ సిద్ధాంతం, ఆచరణగా రూపుదాల్చిందన్నమాట.

> "మొత్తంగా రష్యన్లను తీసుకుంటే గతంలో యూరప్‌కు వచ్చిన కులీనులు రాజవంశీకులకూ ఇప్పుడు వస్తున్న వారికి మధ్య చాలా తేడా కనిపిస్తోంది. వీరంతా మామూలు ప్రజలు. వారి ప్రతిభన నడతనూ బట్టి చూస్తే వారిలో కొందరు మన పార్టీలో వున్న అత్యుత్తమ శ్రేణికి చెందిన వారి కోవకు చెందుతారు. కష్ట సహిత, గుణవంతమైన సమర్థత, అదే సమయంలో సిద్ధాంతంపై పట్టు కనిపిస్తున్నాయి. ఇవి ప్రశంసనీయమైన లక్షణాలు."

> మార్క్స్ సిద్ధాంతం ఒక శాస్త్రానికి పునాదిరాయి మాత్రమే. సోషలిస్టులు, కమ్యూనిస్టులు ఆ పునాదిని అన్ని దిశల్లోనూ నిరంతరాయంగా అభివృద్ధిపరచాల్సి వుంటుంది. ఒక్కో దేశానికి అనుగుణంగా మార్క్స్ సిద్ధాంతాన్ని విశదపర్చుకోవడం రష్యన్ విప్లవానికి చాలా అవసరమని అదే విభాగంలో లెనిన్ గట్టిగా చెప్పారు. ఆ విధంగా సైద్ధాంతిక అవగాహనకు పదును పెట్టుకోవడానికే మన పత్రికలో నిర్మొహమాటంగా చర్చలు జరగాలనీ, వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ విధమైన సైద్ధాంతిక సాహసం, విశ్వాసం వున్నందు వల్లనే లెనిన్ ఆయన నాయకత్వంలోని బోల్షివిక్ పార్టీలు రష్యాలో సైన్యం సహకారంతో కార్మిక, కర్షక కలయికతో విప్లవానుకూల పరిస్థితులను సద్వినియోగపర్చుకోగలిగారు. ఆ విధం గానే అక్టోబరు విప్లవం జయప్రదం కాగలిగింది.

అనువాదం : తెలకపల్లి రవి

మోడీ నిజమైన రామభక్తుడే!


- బి.ఆర్. బాపూజీ

అధర్మంగా ఏది వచ్చినా, అధికారమైనా, ఇంద్రుడి నగరమైనా, తను తీసుకోననీ, రాజ్యం ఎలా చెయ్యాలో, భరతుడికి రాముడు చెప్పిన సూత్రాల్నే తన ప్రభుత్వమూ పాటిస్తున్నదనీ, ప్రధాని మోడీ అన్నట్టు పత్రికల్లో ఒక వార్త!

మోడీ అన్నది అక్షరాలా నిజం. దీనికి రుజువులు, 2013లో మోడీ పేరుని ప్రధాని పదవికి, బీజేపీలో ప్రతిపాదించడం ఎంత 'ధర్మం'గా జరిగిందో, ఆ నాటి సంఘటనలు గుర్తుచేసుకుంటే తెలుస్తుంది. (ఈ వివరాలు, ఆ నాటి పత్రికల్లో వచ్చినవి. గూగుల్‌లో దొరుకుతాయి). అలాగే, రాముడు అయోధ్యకి రాజు కావడం ఎంత 'ధర్మంగా'జరిగిందో, వాల్మీకి 'రామాయణం'లో, 'అయోధ్యాకాండ' నుంచీ మొదలుపెట్టి, 'యుద్ధ కాండ'లో చివరివరకూ చదివితే తెలుస్తుంది. (వాల్మీకి రామాయణానికి తెలుగు అనువాదం, దాదాపు 120 ఏళ్ల కిందట, చదలువాడ సుందర రామశాస్త్రులు గారిది, వావిళ్ళ వారు వేశారు. అన్ని కాండలూ, సారస్వత పరిషత్ వారి లైబరీలో ఇప్పటికీ వుండి వుండాలి. ప్రతి పదార్థాలూ, తాత్పర్యాలూ, టీకా అన్నీ చాలా వివరంగా వుంటాయి. లేదా, అన్ని కాండలకీ, పుల్లెల రామచంద్రుడు 30 ఏళ్ళ కిందట చేసిన తేలికైన అనువాదాన్నయినా చూడవచ్చును. రామచంద్రుడు గారు, 1967కీ 70కీ మధ్య, ఉస్మానియా యూనివర్సిటీలో, మూడేళ్ల బియ్యేలో మాకు 'సంస్కృతం'బోధించిన ముగ్గురు విద్వాంసులలో ఒకరు. రామచంద్రుడుగారు ఎటువంటి ప్రశ్నని అయినా, భిన్నాభిప్రాయాన్ని అయినా ఎంతో సహనంతో వినేవారు.ఆయన ఇప్పుడు లేరు.)

ముందు, రాముడి పట్టాభిషేకం గురించి చూద్దాం. తను, అయోధ్యకి రాజు అవడం 'అధర్మం' అని రాముడికి చాలా స్పష్టంగా తెలుసు. ఈ విషయానికి ఆధారం, అయోధ్యాకాండలో, 107వ సర్గలో, 3వ శ్లోకంలో వుంది. రాముడే భరతుడికి స్వయంగా చెపుతున్నాడు. "నీ తల్లి అన్యాయంగా ఈ పని చెయ్యలేదు. మన తండ్రి, నీకే రాజ్యం ఇస్తానని మీ తాతకి వాగ్దానం చేసి వున్నాడు" అని రాముడే ఒప్పుకు న్నాడు. మరి, ఈ నిజం తెలిసి కూడా, భరతుడు తాతగారి ఇంటికి వెళ్లినప్పుడు, రాముడు పట్టాభిషేకానికి సిద్ధపడడం ధర్మమేనా? సింహాసనం మీద కూర్చునే హక్కు తనకి లేనప్పుడు, భరతుడు తెచ్చిన పాదుకల్లో కాళ్లు పెట్టి ఇవ్వడానికి అంగీకరించడం ధర్మమేనా? చివరికి వనవాసం ముగిశాక, మళ్లీ అయోధ్య రాజుగా సింహాసనం ఎక్కడం ధర్మమా, అధర్మమా?

ఇప్పుడు, ప్రధానిగా మోడీకి బీజేపీలో వచ్చిన అవకాశం, ధర్మంగానే వచ్చిందోలేదో చూద్దాం. 2013లో, మోడీ పేరు ప్రధాని అభ్యర్థిగా తెరమీదకు వచ్చేనాటికి, బీజేపీలో, మోడీ కన్నా ఎంతో అనుభవమూ, సీనియారిటీ వున్న నాయకులు ఎందరో! ఉదాహరణకి, లాల్‌కృష్ణ అద్వానీ, మురళీ మనోహర్ జోషీ, సుష్మాస్వరాజ్ లాంటి వారు న్నారు. వీరిలో అద్వానీ ముఖ్యుడు. గుజరాత్‌లో, 2002లో, మతం పేరుతో జరిగిన మారణకాండలో, మోడీ రాజ ధర్మాన్ని పాటించలేదనీ, అతన్ని ఆ పదవి నుంచీ తప్పించాలనీ, వాజ్‌పేయి లాంటి వారు, అభిప్రాయపడినా, మోడీని ఆదుకున్నది అద్వానీ. ఆ తర్వాత పదేళ్ళకి, ప్రధాని అభ్యర్థిత్వానికి మోడీ పేరుని కొందరు ప్రతిపాదిస్తే, ఆ సమావేశానికి వెళ్ళకుండా, అనేక కారణాలు ఒక లేఖ ద్వారా తెలిపి, అద్వానీ తదితర సీనియర్లు నిరసన తెలిపినా, ఫలితం లేకపోయింది. ఆరెస్సెస్ ఒత్తిడితో, ఎంతో కాలంగా వున్న సీనియర్ నాయ కుల్ని ఖాతరు చెయ్యకుండా జరిగిన నిర్ణయం అది. మరి అలాంటప్పుడు, మోడీకి ఆ అవకాశం ధర్మంగానే వచ్చినట్టా? "ఇంతమంది సీనియర్లు వుండగా, వాళ్లందరి ఆమోదమూ లేకుండా, నాకు అవకాశం ఇవ్వ వద్దు"అని చెప్పడం ధర్మం కాదూ?



"తక్కువ సమయంలో, ఎక్కువ లాభం వచ్చే పనుల్లో ఆలస్యం చేయకూడదని భరతుడికి శ్రీరాముడు నిర్దేశించారని మోడీ చెప్పారు." అని! అదే వార్తలో ఇంకో విషయం. ఈ విషయంలో కూడా, మోడీ ప్రభుత్వం శ్రీరాముల వారినే అనుసరించింది. రోజుకి 12గంటల చొప్పున, 4రోజులు పని చేయించుకునే అవకాశం కంపెనీల వారికి ఇచ్చే కార్మిక చట్టాన్ని 2022 జులై ఒకటి నుంచీ మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్నది. అటు అయోధ్య ప్రభువు రాముల వారికీ, ఇటు భారత ప్రధాని మోడీకీ పట్టని ఒక విషయం ఏమిటంటే, "ఒక పరిమిత కాలంలో, నాలుగోవంతు పని ఎక్కువ చేసి, 50వ ఏట చనిపోవలసిన వాడు, 37వ ఏట చనిపోతాడు" (డాక్టర్ రిచర్డ్సన్, 'వర్క్ అండ్ ఓవర్‌వర్క్', 1863.)

చివరిగా, స్త్రీల పట్ల శ్రీరాముల వారి ఔదార్యం గురించి శూర్పణఖ ముక్కూ, చెవులూ కోయమని శ్రీరాములవారు లక్షమణ స్వామి వారికి చెప్పారు. 2002లో, మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు, బిల్కిస్‌బానో అనే గర్భిణిపైన సామూహిక అత్యాచారం చేసిన నేరస్తుల్ని, విడుదల చేయాలని, ఇటీవల గుజరాత్ ప్రభుత్వం సిఫారస్ చెయ్యడమూ, దానికి కేంద్రంలో వున్న మోడీ ప్రభుత్వం ఆమోదముద్ర వేయడమూ కూడా ధర్మమార్గంలోనే జరిగాయని భావించాలా?

దీన్ని బట్టి తేలేదేమిటంటే, మోడీ నిజమైన రామభక్తుడే!

> "తక్కువ సమయంలో, ఎక్కువ లాభం వచ్చే పనుల్లో అలస్యం చేయకూడదని భరతుడికి శ్రీరాముడు నిర్దేశించారని మోడీ చెప్పారు." అని! అదే వార్తలో ఇంకో విషయం.ఈ విషయంలో కూడా, మోడీ ప్రభుత్వం శ్రీరాముల వారినే అనుసరించింది. రోజుకి 12 గంటల చొప్పున, 4 రోజులు పనిచేయించుకునే అవకాశం కంపెనీల వారికి ఇచ్చే కార్మిక చట్టాన్ని 2022 జులై ఒకటి నుంచీ మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్నది. అటు అయోధ్య ప్రభువు రాముల వారికీ, ఇటు భారత ప్రధాని మోడీకీ పట్టని ఒక విషయం ఏమిటంటే, "ఒక పరిమిత కాలంలో, నాలుగో వంతు పని ఎక్కువ చేసి, 50వ ఏట చనిపోవలసిన వాడు, 37వ ఏట చనిపోతాడు" (డాక్టర్ రిచర్డ్ సన్, 'వర్క్ అండ్ ఓవర్ వర్క్', 1863.)

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
5
మంగళవారం | జనవరి 23, 2024 | www.navatelangana.com

ప్రభుత్వ భూమి కబ్జాపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా.!.

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండలో ఓ దళారి దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా చేసిన విషయంపై నవతెలంగాణ దినపత్రికలో సోమవారం వార్త కథనం ప్రచురించిన విషయం విదితమే. ఈ వార్తకు స్పందించిన ఇంటెలిజెన్స్ వర్గాలు ముదిగొండను సందర్శించి ప్రభుత్వ భూమి కబ్జాపై ఆరా తీసినట్లు తెలిసింది. పలువురుతో ఫోన్లో మాట్లాడి భూమికి సంబంధించిన వివరాలను సేకరించినట్లు సమాచారం. ప్రభుత్వ భూమి కబ్జా బాగోతాన్ని నివేదికగా తయారుచేసి జిల్లా ఉన్నతాధికారులకు అందజేసి కబ్జా దారులపై చర్యలు తీసుకునే విధంగా ఇంటెలిజెన్స్ వర్గాలు ఉన్నట్లు తెలుస్తుంది.



విప్పలమడక సహకార సంఘం గోదాములు ప్రారంభం

నవతెలంగాణ-వైరా

గరిక పాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని విప్పలమడక గ్రామంలో 24 లక్షల వ్యయంతో నిర్మించిన గోదాములను సంఘం చైర్మన్ అయిలూరి కృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. సంఘం ఆధ్వర్యం గత ఆరు సంవత్సరాల క్రితం 50 లక్షల రూపాయలు వ్యయంతో కార్యాలయం, గోదాముల నిర్మించగా, విప్పలమడక గ్రామంలో గల సహకార సంఘం స్థలంలో విప్పలమడక, లింగన్న పాలెం గ్రామాల రైతుల అభ్యర్థన మేరకు నూతన గోదాములను నిర్మించారు. ఈ సందర్భంగా చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సహకార పరపతి సంఘం చైర్మన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రైతు సంక్షేమం కోసం తన వంతు కృషి చేశానని, ధాన్యం కొనుగోలు, రసాయన ఎరువుల సరఫరాను కొనసాగించామని తద్వారా సొసైటీ లాభాల బాటలో ఉన్నందున గోదాములు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విప్పలమడక, గరికపాడు, ధాచాపురం సర్పంచ్‌లు తుమ్మల జాన్ పాపయ్య, కోటా ఎలీషా, వేల్పుల జయరాజు, సొసైటీ ఉపాధ్యక్షులు అయిలూరి కృష్ణారెడ్డి, డైరెక్టర్లు దేవభక్తిని అర్జునరావు, బాణాల శేషయ్య, డి.రమాదేవి, మాజీ సర్పంచ్‌లు పారుపల్లి కష్ణారావు, తోటకూర రామారావు, మాజీ ఎంపీటీసీ ఆకుల ప్రసాద్, దాచాపూరం, లింగన్నపాలెం ఉప సర్పంచ్‌లు రామ శేశిరెడ్డి, తోటకూర స్వరాజ్యరావు, రైతులు వేముల కోటేశ్వరరావు, రుద్రాక్షల వెంకట చారి, కొల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



శివుని విగ్రహం ఏర్పాటు

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం రెబ్బవరం గ్రామం హిందూ స్మశాన వాటిక వద్ద ఏర్పాటు చేసిన శివుని విగ్రహంను ఏర్పాటు చేశారు. చేతి పంపు బోరును, భూమి దాత శిలాఫలకాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ సోమవారం ప్రారంభించారు. రెబ్బవరం హిందూ స్మశాన వాటికలో ఏర్పాటు చేసిన శివుని విగ్రహాన్ని కీ.శే. తాళ్లూరి శేషయ్య (రిటైర్డ్ టీచర్) జ్ఞాపకార్థం వారి భార్య తాళ్లూరి నాగలక్ష్మి, కుమారులు తాళ్లూరి వెంకటకృష్ణ, తాళ్లూరి రాంబాబు (లేటు), తాళ్లూరి మురళి (ఎన్ఆర్ఐ) బహూకరించారు. చేతి పంపు బోరును కీ.శే. వల్లభి సుబ్బయ్య, శాంతమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు వల్లభి వెంకటేశ్వరరావు బహూకరించారు. స్మశాన వాటిక నిర్మాణం కొరకు రెబ్బవరం మాజీ సర్పంచ్ దాసరి దానియేలు, మాజీ ఉప సర్పంచ్ తాళ్లూరి వెంకటయ్య చేసిన కృషి ఫలితంగా హిందూ స్మశాన వాటిక నిర్మాణానికి అవసరమైన భూమిని కొలిపాక రామకృష్ణ పరమానందరావు, వారి కుటుంబ సభ్యులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వైరా మండలం అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, దాసరి దానియేలు, తాళ్లూరి వెంకటయ్య, వల్లభ శ్రీనివాసరావు, సర్పంచ్ సాధం రామారావు, గుత్తా రామారావు, గుత్తా వెంకటేశ్వరరావు, తూము సుధాకర్, తాళ్లూరి నాగేశ్వరరావు, ఆకుల రమేష్, పొదిల హరినాథ్, పాలేటి నరసింహారావు, తవిడిశెట్టి శ్యాంసుందర్, సామినేని బాబు, దొబ్బల నాగయ్య, దొబ్బల కిట్టయ్య, గుత్తా నాగరాజు, చిత్తారు శ్రీను, భక్తుల రామకృష్ణ, వనమా చిన్న సత్యనారాయణ, గుడిమెట్ల మోహనరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



చదువుతోపాటు క్రీడలు కూడా జీవితంలో భాగం

నవతెలంగాణ-వైరాటౌన్

చదువుతోపాటు క్రీడలను కూడా జీవితంలో భాగం చేసుకోవాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. రాజీవ్ క్రికెట్ అసోసియేషన్, వైరా వారి ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహించిన ఓపెన్ టోర్నమెంట్ క్రికెట్ పోటీలలో ప్రథమ బహుమతి రాయల్స్ టీమ్ వైరా, ద్వితీయ బహుమతి ఆర్.సి.ఎం చర్చి వారు గెలుచుకున్నారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్‌లు గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరకంగా దృఢంగా ఉండడానికి ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ చదువుతోపాటు క్రీడలను కూడా జీవితంలో భాగం చేసుకోవాలని అన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలు నిర్వహించిన రాజీవ్ క్రికెట్ అసోసియేషన్ నిర్వాహకులు, ఎన్ఎస్.యుఐ వైరా నియోజకవర్గ అధ్యక్షుడు గరిడేపల్లి కిషోర్, షేక్ అంజద్ పాషాలను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మిట్టపల్లి నాగి, పొదిల హరినాథ్, దార్న రాజశేఖర్, దొడ్డా పుల్లయ్య, మచ్చా బుజ్జి, బీడీకే రత్నం, శ్రీరామనేని తిరుపతిరావు, సయ్యద్ అన్వర్, బొల్లం గోపీచంద్, బోళ్ళ గంగారావు, కౌన్సిలర్ లక్ష్మీబాయి, పోలా శీను, చెరుకూరి కిరణ్, బిక్య మోదుగు లక్ష్మయ్య, బుడిగి వెంకన్న, ఎస్.కె అనీఫ్, వజ్రం, సన్నీ, నరేష్, నిఖిల్, సాయి, లాలయ్య, రాజీవ్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తక్కువ ఎత్తులో చక్కర్లు కొట్టిన విమానం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఓ విమానం తక్కువ ఎత్తులో మండలంలోని పలు గ్రామాలు, పంటచేల మీదుగా సోమవారం చక్కర్లు కొట్టింది. రఘునాథపాలెం మండలం పాపటపల్లి మీదుగా మండలంలోని మంగళగూడెం, గూడురుపాడు, కాచిరాజుగూడెం, ఆరెకోడు, చింతపల్లి, ఆరెంపుల గ్రామాల మీదుగా మూడు నాలుగు సార్లు చక్కర్లు కొట్టింది. పంట చేలో ఉన్న రైతులు, గ్రామస్థులు ఆశ్చర్యపోయి విమానంను ఆసక్తిగా చూస్తున్నారు. అయితే రైల్వే లైన్ కోసం విమానం ద్వారా అధికారులు సర్వే చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. కొత్తగా ప్రతిపాదించిన డోర్నకల్ నుంచి గద్వాల్, డోర్నకల్ నుంచి మిర్యాలగూడెం రైల్వే లైన్ కోసం కేంద్ర ప్రభుత్వం ఓ ప్రయివేటు కంపెనీ ద్వారా ఫైనల్ సర్వే చేస్తుందని, సర్వే పూర్తయిన తరువాత సర్వే ఆధారంగా ప్రభుత్వం రైల్వే లైన్ కోసం డీపీఆర్ సిద్ధం చేసి నూతన రైల్వే లైన్ ఏర్పాటు చేస్తుందని ప్రచారం.తమ పంట పొలాల మీదుగా విమానం చక్కర్లు కొడుతుంటే అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

నవతెలంగాణ- ఖమ్మం

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని, పోరాటాలకు ప్రజలను సంసిద్ధులను చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పిలుపునిచ్చారు. పోరాటాలు లేకుండా ఈ దేశంలో ఏ సమస్య పరిష్కారం కాలేదన్నారు. సిపిఐ ఖమ్మం నగర సమితి సమావేశం సోమవారం గిరిప్రసాద్ భవన్లో జరిగింది. నగర కార్యదర్శి ఎస్కె జానిమియా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పోటు ప్రసాద్ మాట్లాడుతూ పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని, ముఖ్యంగా కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలను వంచించిందని, మరోసారి అధికారంలోకి వచ్చేందుకు అయోధ్య శ్రీరాముడంటూ కొత్త నినాదాన్ని ఎత్తుకున్నదన్నారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమైన బిజెపికి తగు సమాధానం చెప్పాలని లేని పక్షంలో దేశంలో ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుందన్నారు. బిఆర్ఎస్ ప్రజలను విస్మరించడం వల్లే ఓటమి చెందిందని, ప్రజలు బిఆర్ఎస్‌ను మోసం చేయలేదని ప్రజలనే బిఆర్ఎస్ మోసం చేసిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు పూనుకోవాలని, ప్రతి హామీని సకాలంలో నెరవేర్చాలని ప్రసాద్ కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, కార్పొరేటర్ చామకూరి వెంకన్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు గాదె లక్ష్మి నారాయణ, నూనె శశిధర్, ఏనుగు గాంధీ, మోహన్రావు, సైదా, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

అనుమతులా...అబ్బే మాకు అక్కర్లేదు

- ఇష్టారీతిన బహుళ అంతస్తుల నిర్మాణాలు
- నిబంధనలు గాలికొదిలేస్తున్న నిర్మాణదారులు
- నోటీసులిచ్చినా యజమానులు బేఖాతర్
- సత్తుపల్లి పట్టణంలో ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్

నవతెలంగాణ-సత్తుపల్లి

అంగబలం. అర్థబలం. రాజకీయ పలుకుబడి ఉంటే చాలు తామేంచేసినా చెల్లుబాటవుతుందని కొందరు నిబంధనలను బేఖాతరు చేస్తారు. ప్రస్తుతం సత్తుపల్లి పట్టణంలో ఇప్పుడదే జరుగుతోంది. నింబధనలు తోసిరాజని కొందరు అనుమతులు లేకున్నా సరే బహుళ అంతస్తుల నిర్మాణాలను అడ్డగోలుగా సాగిస్తున్నారు.



సంబంధిత అధికారులు ఈ అక్రమ నిర్మాణాలపై దృష్టి పెట్టకపోవడంతో భవన నిర్మాణ యజమానులు రెచ్చిపోతున్నారు. పట్టణంలో వందలాదిగా అపార్టుమెంట్స్ ఉన్నప్పటికి వాటిల్లో కొన్నింటికి మాత్రమే నిర్మాణాలను అనుమతులున్నట్లు తెలుస్తోంది. చాలా వరకు అపార్టుమెంట్స్‌కు దాదాపుగా అనుమతులుండవని, అగ్ని ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో కనీసం అగ్ని నిరోధక వాహనాలు కూడా రాని పరిస్థితి నెలకొని ఉందని ప్రజలు అంటున్నారు. నిర్మాణాలు జరిగి కుటుంబాలు నివసిస్తున్న చాలా వరకు అపార్టుమెంట్స్‌కు అగ్నిమాపకశాఖ నుంచి అనుమతులు తీసుకోలేదని తెలుస్తోంది. సత్తుపల్లి మున్సిపాలిటీ నుంచి కేవలం జీ ప్లస్ టూ భవన నిర్మాణాలకు మాత్రమే అనుమతులు ఉంటాయి. ఆపై నిర్మాణాలకు వరంగల్ రీజినల్ డైరెక్టర్ నుంచి, ఇంకా ఆపై నిర్మాణాలకు హైదరాబాద్ టౌన్ ప్లానింగ్ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కాని సత్తుపల్లిలో ఈ విధమైన అనుమతులు పొందకుండానే బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయి. జీ ప్లస్ టూ అనుమతులు తీసుకొని ఏకంగా జీ ప్లస్ ఫైవ్ నిర్మాణాలు కడుతున్నారంటే పరిస్థితిని ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

అనుమతులు లేనివి చాలా ఉన్నా... మూడింటినే గుర్తించారు

సత్తుపల్లిలో అనుమతులు లేని బహుళ అంతస్తులు చాలా ఉన్నప్పటికి మున్సిపల్ అధికారులు ప్రస్తుతానికి కేవలం మూడింటిని మాత్రమే గుర్తించినట్లు మున్సిపల్ అధికారులు అంటున్నారు. మిగతా వాటిని గుర్తిస్తామంటున్నారు. గుర్తించిన వాటిలో పోస్టాఫీస్ రోడ్డు గుడిపాడు సమీపంలో కడుతున్న ఓ అపార్టుమెంట్‌కి జీ ప్లస్ టూ మాత్రమే అనుమతి ఉంది. కాని అక్కడ నిర్మాణం మాత్రం జీ ప్లస్ ఫైవ్ నడుస్తోంది. వేంసూరు రోడ్డులో మరో భవనానికి సెల్లారు, స్టిల్ట్ ప్లస్ ఫైవ్ అప్పర్ పర్మిషన్ తీసుకొని అదనంగా మరో ఫ్లోర్‌ను నిర్మించారు. అలాగే బస్టాండ్ ఎదురుగా అయ్యగారిపేట రోడ్డు నె.01లోని ఒకరి భవనానికి పార్కింగ్, ప్లస్ టూ తో పాటు మరో ఫ్లోర్‌కు అనుమతి పొంది మరో 2 ఫ్లోర్‌లను అనుమతులు తీసుకోకుండానే నిర్మించారు.

టాస్క్‌ఫోర్స్‌తో వెళ్లి నోటీసులు ఇవ్వాల్సిన పరిస్థితి

అనుమతులు లేని భవనాల అంతస్తులకు సంబంధించి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేసినప్పటికి యజమానులు తీసుకొనే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులైన తహసీల్దారు, పోలీస్ సీఐ, ఫైర్ ఆఫీసర్, ఆర్అండ్‌బీ ఏఈ, మున్సిపల్ టీపీవో అంతా కలిసి వెళ్తే తప్ప నోటీసులు అందుకునే పరిస్థితి ఏర్పడింది. నోటీసులు తీసుకున్నా అనుమతి లేని నిర్మాణాన్ని ఆపకపోవడం గమనార్హం. ఇటీవల ఓ భవనానికి అనుమతి లేదని మున్సిపల్ అధికారులు నోటీసులు ఇవ్వడానికి వెళ్తే సదరు యజమాని తీసుకోకపోగా దురుసగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. దీంతో టాస్క్‌ఫోర్స్ టీం వెళ్లాల్సి వచ్చిందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం...
కోదూరు సుజాత, కమిషనర్, సత్తుపల్లి మున్సిపాలిటీ



అనుమతులు లేని నిర్మాణాలను తీసివేయమని నోటీసులు ఇచ్చాం. 15 రోజుల్లో వాటిని తొలగించకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పట్టణంలో ఏ రకమైన నిర్మాణం జరిగినా తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలి. లేకుంటే మున్సిపల్ సిబ్బంది సర్వే జరిపి అట్టి వారిపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కూల్చివేతకు ఆర్డర్స్ జారీ చేస్తాం

సంక్షేమ పథకాల లబ్ధి... అర్హులందరికీ అందిస్తాం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-రఘునాథపాలెం

సంక్షేమ పథకాల లబ్ధి, అర్హులైన లబ్ధిదారులందరికీ అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామ పశు వైద్యశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఖమ్మం నియోజకవర్గ రఘునాథపాలెం మండలానికి చెందిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథక లబ్ధిదారులకు చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద 57 మంది లబ్ధిదారులకు రూ.1,00,116ల చొప్పున రూ.57,06,612లను అందజేసినట్లు అన్నారు. ఇందులో ఈర్లపూడి గ్రామానికి చెందిన 24, చిమ్మపూడి గ్రామానికి 5, పాపటపల్లి గ్రామానికి 5, ఎం.చింతగుర్తి గ్రామానికి 9, కోయచిలక గ్రామానికి 5, రఘునాథపాలెం గ్రామానికి 3, వి.వెంకటాయపాలెం గ్రామానికి 3, వేపకుంట్ల గ్రామానికి 2, మంచుకొండ గ్రామానికి చెందిన ఒక లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో ఎస్సీలు ఏడుగురు, ఎస్టీలు 31 మంది, బిసి, మైనారిటీలు 19 మంది ఉన్నట్లు మంత్రి తెలిపారు. గ్రామాల్లో మిగులు అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి విజయకుమారి, రఘునాథపాలెం ఎంపిపి గౌరి, ఎంపిడివో రామకృష్ణ, తహసీల్దార్ ఎల్.విల్సన్, ఈర్లపూడి సర్పంచ్ దేవుసింగ్, ఎంపీటీసీ జానకీరామ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

మండల పరిధిలోని మంచుకొండ గ్రామ పంచాయతీకి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ వాంకడోత్ దీపక్ నాయక్, విజయ సమక్షంలో 50 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఉపసర్పంచ్ భూక్య లింగయ్య నాయక్, బాణోతు ఉపేందర్, దొంతబోయిన రాంబాబు, బానోతు రాందాస్ నాయక్, బానోతు హరిదాస్, కోటేశ్వరరావు, భూక్య ,రాయుడు తదితరులు పార్టీలో చేరారు.

ఆసుపత్రి భవన నిర్మాణపు పనుల పరిశీలన

నవతెలంగాణ- పెనుబల్లి

ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను సోమవారం డిప్యూటీ ఇంజనీర్ పి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆరు కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బిల్డింగు నిర్మాణ స్థాయిని బట్టి మూడు అంచెల నిర్మాణంపై ఆయా స్థాయి అధికారులు నాణ్యత ప్రమాణాలను పరిశీలిస్తారన్నారు. బేస్ మట్టం, స్లాబ్ లెవల్, ఫినిషింగ్ వర్కులు పరిశీలనలో ఉంటాయని పేర్కొన్నారు. బిల్డింగ్ నిర్మాణం పూర్తయిన తర్వాత రెండు సంవత్సరాల పాటు కాంట్రాక్టర్ పర్యవేక్షణలో ఉంటుందన్నారు. నిర్మాణపు పనుల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా తమ శాఖ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి పర్యవేక్షణ ఉంటుందని ఆయన తెలిపారు.

రాహుల్ గాంధీ పాదయాత్ర అడ్డుకోవడం అవివేకం

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ అజ్గర్

నవతెలంగాణ-ముదిగొండ

ఏఐసిసి అధినేత, ఎంపీ రాహుల్ గాంధీ భారత్ జూడో న్యాయ పాదయాత్రను బిజెపి కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయటం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ అజ్గర్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా రాహుల్‌గాంధీ పాదయాత్రకు ప్రజలు అండగా ఉంటారని ఆయన తెలిపారు.



రాష్ట్ర స్థాయికి త్రివేణి విద్యార్థుల ప్రాజెక్టులు ఎంపిక

నవతెలంగాణ-ఖమ్మం

గత వారం రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాల కు చెందిన విద్యార్థులు తయారు చేసిన రెండు ప్రాజెక్టులు ప్రథమ బహుమతిని గెలుచుకున్నారని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. అలాగే ఒక ప్రాజెక్టు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నది ప్రథమ బహుమతి గెలుపొందిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయరని, ప్రథమ బహుమతి పొందిన ప్రాజెక్టుల 9వ తరగతికి చెందిన వీక్షిత్, ధీరధులు వ్యవసాయాన్ని ఉపాయంషంగా ఎన్నుకొని జవాన్ రక్ష కిసాన్ మిత్ర అనే పేరుతో చేసిన ప్రాజెక్టు, 9వ తరగతి చెందిన డార్విన్ బాలాజీ, కార్తికేయలు రవాణా, సమాచార వినిమయం అనే అంశంలో లైఫ్ సేవర్ హెల్మెట్ అనే ప్రాజెక్టును చేశారు. ఈ రెండు ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో మొదటి బహుమతి గెలుపొంది, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఆరోగ్యం ఉపాంశంగా ఎన్నుకొని మల్టిపుల్ డివైస్ ఫర్ పెరాలసిస్ పీపుల్ అనే ప్రాజెక్టుని తయారు చేసిన అమన్, అఖిల్‌రెడ్డి అనే 9వ తరగతి విద్యార్థులు ద్వితీయ బహుమతిని పొందారని, ప్రాజెక్టులన్నింటికీ రోశయ్య గైడ్ టీచరుగా వ్యవహరించారని తెలిపారు .బహుమతులు సాధించిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, జిల్లా సైన్స్ అధికారి జగదీష్, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ ఈ వెంకటేశ్వర్లు, పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందించారు.

దోపిడీ, అసమానతలు లేని సమాజం కోసం కృషి చేయాలి

- లెనిన్ శత వర్ధంతి సభలో బొంతు రాంబాబు, పారుపల్లి చంద్రశేఖర్

నవతెలంగాణ-వైరాటౌన్

దోపిడీ, అసమానతలు, ఆర్థిక సంక్షోభం లేని సమాజం కోసం కృషి చేయాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, సీనియర్ నాయకులు పారుపల్లి చంద్రశేఖర్ బాబు అన్నారు. సోమవారం వైరా సిపిఎం కార్యాలయం బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో వైరా స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ శత వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో బొంతు రాంబాబు, పారుపల్లి చంద్రశేఖర్ బాబు మాట్లాడుతూ అధ్యయనం, ఆచరణల మేళవింపు లెనిన్ అన్నారు. వర్గ పోరాటాలతోనే దోపిడీ లేని సమాజం సాధ్యం అన్నారు. ద్రవ్య పెట్టుబడి ప్రపంచం అంతా విస్తరించి లాభాలను పోగు చేసి సంపద కేంద్రీకృతమై నిరుద్యోగం, దారిద్ర్యం పెరిగిందని అన్నారు. భారతదేశంలో 10 కోట్ల మంది సంపన్నులుగా అభివృద్ధి చెందిన సమయంలో 23 కోట్ల మంది ప్రజలు అష్ట దారిద్ర్యంలో జీవితం కొనసాగిస్తున్నారని, అసమానతలు లేని సమాజం కోసం కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, మాజీ ఎంపిపి బొంతు సమత, మండడపు రామారావు, పారుపల్లి కృష్ణారావు, మల్లెంపాటి ప్రసాదరావు, నారికొండ అమరేందర్, పైడిపల్లి సాంబశివరావు, అనుమోలు రామారావు, వడ్లమూడి మధు, తోట కృష్ణవేణి, చిత్తారు మురళి, నూకల వెంకటేశ్వరరావు, పాసంగులపాటి చలపతిరావు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణ మహోత్సవం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన మహా దివ్య క్షేత్రమైన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయము నందు అయోధ్య శ్రీ రాముల వారి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షా బంధనం, సుముహూర్తం, తలంబ్రాలు వంటి వైదిక ప్రక్రియలను అత్యంత వైభవంగా ఉప్పల మురళీమోహన్‌శర్మ దంపతులు నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం కళ్యాణ మ హోత్సవానికి వచ్చిన భక్తులకు దేవాలయం వారు తీర్థ ప్రసాదాలను అందించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయ కుమారి,ఉప ప్రధాన అర్చకులు ఉప్పల విజయ దేవశర్మ, వేద పండితులు విజయకృష్ణ, సాయి అభిలాష్, అనంతశయనచారి, అర్చకులు రాజీవ్ శర్మ, గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వివిధ గ్రామాలలో సీతారాములు వారి కల్యాణం

ఎర్రుపాలెం మండల పరిధిలోని అయ్యవారిగూడెం, బనిగండ్లపాడు, ఇనగాలి, తదితర గ్రామాలలో అయోధ్య శ్రీ రాముల వారి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని గ్రామాలలోని ప్రజలు భక్తులు వేలాదిగా విచ్చేసి కళ్యాణాన్ని తిలకించారు. కళ్యాణానికి విచ్చేసిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు ఉచిత అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నాగిరెడ్డి, భక్తులు వేలాదిగా ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

రామాలయాల వద్ద ప్రత్యేక పూజలు

సత్తుపల్లి : అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా సత్తుపల్లి పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో రామాలయాల వద్ద ప్రత్యేక పూజలు, భజనలు, కోలాట ప్రదర్శనలు జరిగాయి. సత్తుపల్లి పట్టణంలోని బస్టాండ్ రింగ్ సెంటర్‌లో మాధురి మెడికల్స్ వద్ద బిగ్ స్క్రీన్‌పై బాలరాముని ప్రతిష్ఠను లైవ్‌లో చూపించారు. మాధురి నేతృత్వంలో బాలరాముని ప్రతిష్ఠ అపురూప ఘట్టాన్ని చూసేందుకు వచ్చిన భక్తులకు పులిహోర, రామరసాన్ని అందించారు. మండలంలోని చాలా చోట్ల రామాలయాల వద్ద స్క్రీన్‌పై ప్రతిష్ఠను వీక్షించారు. సత్తుపల్లిలోని శ్రీమెట్టాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో కోలాటం ఆడుకుంటూ భారీ ప్రదర్శన నిర్వహించారు.


వెంకటాపురంలో అన్నదానం

ముదిగొండ : మండలపరిధిలో వెంకటాపురం రామాలయంలో అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయ ఇన్చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి సోమవారం వేయ్యి కొబ్బరి టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోట రాంబాబు, మండల నాయకులు దేవరపల్లి అనంతరెడ్డి, ఊరుకొండ రాజు, పంజాల రాజేష్, జూలకంటి సంజీవరెడ్డి, కొమ్ము ఉపేందర్, మందరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-తల్లాడ



తల్లాడ-కొత్తగూడెం ప్రధాన రహదారిలో తల్లాడ అన్నారుగూడెం గ్రామాల మధ్య ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం లారీని ఢీకొన్న ప్రమాదంలో జూలూరుపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన గార్లపాటి నరసింహారావు (35) సంఘటన స్థలంలోనే మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం నరసింహారావు ద్విచక్ర వాహనంపై జూలూరుపాడు నుండి వైరా వెళుతుండగా, తల్లాడవైపు నుండి భద్రాచలం వెళ్తున్న సుబాబుల్ కర్రల లోడుతో వెళుతున్న లారీ, శ్రీకృష్ణ శీతల గడ్డంగి వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహారావుకు తీవ్ర గాయాలై సంఘటన స్థలములోనే మృతి చెందాడు. తల్లాడ పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం కోసం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సేవా తత్పరులు సైదులుకు డాక్టరేట్

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో యడవల్లి గ్రామానికి చెందిన యరకల సైదులు చేస్తున్న సామాజిక సేవలను గుర్తించిన యునైటెడ్ థియలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ న్యూయార్క్ వారు ఆదివారం బేగంపేట మారి గోల్డ్ హెరీటల్‌లో న్యూమాంక్స్ కుంగ్ ఫు ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన వేదికలో యరకల సైదులుకు గౌరవ డాక్టరేట్ పట్టాను కౌన్సిల్ జనరల్ ఆఫ్ టర్కీ యాల్మాన్ అర్హన్ ఒఖాన్ చేతుల మీదగా స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్ గ్రహీత సైదులు మాట్లాడుతూ డాక్టరేట్ పొందడం సంతోషంగా ఉందన్నారు. తనకు డాక్టరేట్ ప్రధానంతో సామాజిక సేవలో బాధ్యత మరింత పెరిగిందన్నారు. తన డాక్టరేట్‌ను ప్రజలకు అంకితమిస్తున్నానన్నారు. పేద ప్రజలకు తమ సేవలను విస్తృతం చేస్తామని చెప్పారు. డాక్టరేట్ ప్రధానం చేసిన యూనివర్సిటీ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామానికి చెందిన యరకల సైదులు డాక్టర్ పొందడం పట్ల గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలుపు అభినందించారు. ఈ కార్యక్రమంలో కుంగ్ ఫు ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎంఎస్. రవికుమార్, సినీ హీరోలు డాక్టర్ నరేష్, డాక్టర్ మురళీమోహన్, డాక్టర్ కుంచపు రాంబాబు, ప్రముఖ నటీమణులు మాజీ ఎంపి డాక్టర్ సుమలత, మాజి ఎమ్మెల్యే డాక్టర్ జయసుధ, పవిత్ర లోకేష్, డాక్టర్ మాదాల రవికుమార్, శివమణి, నవీన్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాడోజు శ్రీకాంత్ రాజ్, ఆరాధ్య ఫౌండేషన్ యాదాద్రి జిల్లా అధ్యక్షులు అనగాని నరసింహ, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఆకవరం లక్ష్మణచారి, ఎలిమినేటి జహంగీర్, కల్వల నరేష్, బుంగపట్ల యాకయ్య, దబ్బేటి రాంబాబుగౌడ్, గిరగాని వీరేందర్, ఆచారి, జైపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో సీట్ల భర్తీపై అవగాహన ర్యాలీ

- బాలిక విద్యతో సమాజపురోగతి
- మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్ శైలజా

నవతెలంగాణ-కారేపల్లి



తెలంగాణ మైనార్టీ గురుకులంలో సీట్ల భర్తీపై అవగాహన కల్పిస్తూ సోమవారం కారేపల్లిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మైనార్టీ గురుకులం నుండి విద్యార్థులు ర్యాలీగా కారేపల్లి మసీద్ సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు. ముస్లిం మైనార్టీల ఇంటింటికి వెళ్లి బాలిక విద్య అవశ్యకతను వివరించారు. బాలికా విద్యతోనే సమాజ పురోగతి చెందుతుందని తెలిపారు. గురుకులంలో వసతులు, క్రమశిక్షణ, భద్రతపై విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా ఇస్తూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.శైలజా మాట్లాడుతూ ప్రవేశాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎంఆర్ఈఐఎస్‌తెలంగాణ.సీజీజీ.జీవోవీ.ఇన్ లేదా టీఎంఆర్ఈఐఎస్ మొబైల్ యాఫ్ ద్వారా చేసుకోవచ్చన్నారు. ప్రవేశాలను ముందొచ్చిన ముందు ప్రతిపాధికన కేటాయించటం జరుగుతుందన్నారు. మైనార్టీ గురుకులంలో 5వ తరగతిలో 80 సీట్లుగాను 60 సీట్లు మైనార్టీలకు, ఇతరులకు 20 సీట్లు కేటాయించటం జరిగిందన్నారు. 6, 7, 8 తరగతులలో ఖాళీలుంటేముందు దరఖాస్తు చేసుకున్న వారికి సీట్లు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఇంటర్ ఫస్ట్‌ఇయర్‌లో ప్రవేశాలకు 10వ తరగతిలో మార్కులు ఆధారంగా ప్రవేశాలు కల్పించటం జరుగుతుందన్నారు. ఎంపీసీలో 40 సీట్లకుగాను 30 సీట్లు మైనార్టీలకు, 10 సీట్లు ఇతరులకు, బైపీసీలో 30 సీట్లు మైనార్టీలు, 10 మందికి ఇతరులకు సీట్లు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులను ఫిబ్రవరి 6వ తేది వరకు చేసుకోవచ్చని తెలిపారు.

బట్టు బాలస్వామి చిత్రపటానికి నివాళులు

నవతెలంగాణ-మధిర



మధిర మున్సిపాలిటీ 21 వ వార్డులో బట్టు బాలస్వామి (రిటైర్డ్ రైల్వే ఉద్యోగి) ఇటీవల అనారోగ్యంతో మరణించారు. సోమవారం ఆయన దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్మెన్ లింగాల కమల్ రాజు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్, రంగిశెట్టి కోటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ శీలం విద్యాలత వెంకటరెడ్డి, ఆ వార్డ్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి వేల్పుల శివ, నీలం రమేష్, బండి భరత్, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిడ్జ్‌లో జైశ్రీరామ్ ఉత్సవం

-ఆకట్టుకున్న చిన్నారుల జైశ్రీరామ్ అక్షరాలతో ప్రదర్శన

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో సోమవారం జైశ్రీరామ్ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు జైశ్రీరామ్ అక్షరాల ఆకతిలో నిర్వహించిన ప్రదర్శన ప్రత్యేకతను సంతరించుకుంది. జైశ్రీరామ్ ఫ్లాష్ కార్డ్స్‌తో విద్యార్థులు ఉత్సాహంగా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. అయోధ్య రామాలయంలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం పాఠశాలలో ఈ జైశ్రీరామ్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అయోధ్య లైవ్ కార్యక్రమాన్ని పాఠశాల చిన్నారులు స్క్రీన్‌పై తిలకించి పులకించి పోయారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ 500 సంవత్సరాల నాటి కల సోమవారం సాకారమైన సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక సంబరాలు నిర్వహిస్తున్నారన్నారు. పితృవాక్య పరిపాలనకు జగదభి రాముడు ప్రతీకగా నిలిచి ధర్మ సంరక్షణ కోసం కృషి చేసిన మహా వ్యక్తి అని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింత నిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-తల్లాడ



తల్లాడ మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో కరుణ లివింగ్, కేరింగ్, హాండ్స్ ట్రస్ట్, అండ్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులకు దుప్పట్లను సోమవారం పంపిణీ చేశారు. ట్రస్ట్ ఫౌండర్ పిడియాల బెంజిమెన్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు మన బాల్యంలో ఎలా చూసుకున్నారో చివరి దశలో వారిని మనం చంటి పిల్లల్లా కంటి రెప్పలా చూసుకోవాలన్నారు. మంచి భోజనం అందించాలని వాళ్ల పట్ల కరుణ దయ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ దుండేటి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ తూము వెంకటనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్, ఎంపీటీసీ ఇసనేపల్లి ఏసమ్మ, సొసైటీ డైరెక్టర్ దున్నేటి వెంకటకృష్ణారెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కోడూరు వీరకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

- మండలంలో పర్యటించిన డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల

నవతెలంగాణ-కారేపల్లి



కాంగ్రెస్ పార్టీని నమ్ముకోని ఉన్న ప్రతి కార్యకర్తకు పార్టీ నిరంతరం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం కారేపల్లి మండలంలో ఆయన పర్యటించిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. మంగళితండాలో ఇటీవల మృతి చెందిన సర్పంచ్ పిల్లలమర్రి స్వర్ణవీరన్న సోదరుడు దారావత్ సూర్య సంస్మరణ కార్యక్రమానికి పువాళ్ల దుర్గాప్రసాద్ హాజరై మృతుడు సూర్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. పేరుపల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కెలోత్ హేమ్లా ఇటీవల కారేపల్లిలో జరిగిన ఘర్షణలో గాయపడ్డాడు. అతనికి ఇంటికి వెళ్లి హేమ్లాను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉసిరికాయలపల్లి మాజీ ఉపసర్పంచ్ కొమ్ము వెంకన్న మాతృమూర్తి కొమ్ము ఆకుమంచమ్మ ఇటీవల మృతి చెందింది. ఆకుటుంబాన్ని పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పరామర్శించారు. కారేపల్లిలో ఆయనకు సూర్యతండా ఎంపీటీసీ భూక్య పార్వతి వీరన్న, బానోత్ వీరభద్రంలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరక్టర్ బానోత్ హీరాలాల్, పీసీసీ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మేదరి వీరప్రతాఫ్(టోనీ), యూత్ కాంగ్రెస్ వైరా నియోజవర్గ ఉపాధ్యక్షులు దారావత్ వినోద్, నాయకులు తాజుద్దీన్, బానోత్ రాంమ్మూర్తి, బోడా సేట్‌రామ్, గుగులోత్ భీముడు, ఇస్లావత్ శంకర్, గుంపిడి నాగేశ్వరరావు, కేలోత్ శ్రీను, బచ్చలకూరి ఉపేందర్, షేరు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలను విద్యార్థులు తప్పక పాటించాలి

- ఆర్టీవో వెంకట పుల్లయ్య

నవతెలంగాణ-పెనుబల్లి



రోడ్డు భద్రత నియమాలను విద్యార్థులు తప్పక పాటించాలని ఆర్టీవో వెంకట పుల్లయ్య అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆర్టిఓ వెంకట పుల్లయ్య విద్యార్థులకు అవగాహనసదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు విద్యార్థులు అందరూ డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని కోరారు. 90 శాతం రోడ్డు ప్రమాదాలు ద్విచక్ర వాహనాలు అదుపుతపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో యువతీ యువకులే మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్ వాడకపోవడం వల్ల రోడ్డు ప్రమాదంలో తలకి గాయమైన వారు మరణిస్తున్నారని, కారులో పైనుంచి సమయంలో సీట్ బెల్ట్ తప్పకుండా పెట్టుకోవాలని రోడ్డు భద్రత మరణాలపూ పలు సలహాలు సూచనలు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వివి. రామారావు, సత్యనారాయణ, వనమా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ఏసీపీ సారంగపాణి

నవతెలంగాణ-ఖమ్మం



ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యంగా ఆటోలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి అన్నారు. సోమవారం ఖమ్మం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు, సంఘాలకు పోలీసులు అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నగర పరిధిలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, వైరా రోడ్డు ప్రాంతం నిత్యం ప్రయాణికులతో,ఆటోలతో రద్దీగా ఉంటుందని, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పోలీసు వారికి సహకరించాలని సూచించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత విషయంలో అవగాహన కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడుపొద్దని, ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతూ సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే ఆకతాయిలపై చర్యలు తప్పవని తెలిపారు. "మీ ఆటోలో కూర్చున్న ప్రయాణీకులతో మర్యాదగా మాట్లాడాలని, అదేవిధంగా ఎక్కడబడితే అక్కడ ఆటోలు నిలపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందనే విషయాన్ని గ్రహించి ఆటోలు క్రమపద్ధతిలో నడుపుకోవాని సూచించారు. డ్రైవర్లందరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌లు, వారి వాహనాలకు ఆర్సీ కలిగి ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఆటోలను కట్టడి చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో నగరంలో పోలీసులు తీసుకునే చర్యలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ అశోక్, ఆర్ఎస్సై సాగర్, ఎస్సై రవి పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలి

- సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.విజయ్‌చంద్ర

నవతెలంగాణ-నేలకొండపల్లి



ఎరువుల దుకాణదారులు రైతులకు ఎంఆర్పి ధరలకే ఎరువులను పురుగుమందులను విక్రయించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని కూసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. విజయ్‌చంద్ర హెచ్చరించారు. సోమవారం మండలంలోని మంగాపురంతండ గ్రామంలో శ్రీ తిరుమల ఫెర్టిలైజర్స్, శ్రీరామ ఫెర్టిలైజర్స్ దుకాణాలు రాజారాంపేట, నాచేపల్లి పిఏసిఎస్ పరిధిలోని మంగాపురంతండా, ముజ్జుగూడెం సబ్ సెంటర్‌లను, రాజేశ్వరపురం పిఎసిఎస్‌లను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఫెర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం క్రింద ఆయా దుకాణాలను, కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఆయా దుకాణాలు కేంద్రాలలో రైతులకు విక్రయిస్తున్న ఎరువులు, పురుగుమందుల స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను స్వయంగా పరిశీలించి పలు ఆదేశాలు చేశారు. ఎరువులు, పురుగు మందులను కొంటున్న రైతులకు ఎరువుల దుకాణదారులు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. రైతు నుండి సంతకం తీసుకొని ఈపాస్ మెషిన్ నందు ఆధార్ కార్డు నెంబర్ టైప్ చేసి ఎరువులు విక్రయించాలన్నారు. దుకాణాలలో బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్, భౌతిక నిల్వలు సమానంగా ఉండాలన్నారు. లేని ఎడల చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి దేశబోయిన అరుణకుమారి ఉన్నారు.

రామాలయాల్లో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-కారేపల్లి

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురష్కరించుకోని మండలకేంద్రమైన కారేపల్లి, మేకలతండా, భీక్యాతండా గ్రామాల్లో సోమవారం శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దల ఆధ్వర్యంలో కారేపల్లి ప్రధాన వీధుల గుండా ర్యాలీని నిర్వహించారు. మేకలతండా లో బంజార గిరిజన సంప్రదాయం అనుగుణంగా బోగ్ బండారో నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. భీక్యాతండాలోని రామాలయంలో అజ్మీర బిచ్చానాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యర్ర నర్సింహరావు, సూర్యదేవర వెంకటేశ్వర్లు, ఓరుగంటి రాజు, పిల్లి వెంకటేశ్వర్లు, తురక నారాయణ, , చిన్ని శ్రీనివాస్, చిరునోముల రామారావు, తొగరు రమేష్, తురక రవి, పోతు రాములు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు : అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో ప్రజలు ప్రత్యేకంగా కమిటీ వేసుకొని విరాళాల సేకరించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కల్లూరులో సుమారు 5000 మంది పైగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల్లోని సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామంలోని ప్రముఖులు మహిళలు రాజకీయ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తల్లాడ : అయోధ్య బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా మండలంలో సోమవారం పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రామానుజవరం కోదండ రామాలయంలో రామాలయ కమిటీ సభ్యులు గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ శీలం కోటారెడ్డి ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు, నిర్వహించారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మెన్ శీల వెంకటరెడ్డి, గంగాధర కోటయ్య, నర్సింగ రవి, కోడూరు వెంకటనారాయణ, శీలం బ్రహ్మానందరెడ్డి, శీలం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తల్లాడ మల్లవరం, తదితర గ్రామాలలో ర్యాలీలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కుసుమంచి : మండల కేంద్రంలోని శివాలయంలో పాలకమండలి ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిఐ జితేందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్ కుమార్, చైర్మెన్ కొక్కిరేణి వీరస్వామి, సర్పంచ్ చెన్న మోహన్, డైరెక్టర్లు మక్కపల్లి రామకృష్ణ, అర్వపల్లి వెంకటేశ్వర్లు, నెల్లూరి సత్యనారాయణ, నాగిరెడ్డిరవీందర్‌రెడ్డి, నలగాటినాగయ్య, ముత్తయ్య, ఎంపీటి, శివస్వాములు బెల్లంకొండ వెంకన్న, వీరవెల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మధిర : ఎధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పులిహోరం, దద్దోజనం పంపిణీ కార్యక్రమాన్ని అధ్యక్షులు మధిరస్విమ్మర్స్ అసోసియేషన్ ఆఫీస్ ఎదురుగా రామాలయం రోడ్డులో జంగా నరసింహారెడ్డి అరుణ మనవడు రుశాంక్ కార్తీకరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు దంపతులు, జంగా శ్రీనివాస్ రెడ్డి వనమా సూరి, పల్ల బోతుల ప్రసాద్, చల్లా సత్యనారాయణ, జింకల కోటేశ్వరరావు, రాము, గండూరి రాంబాబు, రంగిశెట్టి శ్రీనివాసరావు, బజాజ్ సాంబిరెడ్డి, శీలం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం కార్పొరేషన్ : అయోధ్య రామాలయ ప్రతిష్ఠ సందర్భంగా ఖమ్మం హెూల్ సేల్ కమిషన్ కూరగాయల కమిటీ అధ్యక్షులు తోట రామారావు, కార్యదర్శి గోళ్ళ అవినాష్, గౌరవ అధ్యక్షులు నాగేశ్వరావు ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ అన్నదానానికి సుమారు 2000 మంది భక్తులు హాజరై ఈ అన్నదాన కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. చేసినందుకు కమిటీ వారు భక్తులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శి తోట రామారావు, అవినాష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం హెూల్ సేల్ కూరగాయల మార్కెట్ కమిటీ సభ్యులు నల్లగట్ల వెంకటేశ్వర్లు, పత్తి రవికుమార్ వి. వెంకన్న, మద్దినేని రామారావు, తోట వీరభద్రం, జక్కుల రామకృష్ణ, అప్పారావు, సిహెచ్. భద్రం, బి. ప్రభాకర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



పెద్ద బీరవల్లి మాజీ సర్పంచ్ దుర్గమ్మ మృతి

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని పెద్ద బీరవల్లి మాజీ సర్పంచ్, సీపీఐ(ఎం) నాయ కురాలు తాళ్లూరి దుర్గమ్మ (59) అనారోగ్యంతో సోమవారం మరణించారు. తాళ్లూరి దుర్గమ్మ సీపీఐ(ఎం) పెద్దబీరవల్లి సర్పంచ్‌గా ఒక దప పనిచేశారు. సీపీఐ(ఎం) సర్పంచ్‌గా పనిచేసిన ఐదేళ్ల కాలంలో తాళ్ల దుర్గమ్మ ఆ గ్రామ అభివృద్ధికి విశేషమైన కృషి చేసి మంచి ప్రజా ప్రతినిధిగా గుర్తింపు పొందారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జరిగే ప్రతి కార్యక్రమంలో చురుకైన పాత్ర నిర్వహించారు. ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన అనేక పోరాటాలలో కీలకపాత్ర పోషించారు. గత కొంతకాలంగా అనా రోగ్య సమస్యలతో ఇబ్బందులు పడు తున్నారు. పరిస్థితి విషమించి పెద్ద బీరవల్లిలోనే మృతి చెందారు. మృదేహాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు వాసిరెడ్డి వరప్రసాదరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శి పెద్దపోలు కోటేశ్వరరావు, పెద్ద బీరవల్లి సర్పంచ్ ఆళ్ల పుల్లమ్మ, పెద్ద బీరవల్లి ఎంపీటీసీ కర్లకుంట దేవమణి, మాజీ ఎంపీటీసీ కర్లకుంట ముత్తయ్య, మాజీ సర్పంచ్ మిర్యాల వెంకటకృష్ణ, మాజీ సొసైటీ అధ్యక్షులు ఆళ్ల ప్రసాద్, మాజీ శాఖ కార్యదర్శి చల్లగుండ్ల రామ నరసయ్య తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

బీజేపీ దుర్మార్గాన్ని ఖండిద్దాం

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో

నవతెలంగాణ-కూసుమంచి



ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తల పెట్టినా భారత్ జోడో న్యాయ యాత్రపై బీజేపీ కార్యకర్తలు చేసిన దాడినీ నిరసిస్తూ సోమవారం కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఖమ్మం -సూర్యపేట ప్రధాని రహదారిపై మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ మతోన్మాద భావజాన్ని పెంచి పోషిస్తూ శాంతియుతంగా చేస్తున్న ర్యాలీపై బిజెపి చేసిన కుట్రను ప్రజలందరు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మతోన్మాద బిజెపి అరాచకాలను దేశ ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి అరాచకాలు ఓడించి దేశ ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని పిలుపు నిచ్చారు. రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్రను అడ్డుకోవాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మట్టె గురవయ్య, కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు పువ్వాల దుర్గా ప్రసాద్, నగర అధ్యక్షులు ఎండీ.జావిద్, దొబ్బల సౌజన్య కార్పొరేటర్ల నరేంద్ర, సైదులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

మధిర : రాహుల్ గాంధీపై బిజెపి గుండాల దాడిని నిరసిస్తూ మధిర మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తుల నిరసన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ మాట్లాడారు. ఈ నిరసన ర్యాలీలో మధిర మండల, పట్టణంనికి చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, వివిధ హోదాల్లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో క్రికెట్ కిట్లు అందజేత

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్లను మండల పరిధిలో వరంగల్ క్రాస్ రోడ్‌లోని శ్రీరామనగర్ కాలనీలో సీపీఐ, కాంగ్రెస్ నాయకులు కలిసి సోమవారం యుకులకు, క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రంగారావు, సురేందర్, కాంగ్రెస్ నాయకులు భూక్య సురేశ్‌నాయక్, నాయకులు రవి, చారి, శేషి రెడ్డి, హుస్సేన్, రాజు, భుజంగరెడ్డి, రమేశ్, శ్రీనివాసడ్డి, శివలింగం, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో...

కామంచికల్లులో కాంగ్రెస్ నాయకులు క్రీడాకారులకు సోమవారం క్రికెట్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతాపనేని రఘు, యాదాల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నడిమూరు ఆలయానికి పంచలోహ విగ్రహాలు వితరణ

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండలం నడిమూరులోని అంజనేయ స్వామి అలయానికి సీతారామాంజనేయ స్వాముల పంచలోహ విగ్రహాలను తాండ్ర కార్తీక్-నవీన దంపతులు సోమవారం వితరణ చేశారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభం సందర్భంగా గ్రామంలోని ఆలయానికి రూ.35వేల విలువైన పంచలోహ విగ్రహాలను అందించినట్లు కార్తీక్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఉండం మోహన్ రావు-కష్ణవేణి, ఉండం విశ్వనాథం- స్వరూప, ఉండం కోటేష్- కవిత, ఈసాల శ్రీను-శతి, కుంజ నాగేశ్వరరావు- కౌసల్య, యదలపల్లి నరేష్ కష్ణవేణి - కుంజ అంజిత్-సంధ్య, ధమసలపూడి అశోక్ - స్వరూప దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమసమాజం కోసం
కార్మిక, కర్షక, ఐక్యత అనివార్యం

- లెనిన్ శత వర్ధంతి సభలో ఏజే రమేష్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సమ సమాజ నిర్మాణం కోసం కార్మిక, కర్షక ఐక్యత అనివార్యమని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ అన్నారు. పార్టీ భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బండారు చంద్రరావు భవన్ నందు కామ్రేడ్ లేనిన్ శత వర్ధంతి సభ జరిగింది. లేనిన్ చిత్రపటానికి ఏజే రమేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రమేష్ మాట్లాడుతూ... లెనిన్ చనిపోయి 100 సంవత్సరములు గడచిన గాని ప్రపంచవ్యాప్తంగా లెనిన్ రచనలు కార్మిక, కర్షక, సకల ప్రజానీకాన్ని ప్రభావితం చేస్తున్నాయని, ఆయన జీవించిన కాలం కేవలం 54 ఏండ్లు అయినా గాని రష్యాలో సోషలిజం జయప్రదం కోసం నిరంతరం శ్రమించి అక్కడ సోషలిజం దేశంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కావునా ఇప్పటికైనా పాలకులు పక్షపాత ధోరణిని విడనాడి అందరికీ కూడు, గుడ్డ, చదువు, వైద్యం, సమస్థాయిలో అందించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పట్టణ కమిటీ సభ్యులు, డి.లక్ష్మి, ఎన్.నాగరాజు, కోరాడ శ్రీను, భూపేందర్, నాగలక్ష్మి కనక వేణి, ఆది, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కారు కింద పడి మూడేళ్ల బాలుడు మృతి



నవతెలంగాణ-టేకులపల్లి

టేకులపల్లి మండలంలోని బావోజితండాలో కారు కింద పడి మూడేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. టేకులపల్లి ఎస్ఐ గస్ రెడ్డి రమణారెడ్డి కథనం ప్రకారం కోయగూడెం గ్రామ పంచాయతీలోని భావోజితండకు చెందిన అజ్మీర విక్రమ్-మాధవి దంపతుల కుమారుడు అజ్మీర సిద్ధార్థ్ (3) తమ ఇంటి ఆవరణంలో ఆడుకుంటుండగా ఇంటి సమీపంలోనే ఉన్న అదే గ్రామానికి చెందిన అజ్మీర సుమన్ కారు పార్కింగ్ చేసి వెనుకకు తీస్తుండగా అక్కడే ఆడుకుంటుండగా బాలుడు కారు వెనుక భాగంలో పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంట రాధా ఆధ్వర్యంలో చీరెల పంపిణీ



నవతెలంగాణ-మణుగూరు

దానధర్మ ట్రస్టు చైర్మెన్ గంటా రాధా ఆధ్వర్యంలో సోమవారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. మణుగూరు మండలం, అశ్వాపురం మండలలో చీరలు పంపిణీ కార్యక్రమం జరిగిందని రాధ తెలిపారు. మున్సిపాలిటీలోని అన్నారం గ్రామం, కమలాపురం, బట్టీల గుంపు, బట్ట మల్లయ్య గుంపు, రామనగర్, కళ్యాణపురం గ్రామంలో స్త్రీలకు ఉచిత బట్టలు చీరలు పంపిణీ నిర్వహించమన్నారు. దాతలకు సహకరించిన పెద్దలకు, గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

'ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం'

నవతెలంగాణ-మణుగూరు

ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీటీసీల ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపూడి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని కూనవరం గ్రామ పంచాయతీ కార్యాలయం నందు జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలో ఉన్న మౌలిక సమస్యలను గ్రామ సభ దృష్టికి తీసుకురావాలని, ఇక్కడ పరిష్కారం కానీ సమస్యలు మండల పరిషత్‌లో పరిష్కారం చేస్తామన్నారు. పెద్ద సమస్యలు ఉంటే ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ద్వారా మాట్లాడి అభివృద్ధికి నిధులు మంజూరు చేపిస్తామని తెలిపారు. ఈ గ్రామ సభలో వార్డ్ సభ్యులు కలగూర శంకర్, సురేష్, పంచాయతీ సెక్రటరీ సంధ్యా రాణి, గ్రామ పంచాయతీ కో ఆప్షన్ మెంబెర్ ఆకారపు కళావతి, పిసా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విప్ప మొక్కలు నాటిన గ్రీన్ భద్రాద్రి సభ్యులు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అయోధ్యలో రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ట సందర్భంగా శ్రీరామచంద్ర వారికి వక్షార్చనలో భాగంగా గ్రీన్ భద్రాద్రి, భద్రాచలం వారు, పీఓ ప్రతీక్ జైన్ స్ఫూర్తితో సోమవారం విప్ప మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి పాకాల దుర్గాప్రసాద్ హాజరై మాట్లాడుతూ... భారతదేశం శతాబ్దాల నాటి నుండి ఎదురుచూస్తున్న అయోధ్యలో రాములవారి ప్రాణప్రతిష్ట సందర్భంగా గ్రీన్ భద్రాద్రి సభ్యులు సీతారామచంద్ర స్వామి వారికి వక్షార్చనలో భాగంగా నేడు భద్రాచలంలో విప్ప మొక్కలు నాటినట్టు, విప్ప పువ్వును రాములవారికి ఎంతో ఇష్టమైన ప్రసాదంగా భక్తులు భావిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రీన్ భద్రాద్రి గౌరవ అధ్యక్షులు జీఎస్ శంకర్రావు మాట్లాడుతూ ప్రతి ఒక్క మనిషి భోజనం ఎలా చేస్తామో, నీరు ఎలా తాగుతామో, దైనందిన జీవితంలో మనం క్రమం తప్పకుండా ఏవిధంగా పనులు చేసుకుంటామో అదేవిధంగా మొక్కలు నాటడం కూడా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి కార్యదర్శి శ్రీరంగం సంపత్, కోశాధికారి విష్ణు మొలకల సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారు పాకాల దుర్గాప్రసాద్, గౌరవాధ్యక్షులు జీఎస్ శంకర్రావు, డా.గోళ్ల భూపతిరావు, బోనాల నాగ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య తలంబ్రాలు పంపిణీ



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని నడికుడి గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు సోడి తిరుపతిరావు ఆధ్వర్యంలో అయోధ్య నుండి వచ్చిన తలంబ్రాలను సోమవారం ఇంటింటికీ అందజేశారు. ముందుగా గ్రామంలో గల ఆలయాలతో పాటు గ్రామ దేవతల వద్ద ప్రత్యేక పూజలు అనంతరం మహిళలు సీతారామ లక్ష్మణ స్వాముల వారి చిత్రపటాన్ని చేత పట్టి, మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో గ్రామ పురవీధులు తిరుగుకుంటూ ఇంటింటికీ అయోధ్య నుండి వచ్చిన తలంబ్రాలను భక్తిశ్రద్ధలతో అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్మాణాలు జరిగితే చట్ట పరమైన చర్యలు

- తహసీల్దారు కృష్ణ



నవతెలంగాణ-చుంచుపల్లి

చుంచుపల్లి మండల పరిధిలోని విద్యానగర్ గ్రామ పంచాయతీలో గల సర్వే నం 137/1, 137/3 నుండి 137/9లో గల 18 ఎకరాల భూమి వివాదంలో వున్నదన తహసీల్దార్ కృష్ణ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ తెలిపారు. సోమవారం వివాదంలో ప్రాంతంలో అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా వివాదంలో ఉన్న ఈ 18 ఎకరాలలో ఎవరు ఇంత కాలం నిర్మాణాలు చేపట్టక పోగ నూతనంగా ప్రభుత్వం ఏర్పడటంతో అట్టి 18 ఎకరాల భూమిలో రాజకీయ నాయకులు, చోటా మోటా లీడర్ల అండ దండాలతో నిర్మాణాలు చేపడుతున్నారు. సదరు భూమి తాలూకా వ్యక్తులు జరిగిన గ్రీ వెన్స్ డేలో జిల్లా కలెక్టర్‌కి ఈ విషయమై ఫిర్యాదు చేశారని చెప్పారు. స్పందించిన జిల్లా కలెక్టర్ సంభందిత మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు వివాదంలో ఉన్న ఆ18 ఎకరాల భూమిని పరిశీలించారు. ఆ 18 ఎకరాల భూమి కోర్టు పరిధిలో వున్నదని కోర్టు తీర్పు ఇచ్చేవరకు ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చెప్పట్టవద్దని తెలిపారు. నిర్మాణం చేపడుతున్న వారికి నిర్మాణాలు చేపట్టవద్దని నోటీసులు జారీ చేశారు. అనంతరం వివాదంలో ఉన్న 18 ఎకరాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలంలో నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో గ్రామ పంచాయతీ , రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మాజీ కార్మికులను గోసపెట్టొద్దు

- కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయండి
- ఎమ్మెల్యే సభ్యులు కూనంనేని
- సింగరేణి రిటైర్డ్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో హెడ్ ఆఫీస్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-కొత్తగూడెం

సుదీర్ఘకాలంపాటు సింగరేణి సంస్థకు సేవలందించిన మాజీ కార్మికులను యాజమాన్యం గోసపెట్టొద్దని, వారి సేవలకు గుర్తింపుగా సంస్థ ద్వారా సేవలు అందించాలని కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. మాజీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి రిటైర్డ్ ర్మికుల సంఘం ఆధ్వర్యంలో సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంస్థ ద్వారా అందుతున్న సేవల్లో మాజీ అధికారులకు, మాజీ కార్మికులకు మధ్య వ్యత్యాసం ఉంటోందని, ఇలాంటి వివక్షత సరైందికాదన్నారు. కార్పొరేట్ వైద్యశాలల ద్వారా వైద్యం అందించే సీపీఆర్ఎంఎస్ పథకంలో మాజీ అధికారుల కుటుంబాలకు రూ.25లక్షల పరిమితి విధించి మాజీ కార్మికులకుల కుటుంబాలకు కేవలం రూ.8 లక్షల పరిమితి విధించడమేంటని ప్రశ్నించారు. అధికారులను, కార్మికులను సమానంగా పరిగణించే భాద్యత సంస్థపై ఉందన్నారు. సింగరేణి ఆస్పత్రుల్లో వైద్యం పొందే మాజీల నుంచి 40శాతం ఫీజులు వసూలు చేసే విధానానికి స్వస్తి చెప్పి పూర్తిస్థాయిలో ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కనీస అవసరాలు తీరని పెన్షన్ విధానం సింగరేణి సంస్థలో అమలు చేస్తున్నారని, రూ.200 నుంచి రూ.2వేల లోపు పెన్షన్ తీసుకొను కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, మూడేళ్ళకోసారి ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంచాలని, కనీస పెన్షన్ రూ.10వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

రూ.20లక్షల గ్రాట్యూటీని 2016 నుంచి అమల్లోకి తెచ్చి సంబందిత ఎరియర్స్ మాజీ కార్మికుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. మాజీ కార్మికులకు సొంతింటి సౌకర్యం కల్పించాలని, క్వార్టర్లలో నివసించే మాజీ కార్మికులను ఖాళీ చేయించే విధానానికి స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, అడిషనల్ ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, ముఖ్య సలహాదారులు దమ్మలపాటి శేషయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా, సంఘం నాయకులు మాతంగి లింగయ్య, అన్నెం లక్ష్మి నారాయణ, ఆళవందార్ వేణు మాధవ్, కె.బీరయ్య, ఎస్.నర్సింగ్ రావ్, వివిధ బ్రాంచిల నాయకులు తదితరులు పాల్గొన్నారు.





వైభవంగా...
శ్రీ రామ శోభాయాత్ర

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ప్రముఖులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామ శోభాయాత్ర వైభవపేతంగా భక్తిశ్రద్ధలతో కొనసాగింది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా గత నాలుగు రోజుల నుండి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్న విషయం తెలిసిందే. సోమవారం అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో రామయ్య భక్తులు పట్టణ ప్రముఖులు పలు హిందూ సంఘాలు పాల్గొనగా దేవస్థాన ప్రాంతం నుండి చప్ట దిగువ శిల్పి నగర్‌తో పాటు అంబేద్కర్ సెంటర్ మీదుగా పట్టణంలో పురవీధులలో యాత్ర నిర్వహించారు. శ్రీ రామ నామ జపం చేస్తూ కోలాటాలతో నృత్యాలతో మంగళ వాయిద్యాలతో సాగిన ఈ శోభాయాత్రను చూసేందుకు పట్టణంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శోభాయాత్రలో బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు ఐటిసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ అగ్రభాగాన నిలిచి ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ప్రముఖులు

అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవ శుభ సందర్భాన్ని భద్రాచలం దేవస్థానంలో గడపాలన్న సంకల్పంతో ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు భద్రాచలానికి విచ్చేసి రామయ్య సన్నిధిలో గడిపారు. ప్రత్యేకించి పీసీసీ సభ్యులు మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు, మరొక మాజీ రాజ్యసభ సభ్యులు పొంగులేటి సుధాకర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌కి చెందిన మాజీ మంత్రివర్యులు గంటా శ్రీనివాస్, చింతపల్లి ప్రభాకర్‌తో పాటు అనేకమంది రాజకీయ ప్రముఖులు సోమవారం భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దర్శించుకున్నారు. అంతేకాకుండా ఒరిస్సా ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన సీలేరు మోతుగూడెం వలస గడ్డ నుండి పది గ్రామాలకు చెందిన సుమారు 150 మంది రామ భక్తులైనటువంటి గిరి పుత్రులు విశ్వనాథ్ భగవాన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కాలినడకన భద్రాచలం చేరుకొని పవిత్ర గోదావరి నది తీరంలో పుణ్యస్నాలను ఆచరించి రామయ్యను దర్శించుకుని శోభాయాత్రలో పాల్గొన్నారు. అయోధ్య రామ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా భద్రాచలంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలాగా పట్టణంలో పురవీధులలో పలు కూడలిలలో పలు స్వచ్ఛంద సంస్థలు వ్యాపార సంస్థలు ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలను నిర్వహించారు.

ఎమ్మెల్యే కోరంకు సన్మానం



నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్ గ్రామపంచాయతీ రైతు వేదికలో ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్యకు టేకులపల్లి ఐసీడీఎస్ సిబ్బంది సోమవారం శాలువతో సన్మానించినట్లు తెలిపారు. టేకులపల్లి ప్రాజెక్టులో 104మినీ అంగన్వాడి టీచర్స్‌ను మెయిన్ టీచర్స్‌గా గవర్నమెంట్ అప్‌గ్రేడ్ చేయడం జరిగిందన్నారు. టేకులపల్లి-48, ఆళ్లపల్లి-19, గుండాల-28, ఈ సెంటర్స్‌ని అప్ గ్రేడ్ చేసినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ మంగతార, అరుణ, వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్, సర్పంచ్ మాలోత్ సురేందర్ నాయక్, సులానగర్ సర్పంచ్ అజ్మీర బుజ్జి, రాందాస్, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలను ముందుకు తీసుకెళ్లడమే శ్రీదేవికిచ్చే నివాళి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు
- ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బండారు శ్రీదేవి 6వ వర్ధంతి సభ



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

కష్టకాలంలో ప్రజా పోరాటాలను ముందుకు తీసుకుపోవడమే అమరజీవి కామ్రేడ్ బండారు శ్రీదేవికి మనం ఇచ్చే నివాళి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బిబిజి తిలక్ సతీమణి, ఐద్వా సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ బండారు శ్రీదేవి 6వ వర్ధంతి సభ బెల్లంకొండ కుసుమ అధ్యక్షతన సోమవారం జరిగింది. బండారు శ్రీదేవి చిత్రపటానికి మచ్చా, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బిబిజి తిలక్, ఐద్వా సీనియర్ నాయకులు నాదెళ్ల లీలావతిలు పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో మచ్చా, ఐద్వా పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మిలు మాట్లాడుతూ... కామ్రేడ్ బండారు శ్రీదేవి పార్టీ, మహిళా సంఘం ఐద్వా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారని అన్నారు. పార్టీ, ప్రజా సంఘం కార్యకర్తల పట్ల ఆమె ఆప్యాయంగా ఉండేవారని, నాయకుల పట్ల నమ్రతతో మెలిగేవారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, సీనియర్ నాయకులు బిబిజి తిలక్, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, పట్టణ కమిటీ సభ్యులు ఎస్. నాగరాజు, కే.శ్రీనివాస్, భూపేంద్ర, కుంజా శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఎంఎస్ నారాయణ, డి.రామకృష్ణ కుటుంబ సభ్యులు బండారు అరుణ్ చంద్, ప్రతాప్, సుందరయ్య ఐద్వా నాయకులు సుబ్బలక్ష్మి, జి.నాగలక్ష్మి, సక్కుబాయి, సుశీల, సరోజిని, రాధా, బేగం, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

చైర్మెన్‌తో ఏసీబీ అధికారులు భేటీ

- మెడికల్ బోర్డు నిర్వహణపై ఆరా...
- మెడికల్ బోర్డు పారాదర్శకంగా జరుగుతుంది : చైర్మెన్



నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి ప్రధాన కార్యాలయంలో సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్, ఏసీబి సింగరేణి విజిలెన్స్ అధికారులతో సింగరేణి సంస్థలో జరిగే మెడికల్ బోర్డు విషయమై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మెన్ మాట్లాడారు. సంస్థలో పనిచేసే ఉద్యోగులు ఎటువంటి దళారులను ఆశ్రయించవలసిన అవసరం లేదని మెడికల్ బోర్డు నిర్వహణ పూర్తి పారాదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మెడికల్ బోర్డులో పైరవిలకు తావు లేకుండా చేస్తామని, గతంలో మెడికల్ బోర్డులో పైరవీలు చేయిస్తామనే నెపంతో డబ్బులు వసూలు చేసిన కొంత మంది ఉద్యోగులపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. ఇక ముందు కూడా మెడికల్ బోర్డు నందు పైరవీలు చేయిస్తామనే నెపంతో ఎవరైనా ఉద్యోగులు డబ్బులు వసూలు చేసినట్లైతే సంస్థ పరంగా కఠిన క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏసీబి రిజినల్ ఉన్నతాధికారి రమేష్ మాట్లాడుతూ సంస్థలో పనిచేసే అనుమానాస్పద ఉద్యోగుల కదలికలపై పూర్తి నిఘా వుంచుతున్నామని ఒకవేళ ఎవరైనా మెడికల్ బోర్డులో పైరవిల నెపంతో ఉద్యోగులనుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసినట్లైతే చట్టపరంగా కటిన చర్యలు ఉంటాయని తెలిపారు.

పాఠశాలను ప్రారంభించిన ఎంపీపీ, జెడ్పీటీసీ



నవతెలంగాణ-దుమ్ముగూడెం

చింతగుప్ప గ్రామ పంచాయతీ పరిధిలోని సూజ్ఞుపూరం మండలం ప్రజా పరిషత్ పాఠశాలను ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ సోమవారం ప్రారంభించారు. ముందుగా చింతగుప్ప గ్రామపంచాయతీ సర్పంచ్ కట్టం క్రిష్ణ కొబ్బరికాయ కొట్టగా ఎంపీపీ, జెడ్పీటీసీ రిబ్బన్ కట్ చేశారు. సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకుని ఎన్నో ఏళ్లగా మరమ్మతులకు నోచుకోని పాఠశాలను ఐటీడీఏ నిధుల ద్వారా మరమ్మతులు చేయించి విద్యార్థులకు మంచి విద్య బోధన జరిగే విధంగా పాఠశాలను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్ బానోత్ లక్ష్మణ్, బి.రవి, లగవాత్ నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి పి.వెంకటేష్, కణితి రాముడు, అజ్మీరా రాంజీ, రమేష్ గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.



భద్రాద్రి కబీర్...

- మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన షేక్ అజీమ్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా దేశంలో ఉన్న ప్రతి హిందువు మహత్తర కార్యక్రమంలో పాలుపంచుకోవాలని బీజేపీ ఇచ్చిన పిలుపు తప్పు అని రుజువు చేస్తూ అన్ని మతాల గ్రంధాలు చెప్పేది ఒకటేనని నిరూపిస్తూ మతసామరస్యానికి ప్రతీకగా భద్రాచలం పట్టణానికి చెందిన షేక్ అజీమ్ నిలుస్తున్నారు. మొదటినుండి ఎన్టీఆర్‌కి వీర అభిమానిగా పేరుందిన షేక్ అజీమ్ తెలుగుదేశం పార్టీలో అనేక రకాల బాధ్యతలు నిర్వహించి పట్టణ అధ్యక్షుడిగా భద్రాచలం పట్టణంలో తెలుగుదేశం పార్టీని బలమైన శక్తిగా తయారు చేయడంతో పాటు పలు స్వచ్ఛంద సేవ సంస్థలలో భాగస్వామి అయి అనేక రకాల సేవా కార్యక్రమాలలో ముందుంటున్నారు. లౌకిక భారతదేశంలో మతము అనేది వ్యక్తిగతం అని సేవ చేయటానికి కులాలు, మతాలతో సంబంధం లేదని రుజువు చేస్తూ ప్రతి సంవత్సరం శ్రీరామనవమికి ఇతర ప్రాంతాల నుండి భద్రాచలానికి వచ్చే యాత్రికులకు అనేక రూపాలలో సేవ చేయటమే కాకుండా సోమవారం నాడు అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా భద్రాచలంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలలో అగ్రభాగాన నిలిచి భద్రాద్రి కబీర్‌గా ప్రశంసించబడ్డారు. శోభాయాత్ర కోసం తన వ్యక్తిగత ఖర్చుతో పదివేల శ్రీరామ నామ జండాలను శాలువాలను తెప్పించి మరీ రామయ్య భక్తులకు ఉచితంగా అందించి శోభాయాత్ర విజయవంతం కావడంలో కీలక భూమిక పోషించారు. రంజాన్ సందర్భంలో కూడా అనేక రాజకీయ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులతో మాట్లాడి పేద ముస్లింలకు సహాయం చేయటంలో అజీమ్ దే అగ్ర భాగం అని చెప్పాలి. భద్రాచల దివ్య క్షేత్రంలో రామ మందిరాన్ని నిర్మించిన శ్రీరామదాసుకి వెన్ను దండుగా నిలిచిన కబీర్ దాసుని షేక్ అజీం మైమరిపిస్తూ బ్రాహ్మణ సంఘం గౌర అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ నిర్వహించే హిందూ సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలలో అజీమ్ పాల్గొని ప్రత్యేకతను చాటుకుంటున్నారని పట్టణ ప్రముఖులు అభినందిస్తున్నారు.

అభివృద్ధిలో వివక్షకు గురవుతున్న
అంబేద్కర్ నగర్ గ్రామం

మూడు దశాబ్దాలు అయినా సీసీ రోడ్లకు నోచుకోని వైనం

- గ్రామాభివృద్ధిని పట్టించుకోని ఎమ్మెల్యేలు
- ప్రజా ప్రతినిధుల పై అసహనం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



నవతెలంగాణ-అశ్వాపురం

మూడు దశాబ్దాలుగా అభివృద్ధిలో అంబేద్కర్ నగర్ గ్రామం తీవ్రమైన వివక్షకు గురవుతోందనడంలో ఎటువంటి సందేహం లేదు. భార జలకర్మగారంకు సమీపంలో గల అను శక్తి నగర్ గ్రామంలో ఉన్న కొంతమంది నివాసులను హెవీ వాటర్ ప్లాంట్ నుండి వెలువడే హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు వలన ప్రమాదాలు జరగకుండా ఆనాటి ప్రభుత్వం ప్లాంటుకు ఐదు కిలోమీటర్ల దూరంలో గ్రామం ఉండాలన్న ఉద్దేశంతో 1994 సంవత్సరంలో మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను ఇండ్ల స్థలాలుగా ఇచ్చింది. గ్రామం ఏర్పడి ఇప్పటికీ 30 ఏళ్లు గడుస్తున్న ఈ గ్రామంలో ఏ పాలకులు ఒక్క సీసీ రోడ్డు కూడా పోయకపోవడం గమనార్హం. ఈ గ్రామం ఏర్పడిన తరువాత ఒక పర్యాయం తాటి వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేగా, మరో రెండు పర్యాయాలు రేగా కాంతారావు ఎమ్మెల్యేగా కొనసాగారు. ప్రస్తుత ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మూడోసారి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టారు. ఇంతమంది ఎమ్మెల్యేలు మారిన, ప్రభుత్వాలు మారిన, తెలంగాణ రాష్ట్రం విభజన అయినప్పటికీ అంబేద్కర్ నగర్ అభివృద్ధిలో పాలకుల నిర్లక్ష్య ధోరణి కొట్టొచ్చినట్లు కనబడుతోంది. తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు అతి సమీపంలో ఉన్న ఈ గ్రామం అభివృద్ధి పట్ల అధికారులు, పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారని ఇక్కడి వారు అంటున్నారు.

వర్షాకాలంలో దారుణంగా రోడ్లు

అంబేద్కర్ నగర్ గ్రామంలో సుమారు 100 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. గ్రామంలో రెండు ప్రధాన రహదారులతో పాటు ఏడు వీధి రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్లన్నీటిపై కేవలం మట్టి పోసి వదిలేసిన అధికారులు ఏ ఒక్క రోడ్డుకు సీసీ రోడ్లు పోయకపోవడం పట్ల ఈ గ్రామస్తులు పాలకుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే రోడ్లన్నీ చెత్తడిగా మారి నడవడానికి వీలు లేనంతగా ఉంటున్నాయని గ్రామస్తులు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో నైనా గ్రామంలోని అన్ని వీధులకు సిసి రోడ్ల తోపాటు శిథిలావస్థకు చేరుకుని కూల్చిన అంగన్వాడి భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు.

గ్రామంలో సీసీ రోడ్లు వేయాలి

: కొమ్ము వెంకటేశ్వర్లు అంబేద్కర్ నగర్ గ్రామం



అంబేద్కర్ నగర్ గ్రామం ఏర్పడి 30 ఏళ్లు అవుతున్న గ్రామంలో ఒక్క సీసీ రోడ్డు కూడా వేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ పాలకులు స్పందించి గ్రామంలో సిసి రోడ్లు వేయాలి.

సీసీ రోడ్డు లేక వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం

: ఓంకార చారి



అంబేద్కర్ నగర్ గ్రామంలో సిసి రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో బురద రోడ్లపై నడవాలంటే తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. గ్రామం పట్ల పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి సీసీ రోడ్లు వేయాలి.

యూఆర్ఎస్‌లో చేరిన బాల కార్మికుడు

నవతెలంగాణ - అశ్వారావుపేట

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కుప్పాల యశ్వంత్ గతకొంత కాలంగా చదువు ఆపేసి మోటార్ సర్వీసింగ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. తల్లిదండ్రులు ఎంతచెప్పినా పాఠశాలకు వెళ్లడం లేదు. ఇతన్ని విద్యాశాఖ సిబ్బంది బడి బయట సర్వేలో గుర్తించారు. కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయురాలు హరిత, కాంప్లెక్సు సి.ఆర్.పి ప్రభాకరాచార్యులు విద్యార్థికి, విద్యార్థి తల్లికి కౌన్సిలింగ్ నిర్వహించారు. బడికి రానని మొండికేసిన విద్యార్థిని ఒప్పించి కొత్తగూడెం లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ లో చేర్పించారు. అక్కడ విద్యార్థికి అన్ని సౌకర్యాలతో విద్య అందిస్తున్నారు.

పూలే, అంబేద్కర్, ఆశయాలకు అనుగుణంగా పనిచేద్దాం

- తెలంగాణ బహుజన ఐక్య వేదిక

నవతెలంగాణ-పాల్వంచ

యువత పూలే, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని బహుజన ఐక్య వేదిక కన్వీనర్ బరగడి దేవదానం అన్నారు. పాల్వంచ ఐక్య వేదిక కార్యాలయంలో అధ్యక్షుడు శ్రీపాద సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్వంచ మండలం నాగారం, రేపల్లెవాడలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నూతన విగ్రహ నిర్మాణ సభ్యులతో జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ దేశంలో బహుజనులు జరిగిన అన్యాయాలను రూపుమాపుటకు ఎదిరించి, పోరాడిన పూలే అంబేద్కర్ ఆశయాలను గ్రామ, గ్రామాన ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా నాగారం గ్రామంలో అంబేద్కర్ నూతన విగ్రహం నిర్మించుటకు సమావేశం నిర్ణయం తీసుకున్నది. అంబేద్కర్ సమాజానికి చేసిన సేవలను ఆదర్శంగా తీసుకొని బహుజనులు రాజ్యాధికారం దిశగా సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర నాయకులు నబీసాహెబ్ ఐక్య వేదిక సభ్యులు, శనగ రామచందర్ రావు, నాగారం యూత్ సభ్యులు పాల్గొన్నారు.



డీఎంహెచ్ఓ శిరీష అవినీతిపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ కార్యాలయం ఎదుట గిరిజన సంఘాల ధర్నా

నవతెలంగాణ-పాల్వంచ

డీఎంహెచ్ఓ శిరీష అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘాల ఐక్యవేదిక సోమవారం జిల్లా కలెక్టరేటు ఎదురుగా ధర్నా నిర్వహించింది. అనంతరం జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధమైన హక్కులను ప్రశ్నిస్తే కేసులు నమోదు చేస్తారా ప్రశ్నించారు. దీని వెనుక ఆంతర్యమేమిటో ప్రభుత్వ అధికారులే చెప్పాలన్నారు. పాల్వంచ పోలీస్ స్టేషన్లో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు రాజేష్ నాయక్ పై నమోదు చేసిన కేసును బేసరతుగా ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేశారు. భద్రాచలం డీపీఎంఓను చర్లకు అక్రమ డిప్యూటేషన్ మీద పంపించడం, దీనిపై, అక్రమ డిప్యూటేషన్ దందా పేరిట ఇటీవల పలు పత్రికల్లో కథనాలు వచ్చాయన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆదివాసీ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ వాసం రామకృష్ణ దొర, తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు కొమరం బుచ్చయ్య, ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణా నాయక్, ఎల్‌హెచ్‌పిఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మోహన్ నాయక్, ఎల్‌హెచ్‌పిహెచ్ కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు గుగులోతు కేశవ నాయక్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు దశరథ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అటవీ అభివృద్ధి పేరుతో వ్యాపారం

- వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-అశ్వారావుపేట

తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థను (టీఎస్ఎఫ్‌డీసీ) రద్దు చేసి ఆ భూములను పేదలకు పంచాలని కోరుతూ సోమవారం తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ కు "ఆదివాసీ జీవన విధానం" ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంస్థ సామాజిక కార్యకర్త, ప్రముఖ జర్నలిస్టు పి.క్రాంతి మాట్లాడారు. కొందరు తమకున్న ఆర్థిక పలుకుబడిని, అధికారి సాధికారతను, రాజకీయ ఆసరా చేసుకొని చట్టాలను తమకు అనుకూలంగా మలుచుకొని ఏజెన్సీ ప్రాంతంలోని అటవీ భూములను 1976 నుంచి అత్యంత కారుచౌకగా లీజుకు తీసుకుంటున్నారని ఆరోపించారు. కేవలం ఎకరం రూ.8లు చొప్పున అటవీ శాఖకు చెల్లిస్తూ అటవీ అభివృద్ధి పేరిట వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. అశ్వారావుపేట మండల పరిధిలో సుమారు 4949 ఎకరాల భూములను గత 48 సంవత్సరాలుగా ఫారెస్టు డెవలప్ మెంట్ కార్పొరేషన్ అనుభవిస్తుందని అన్నారు. ఈ భూముల్లో అటవీ అభివృద్ధి ఏమాత్రమూ జరగక పోగా ఆ భూముల్లో జామాయిల్, వెదురు వంటి వాణిజ్య పంటలను సాగు చేస్తూ భూసారాన్ని మొత్తం పీల్చి పిప్పి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సోయం బాబూరావు(చిన్నారి), తాటి రవి, సోడె స్వరాజ్, సున్నం నాగరాజు పాల్గొన్నారు.

తిరుమల ఇంజనీరింగ్ యజమాని దివాళా పిటిషన్ దాఖలు

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఖమ్మం న్యాయస్థానంలో సోమవారం వైరాకు చెందిన తిరుమల ఇంజనీరింగ్ యజమాని కొల్లి తిరుమలరావు ఐపి పిటిషన్ దాఖల చేశారు. దివాళా పిటిషనర్ వైరాలో తిరుమల ఇంజనీరింగ్ పేరుతో ట్రాక్టర్‌లు రిపేర్లు, వ్యవసాయ పరికరాల తయారు, అమ్మకం వ్యాపారం చేసేవాడు. ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడం కోసం మొత్తం 12 మంది ప్రతివాదుల దగ్గర రూ.86,00000ల డబ్బులు వడ్డీలకు రుణాలను తీసుకొని వ్యాపారాన్ని అబివద్ధి చేసినాడు. ఈ వ్యాపారంలో ఒడుదొడుకులు రావడంతో వ్యాపారం సరిగ్గా నడువక, ప్రతివాదుల నుండి ఒత్తిడి అధిక మవడంతో మొత్తం 12 మంది ప్రతివాదులపై దివాళా పిటిషన్ తమ న్యాయవాదులు అయిన చింత నిప్పు వెంకట్, సాయి రాజీవ్‌ల ద్వారా దివాళా పిటిషన్‌ను ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు లో దాఖలు చేశారు.

రాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని వీక్షించిన న్యాయవాదులు

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

అయోధ్యలో రామ మందిర్ నిర్మాణం, బాల రాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఖమ్మం జిల్లా కోర్టు ప్రాంగణంలో గల బార్ అసోసియేషన్ హాల్లో మంగళవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు

న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరై టీవీలో లైవ్ షో ద్వారా శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని తిలకించారు. బార్ అసోసియేషన్ హాల్లో జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో ప్రసాదం వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, కార్యదర్శి మన్నేపల్లి బసవయ్య, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, బార్ అసోసియేషన్ బాధ్యులు, న్యాయవాద పరిషత్ బాధ్యులు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు రైతు దంపతులకు ఆహ్వానం

నవతెలంగాణ-పాల్వంచ

గణతంత్ర దినోత్సవ వేడుకలకు జిల్లా నుండి గిరిజన రైతు దంపతులకు ఆహ్వానం అందింది. 26న ఢిల్లీలో నిర్వహించనున్న ఈ వేడుకల్లో ఉద్యానవన శాఖ తరపున దుమ్ముగూడెం మండలం కమలాపురం గ్రామానికి చెందిన గిరిజన రైతు దంపతులు పెనుబల్లి గంగరాజు, లక్ష్మి పాల్గొనే అవకాశం దక్కిందని జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న తెలిపారు. మారు మూల గిరిజన గ్రామానికి చెందిన ఈ రైతు దంపతులు డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్ పామ్, మామిడి, జామ, సీతాఫలం, ఆపిల్ బేర్, కూరగాయలు, మొదలైన ఉద్యాన పంటలు సాగులో ఆధునిక పద్ధతులు అయిన బిందు సేద్యం, మల్చింగ్, సేంద్రియ పద్ధతులు పాటిస్తున్నారని ఆయన చెప్పారు. గిరిజన రైతు దంపతులను జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న అభినందించారు.



అభివృద్ధికి కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలి

- గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి
- 25న దిశా కమిటీ సమావేశం
- ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి
- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ

15వ ఆర్థిక సంఘ నిధులు మంజూరుకు స్థానిక సంస్థల అభివృద్ధి కార్యచరణ ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశపు హాల్లో జిల్లా బ్లాకుల అభివృద్ధికి సంబంధించిన గణతంత్ర దినోత్సవ వేడుకలు దిశా కమిటీ సమావేశం తదితర అంశాలపై అన్ని శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దారులు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 29 అంశాలపై జిల్లా బ్లాకు నివేదికలు తయారు చేయాలని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పన మహిళా సాధికారిక సామాజిక న్యాయం అందరికీ ఆరోగ్యం, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వాహన తదితర అంశాలపై ఉన్న ప్రణాళికలు



రూపొందించాలని చెప్పారు. కార్యచరణ ప్రణాళికల రూపకల్పనలో గ్రామాల అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలు చేపట్టేందుకు ఉత్పదం కావాలని అన్నారు. ప్రతిపాదనలు పంపేందుకు జారీచేసిన ప్రొఫార్మాలో అన్ని వివరాలను నమోదు చేయాలని చెప్పారు. గ్రామపంచాయతీ ప్రణాళికలు పర్యవేక్షణకు డీపీఓ రమాకాంత్ మండల స్థాయి నాయకుల పర్యవేక్షణకు జడ్పి సీఈఓ నుడులా అధికారులుగా నియమించినట్లు చెప్పారు.

అనంతరం గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల గురించి మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ వరకు అన్ని పనులు పూర్తిచేయాలని కలెక్టర్ వేడుకలు నిర్మాణపై నిర్వహించే సమావేశంలో అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారుల స్టాల్స్ ఏర్పాటుకు జాబితా అందజేయాలని చెప్పారు. వేదికను పూలతో సుందరంగా అలంకరించాలని, ఉన్నత శాఖ అధికారి మరిన్నకు సూచించారు. పాఠశాల విద్యార్థులచే దేశభక్తికి సంబంధించిన అంశాలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈఓకు సూచించారు. మైదానంలో అత్యవసర వైద్య చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. ఈనెల 25వ తేదీ జిల్లా కలెక్టరేట్లో ఉదయం 10 గంటలకు దిశా కమిటీ సమావేశం నిర్వహించడం జరుగుతుందని శాఖల అధికారులు గత సమావేశంలో చర్చించిన అంశాలపై తయారు చేసిన యాక్షన్ టేకెన్ రిపోర్టుతో హాజరుకావాలని చెప్పారు. అధికారులు సమావేశంపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జడ్పీ పిడి సీఈవో నాగలక్ష్మి అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



6లోపు గ్రాడ్యుయేట్స్ ఓటు నమోదు చేసుకోండి

నవతెలంగాణ-అశ్వారావుపేట

గ్రాడ్యుయేట్ ఎం.ఎల్.సి ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫిబ్రవరి 6 చివరి గడువు అని తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ తెలిపారు. సాధారణ ఓటరు జాబితాలో ఓటరుగా నమోదు అయి ఉండి, 2020 నవంబర్ 1 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, స్థానికులు అయిన ప్రతీ ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఎం.ఎల్.సి ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

నాటు సారాయి పట్టివేత

నవతెలంగాణ- దుమ్ముగూడెం

ద్విచక్ర వాహనాలపై నాటు సారాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుండి దుమ్ముగూడెం పోలీసులు సోమవారం 32 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ దోమల రమేష్ తెలిపిన వివరాలు ప్రకారం... సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయం సమయంలో హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య స్టేషన్ సిబ్బందితో కలిసి చిన్నబండిరేవు గ్రామం వద్ద వాహన తనిఖీలు చేయుచుండగా ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్ మీద వస్తు పోలీస్ వారిని చూసి కంగారు పడుతూ మోటార్ సైకిల్ ను వెనక్కి తిప్పుకొని వెళుతుండగా వారిని వెంబడించి పోలీసులు పట్టుకున్నారు. వారి వివరాలు అడగ్గా భూక్యా వీరు, భూక్యా శ్రీకాంత్ సుజ్ఞానపురం గ్రామంగా తెలిపారు. నాటు సారాయిని ఛత్తీస్‌గఢ్‌లో తక్కువ ధరకు కొని చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కువ ధరకు అమ్ముతున్నానని తెలిపారు. వారిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.



ఏడూళ్ళ బయ్యారం ఎస్సైగా వెంకటప్పయ్య బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-పినపాక

మండలంలోని ఈ.బయ్యారం పోలీసుస్టేషన్ ఎస్సైగా టి.వెంకటప్పయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ నాగుల్ మీరా మెడికల్ లీవ్ పై వెళ్లారు.

నేడే కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ స్టేట్ గౌట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడే పెన్షనర్స్ సంఘ కార్యాలయంలో ఉదయం 10 గంటల కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు సిహెచ్ బలరాం తెలిపారు. వరంగల్ శరత్ హాస్పిటల్ వారిచే ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య
- పొదెంకు ఎమ్మెల్సీ ఇచ్చి క్యాబినెట్ హెూదా కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని టిపిసిసి ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం ములకపాడు ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్ నందు దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు పొదెం వీరయ్య, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి పొదెం వీరయ్య మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ స్థానిక సంస్థ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని గ్రామస్థాయి కమిటీలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు లంక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల కమిటీ సభ్యులు, కార్యకర్తలు మాజీ శాసనసభ్యులు పొదెం వీరయ్య గత 35 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ నమ్మిన సిద్ధాంతాన్ని కట్టుబడి ఉన్నారని కాంగ్రెస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించిన కేవలం నమ్మిన కాంగ్రెస్ పార్టీని వీడకుండా కాంగ్రెస్ పార్టీలో కొనసాగారని కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఎమ్మెల్సీ ఇచ్చి క్యాబినెట్ హెూదా కల్పించాలని మండల కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు శిరపు అప్పల రెడ్డి, వేమన రెడ్డి, పిలక వెంకట రమణారెడ్డి, మందపాటి అప్పిరెడ్డి, దర్శి సాంబశివరావు, అన్నె నారాయణమూర్తి, రాజా రెడ్డి కనుబుద్ది దేవా, సోడి చలపతి లంక శివ, తెల్లం హరికృష్ణ, తోటమళ్ళ సంగీతరావు, వేముల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

బూర్గంపాడు ఉపాధ్యాయిని అక్రమ డిప్యూటేషన్ రద్దు చేయాలి

- జీత భత్యాలు నిలుపుదల చేయించాలి
- ఏఎస్‌పీ, ఏవీఎస్‌పి డిమాండ్

నవతెలంగాణ-చర్ల

ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ పద్ధతిలో డిప్యుటేషన్‌పై వెళ్లిన బూరుగుపాడు ఉపాధ్యాయిని డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని ఏవిఎస్పీ ఏఎస్పి డిమాండ్ చేసింది. సోమవారం కుదునూరు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు విజయ బాబుకి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లుదొర మాట్లాడారు. బూర్గుపాడు ప్రాథమిక పాఠశాలలో నియమించిన ఉపాధ్యాయురాలు ఆ పిల్లలకు పాఠాలు చెప్పకుండా పైరవీ చేయించుకుని డిప్యూటేషన్‌పై దమ్మపేట మండలం మందలపల్లి హైస్కూల్‌కి వెళ్లి విధులు నిర్వహిస్తుంటే బూర్గుపాడు స్కూల్ లో పనిచేస్తున్నట్లు జీతం ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. ఇక్కడ పిల్లలకు చదువు చెప్పే వారు లేకపోయిన పర్వాలేద పిల్లలకు అన్యాయం జరిగిన మీరు మండల విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారితో సహా ఇలాంటి అక్రమ డిప్యూటేషన్లను కప్పిపుచ్చుకుంటూ ఆ ప్రాంత పిల్లలకు నియమించిన ఉపాధ్యాయులను విద్య బుద్దులు నేర్పించకుండా అన్యాయం చేస్తారని ఆయన ధ్వజమెత్తారు.

ఎంపీపీఎస్ బూర్గుపాడు పాఠశాలలో 38 మంది పిల్లలు ఉన్నారు. అదీ వలస వచ్చిన ఆదివాసీలు., ఆ పిల్లలకు విద్యాబుద్దులను నేర్పల్సిన టీచర్ అక్రమ డిప్యూటేషన్లు పేరుతో మందలపల్లి హైస్కూల్లో ఎస్‌జిటి టీచర్ వర్క్ అడ్జెస్ట్ కింద స్కూల్లో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఇదే కాంప్లెక్స్ లో ఎంపీపీఎస్ వీరాపురం పాఠశాలలో సైతం ఉపాధ్యాయుడు లేక ఆ పాఠశాల మూత పడిందన్నారు. ఇది ఎంతవరకు సమంజసం, కనీసం కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రొసిడింగ్ లేదు, మండల ఎంఈఓ ప్రొసీడింగ్ లేదు, ఇవి రెండూ లేకుండానే



డిప్యూటేషన్‌పై వెళ్ళిపోతున్నారంటే ఇక్కడ అడ్మినిస్ట్రేషన్ లేనట్టేనా ఇదే విషయంపై ఈనెల 11న కలెక్టర్ ప్రియాంక అలాను కలిసి మెమోరాడం ఇచ్చామన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి డిప్యూటేషన్ రద్దు చేస్తానని హామీ ఇచ్చారని వివరించారు. వారి డిప్యూటేషన్ రద్దు చేసే అంతవరకు ఆ టీచర్ జీతం నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తెల్లం రాంబాబు, రమేష్, విజయ రామ్, చర్ల మండల కమిటీ తదితరులు పాల్గొన్నారు.

ఆటో - క్యాబ్ డ్రైవర్‌లకు ప్రభుత్వమే జీవనోపాధి కల్పించాలి

- సీఐటీయూ నాయకులు అర్జున్

నవతెలంగాణ - అశ్వారావుపేట

ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఉపాధి కోల్పోయిన ఆటో, క్యాబ్ డ్రైవర్లకు నెలకు రూ.4500 జీవన భృతి ఇవ్వాలని, భారతీయ న్యాయ సంహిత 106 (1)(2) రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం బస్టాండ్ వద్ద ఆటో స్టాండ్ కార్మికులను ఉద్దేశించి అర్జున్ మాట్లాడుతూ రవాణా రంగంలో లారీ డ్రైవర్, ఆటో డ్రైవర్స్ తదితర రంగాల కార్మికులు పనిచేస్తున్నప్పటికీ వీరికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి సామాజిక భద్రత పథకాలు ప్రవేశ పెట్టడం లేదని, అనారోగ్యం పాలైన వయసు పైబడిన కుటుంబ పోషణ కష్టంగా మారుతుందని అన్నారు. వీరిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉన్నప్పటికీ, ప్రమాదాలను తగ్గించేందుకు మోటార్ వాహన చట్టాన్ని సవరణ చేస్తున్నామనే పేరుతో కేంద్ర ప్రభుత్వం ఎంవీ యాక్ట్ 2019 తీసుకువచ్చిందని, ఈ చట్టం వల్ల చిన్న చిన్న పొరపాట్లకు కూడా వేలాది రూపాయలను జరిమానాలు వసూలు చేస్తూ డ్రైవర్లకు జైలు శిక్షలు కూడా విధిస్తుందిన్నారు. ప్రమాదకరంగా ఉన్న సెక్షన్స్ 106(1)(2) రద్దు చేయాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో క్యాబ్ డ్రైవర్లకు మూడు నెలలపాటు ఈ.ఎం.ఐపై



మారటోరియం ప్రకటించాలని, కేరళ తరహా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వమే ఆన్లైన్ యాప్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముత్తేశ్వరరావు శ్రీను పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ
- పరిష్కారానికి సంబంధిత అధికారులకు సిఫార్సు

నవతెలంగాణ-పాల్వంచ

ప్రజా సమస్యల పరిష్కారం పట్ల అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా జిల్లా అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల చూస్తే సునావత్ జ్యోతి అంగన్వాడీ టీచర్‌కు దరఖాస్తు చేసుకున్నానని, తాను ఇల్లందుల పాడుతండాలో అంగన్వాడీ సెంటర్లో సహాయకురాలుగా పనిచేస్తున్నానని ఇంటర్మీడియట్ పాసై ఉన్నానని తనకు సమీపంలోని రెడ్డిగూడెం



అంగన్వాడీ సెంటర్ లో టీచర్ పోస్ట్ ఖాళీ ఉన్నదని, అన్ని అర్హతలు గల తనకు పోస్టు ఇప్పించాలని చేసిన దరఖాస్తును మహిళా సంక్షేమ అధికారికి ఎండార్స్మెంట్ చేశారు. ఎండి. మెహమూదా బేగం, పాత పాల్వంచ నివాసి, తాను వితంతువునని, తెల్ల రేషన్ కార్డు కూడా ఉందని, తనకు సొంత ఇల్లు లేనందున, డబుల్ బెడ్ రూమ్, గృహలక్ష్మి పథకాలకు దరఖాస్తు చేసుకున్నానని తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును డిఆర్వో కు సిఫారసు చేస్తూ పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న ప్రజావాణికి మన జిల్లా నుండి 144 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ చెప్పారు. దరఖాస్తుదారులకు నోటీసు జారీ చేయాలని చెప్పారు. అట్టి నోటీస్‌లో ఏడు రోజుల్లోగా జారీ చేసిన నోటీస్ ఆధారంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నివేదికలు అందచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు, డిఆర్‌ఓ రవీంద్రనాథ్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై గ్రామసభలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని మొత్తం 37 గ్రామ పంచాయతీలలో సోమవారం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై (జీపీడీపీ) గ్రామ సభలు నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగిన గ్రామసభలలో ప్రజలు పాలకవర్గ ఆమోదంతో ప్రణాళికలు తయారు చేశారు. చింతగుప్ప గ్రామపంచాయతీలో జరిగిన గ్రామ సభలో ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పిటిసి తెల్లం సీతమ్మలు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రజలతో పాటు, ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మామిళ్లగూడెంలో వైభవంగా బొడ్రాయి ప్రతిష్ట

-ఎమ్మెల్యే జారె ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ములకలపల్లి

మండల పరిధిలోని మామిళ్లగూడెంలో బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ఈ బొడ్రాయి ప్రతిష్టా కార్యక్రమానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరై బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే జారెకు ఘనస్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని గ్రామదేవతలకు మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మండల నాయకులు, సర్పంచ్, గ్రామస్తులు, కమిటీ నిర్వాహకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే అనంతరం ములకలపల్లి సాక్షి రిపోర్టర్ బండారు శివ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సోమ్లా నాయక్ చిత్ర పటానికి నాగ సీతారాములు నివాళి

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

మండలంలోని పెద్దతండ(రేగళ్ళ) గ్రామం నందు సీనియర్ కాంగ్రెస్ నాయకులు జాటోత్ సోమ్లానాయక్ దశదిన కార్యక్రమానికి టీపీసీసీ సభ్యులు నాగాసీతారాములు హాజరై వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ అజ్మీర మోహన్, మాజీ జెడ్పిటిసి బాదావత్ రామకోటి, వార్డు మెంబర్ సీతారాం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు భూక్య కిషన్, పాల్గొన్నారు.



చెకుముకి టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ - జూలూరుపాడు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూలూరుపాడు నందు సోమవారం పాఠశాల స్థాయి జన విజ్ఞాన వేదిక చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌కు జూలూరుపాడు ఉన్నత పాఠశాల నుండి సుమారుగా 70 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఇంగ్లీష్ మీడియం ప్రథమ ద్వితీయ తృతీయ, తెలుగు మీడియం ప్రథమ ద్వితీయ, తృతీయ స్థాయిలో వచ్చిన వారిని ఈనెల 27దీన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ఎంపిక చేయడం జరుగుతుందని, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతంగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు తప్పెట లక్ష్మీనరసయ్య తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలు

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని జానకీపురం గ్రామంలో గల సత్యమ్మ గుడిలో గత సంవత్సరం హుండీ పగలగొట్టి డబ్బు ఎత్తుకుపోవడంతో గ్రామస్థులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో సబ్ ఇన్స్పెక్టర్ షాహిన కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కొద్ది రోజుల్లోనే అనుమానితుడుగా ఉన్న చుంచుపల్లి మండలం పాలవగు గ్రామానికి చెందిన మడవి భద్రయ్య(36)ను పట్టుకొని విచారణ చేయడంతో దొంగతనం చేసినట్లు ఒప్పుకోవడంతో అతన్ని రిమాండ్‌కి పంపించడంతో సోమవారం కొత్తగూడెం కోర్టులో విచారణ చేసి ద్వితీయ అడిషనల్ జేఎఫ్‌సిఎం జడ్జి సుచరిత నిందితుడు మడవి భద్రయ్యకు 8 నెలలు జైలు శిక్ష విధించారు. ఈ కేసులో ఇన్వెస్టిగేషన్ అధికారిగా సబ్ ఇన్స్పెక్టర్ షాహిన, ఎపిపి విశ్వశాంతి, కోర్టు కానిస్టేబుల్ సురేష్, కోర్టు లైజినింగ్ హెడ్ కానిస్టేబుల్ హరిగోపాల్ సహకరించారు.

అయోధ్య తలంబ్రాలు ఇంటింటికీ పంపిణీ

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని నడికుడి గ్రామంలో సోమవారం స్థానిక ఎంపీటీసీ సోడి తిరుపతిరావు ఆధ్వర్యంలో అయోధ్య నుండి వచ్చిన తలంబ్రాలను ఇంటింటికీ అందజేశారు. ముందుగా గ్రామంలో గల ఆలయాలతో పాటు గ్రామ దేవతల వద్ద ప్రత్యేక పూజలు అనంతరం మహిళలు సీతారామ లక్ష్మణ స్వాముల వారి చిత్రపటాన్ని చేత పట్టి మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో గ్రామ పురవీధులు తిరుగుకుంటూ ఇంటింటికీ అయోధ్య నుండి వచ్చిన తలంబ్రాలను భక్తిశ్రద్ధలతో అందజేశారు.

టెట్ నుండి టీచర్లకు మినహాయింపు ఇవ్వాలి



నవతెలంగాణ-టేకులపల్లి

రాష్ట్రంలోని టీచర్లకు పదోన్నతులలో టెట్ నుండి టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని, ఫిబ్రవరి 11, 12వ తేదీలలో ఖమ్మంలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ సోమవారం తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల సులానగర్‌లో ప్రధానోపాధ్యాయులు జి.దేవదాస్, గిరిజన ఆశ్రమ పాఠశాల కోయగూడెంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బి.బాలరాజు, టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, జెడ్పిహెచ్ఎస్ ముత్యాలంపాడులో ప్రధానోపాధ్యాయులు డి.రామ్ చందర్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్ ఆవిష్కరణ చేసినట్లు తెలిపారు. మహాసభలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ప్రొఫెసర్ జగన్మోహన్ సింగ్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, బుర్రా వెంకటేశం, ఏ.శ్రీదేవసేన, బుర్రా రమేష్, ఏ.నరసింహారెడ్డి ప్రొఫెసర్ సి.కాశీం, ప్రొఫెసర్ కోదండరాం, ఎన్.వేణుగోపాల్, చందనా చక్రవర్తి, పి.ప్రసాద్ హాజరవుతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే 22 వేల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, పెండింగ్ బిల్లులన్నింటినీ వెంటనే ఖాతాలలో జమ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో జిల్లా కౌన్సిలర్ ఈ.ముత్తయ్య, మండల కార్యదర్శులు బి.శ్రీనివాస్, ఎం.శారద, కార్యకర్తలు, ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, ప్రశాంతి, కృష్ణ, సరోజ, కిషోర్, హైమావతి, లక్ష్మణ్, బాలు, శ్రీనివాస్, సునీత, టి.శ్రీనివాసరావు, జె.సామ్య సిహెచ్.వీరన్న, పి.పాపారావు, సిహెచ్.జానకి, కే.శ్రీదేవి, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకులంలో వైద్య శిబిరం

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ బాలురు గురుకుల పాఠశాలలో ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు తగిన పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ మొత్తం ఐదుగురు విద్యార్థులకు రక్త పూతలు సేకరించామని పలువురికి గొంతు నొప్పి, దగ్గు, జలుబు వుండటంతో వారికి మందులు ఇచ్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్స్ సంధ్యారాణి, హెచ్ఈఓ కృష్ణయ్య, హెచ్.వి శారారాణీ, హెల్త్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, ఆశావర్కర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు దళిత బంధు ఇవ్వాలి

నవతెలంగాణ-మణుగూరు

లబ్ధిదారులకు దళిత బంధు ఇవ్వాలని సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా దర్బార్‌లో దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం దళితులకు గత ప్రభుత్వం అక్టోబర్ నెలలో దళిత బంధు మంజూరు అయ్యాయని, లబ్ధిదారుల నుంచి ఆధార్ కార్డు, అకౌంట్ నెంబర్ బ్యాంకులో దళిత బందుకు ప్రత్యేక అకౌంట్ తీసి గ్రామ స్థాయిలో ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శి వెరిఫికేషన్ చేశారన్నారని తెలిపారు. ఆన్లైన్ అయిపోయి ఎలక్షన్ కోడ్ వచ్చి లబ్ధిదారులు అకౌంట్‌లో డబ్బులు పడేవి ఆగిపోయయని వాపోయారు. అలా ఆగిపోయిన దళిత బందును లబ్ధిదారులకు ఇవ్వాలని కలెక్టర్‌కు పినపాక నియోజకవర్గం దళిత బందు లబ్ధిదారులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గంలోని మండలాలకు చెందిన దళిత బందు లబ్ధిదారులు పాల్గొన్నారు.

శ్రీరామ నామస్మరణంలో శ్రీ చైతన్య విద్యార్థులు

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

అయోధ్యలో బాల శ్రీ రాముడు ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో వున్న రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో గల రామాలయం నందు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి పలువురికి అన్నదానం చేశారు. రాజపురం గ్రామంలో గల శ్రీ చైతన్య విద్యాలయం ప్రిన్సిపాల్ వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కుల మతాలకు అతీతంగా విద్యార్థులు అందరూ శ్రీ రాముడు జెండా పట్టుకొని జై శ్రీ రామ్ అంటూ గ్రామం మొత్తం తిరిగారు.

జీతాలు పెంచాలని నోటీస్ ఇచ్చిన డ్రైవర్లు

నవతెలంగాణ-టేకుల్లపల్లి

తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ (టీపీఏఎం డబ్ల్యూయు- ఐఎఫ్టియు) టేకులపల్లి బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షులు బానోత్ రామనాయక్‌కు జీతాలు పెంచాలని డ్రైవర్లు డిమాండ్ నోటీస్ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం టేకులపల్లి బ్రాంచి అధ్యక్షులు లాకావత్ నరేష్ మాట్లాడారు. గత రెండు సంవత్సరాలుగా జీతాలు పెరగలేదని, కార్మికులు జీతాలు పెర గక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వెంటనే సమావేశం డ్రైవర్లతో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహకారదర్శి మదార్, రఘు, రామకోటి, రవి, రాజేష్, గణేష్, సారయ్య, వీరు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీఐటీ ప్రాంగణ నియామకంలో 44 మంది విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం ఎస్బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అకాడమర్ కంపెనీ ప్రాంగణ నియామకాలలో తమ కళాశాలకు చెందిన 44 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ సోమవారం తెలిపారు. ప్రసిద్ధి చెందిన అకాడమర్ కంపెనీలో తమ విద్యార్థులు ఎంపిక అవ్వడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. రెండు విడతలలో నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలో మొదటి విడతలో 86 మంది విద్యార్థులు ఎంపిక అవ్వగా, రెండో విడతలో 44 మంది విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించి నియామకం అయ్యారని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి మాట్లాడుతూ ఆర్థిక మాంద్యం వలన ఉద్యోగాలు దొరకడం కష్టతరమైన ప్రస్తుత పరిస్థితులలో కూడా తమ కళాశాల విద్యార్థులు నియామకాలు పొందడం గర్వించ దగ్గ విషయం అన్నారు. రానున్న రోజులలో మరిన్ని కంపెనీలను తమ కళాశాలకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని వారు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రాజ్ కుమార్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం 4.5 లక్షలు పైగా ఉంటుందని, కళాశాల ప్రాంగణంలోని విద్యార్థులు అత్యధిక వేతనం గల ఉద్యోగాలు పొందటం అభినందనీయమని, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ విద్యా సంవత్సరం కూడా మరిన్ని కళాశాల ప్రాంగణ నియామకాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమర్ సంస్థ సీనియర్ హెచ్ఆర్ ఎ. రుజుత, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ టి. శశికుమార్ మరియు కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె. అమిత్ బింధాజ్, ఎకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు, ఎవివి. శివ ప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్, జె. రవీంద్రబాబు, యస్. శ్రీనివాసరావు, టిపిఒ యస్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

మధిర : శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మధిర వారి ఆధ్వర్యంలో అయోధ్య లోని బల రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మధిర రామాలయంలో శని వారం నిర్వహించిన వ్యాసరచన పోటీలలో మధిర జివి. అకాడమీలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని పాలుట్ల సాయి శరణ్యకు ప్రథమ బహుమతి పొందినట్టు ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీలలో మధిర, ఎర్రూపాలెంల నుండి సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల జోనల్ హెడ్ సాధినేని రాజేశ్వరి, బ్రాంచ్ హెడ్ నహర్ సుల్తానా, ఉపాధ్యాయులు విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

అభయ ఆంజనేయ స్వామి విగ్రహానికి శంకుస్థాపన

నవతెలంగాణ-కల్లూరు



పట్టణ పరిధిలోని రామనగర్ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి వారి విగ్రహనీకి సోమవారం కాంగ్రెస్ జిల్లా నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ శంకుస్థాపన చేశారు. అదేవిధంగా షేక్ పాషా కుమారుడు షేక్ జమీల్ వివాహ రిసెప్షన్ వేడుక కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తోట సుబ్బారావు కుమారుడిని పరామర్శించారు. తొలత పలు గ్రామాల్లో దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పసుమర్తి చంద్రరావు, భాగం ప్రభాకర్ చౌదరి, తోట సుబ్బారావు, పెద్ద బోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం

- ట్రాలీ ఆటోలో ప్యాసింజర్ల రవాణా



నవతెలంగాణ-అశ్వాపురం

ప్రజలు ప్రమాదపుటంచున ప్రయాణాలు చేస్తున్నారు. ప్రమాదమని తెలిసి కూడా పరిమితికి మించి వాహనాల్లో ఎక్కుతున్నారు. పొట్టకూటి కోసం పనులకు వెళ్తున్న వారిని శుభకార్యాలకు, దైవదర్శనాలకు వెళ్తున్న వారిని ఇలా కిక్కిరిసేలా మినీ గూడ్స్ వాహనాల్లో ఎక్కించుకొని ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్టు వ్యవహరించడం కోసం మెరుపు. ప్రమాదవశాస్తు ఏదైనా జరిగితే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరుగుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇప్పటికైనా రవాణా శాఖ అధికారులు గూడ్స్ వాహనాలలో ప్రజలను రవాణా చేసే పద్ధతిని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- కలెక్టరేట్ ఎదుట
- మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



నవతెలంగాణ-పాల్వంచ

మధ్యాహ్నం భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు జీతాలు తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు జి.పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత డీఈఓతో మాట్లాడించారు. డీఈఓ మాట్లాడుతూ... 1 ఒకటవ తరగతి నుండి 8వ తరగతి వరకు బిల్లులు 2023 ఆగస్టు నుండి పెండింగ్లో ఉన్నాయని బడ్జెట్ రాలేదని 8 నుండి 10 పిల్లలకు సంబంధించిన నాలుగు నెలలు బిల్లులు ఇంక్ బర్లో ఉన్నాయని మా దగ్గర నుంచి బిల్లులు పంపింనట్టు తెలిపారు. ఇంకుబేరులో ఉన్నాయని ఇంకుబేరు ప్రభుత్వం బడ్జెట్ ఇస్తే రిలీజ్ అవుతాయని చెప్పారు. నెలల తరబడి బిల్లులు జీతాలు రాక మధ్యాహ్న భోజన కార్మికులు అధిక వడ్డీలకు అప్పులు చేసి పిల్లలకు వండి పెడుతున్నారని నెలల తరబడి బిల్లులు ఆపడం జీతాలపడం సరైనది కాదని సీఐటీయూ నాయకులు తెలిపారు. ఒక్క గుడ్డుకు సరిపడా బడ్జెట్ ఇవ్వని ప్రభుత్వం మూడు గుడ్లు ఎలా పెడతారని ప్రశ్నించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసినట్టుగా స్కూల్లో కూడా సరపర చేయాలనే అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచకుండా కొత్త మెనూ పెట్టాలని ఒత్తిడి తేవడం సరైనది కాదని అన్నారు. కొత్త కొత్త పథకాలు ప్రవేశపెట్టే ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా బడ్జెట్ కూడా కేటాయించాలన్నారు. సరైన మెనూ చార్జీలు పెంచకుండా టిఫినీ, కిచిడి, జావా బిర్యానీ, ఆలువ రోజుకు మూడు రకాల కూరలు ఎలా పెడతారని ప్రశ్నించారు. కోడి గుడ్లు ప్రభుత్వమే సరఫరా చేస్తే మేము పెట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచుతానన్న రూ.10వేలు, కాటన్ బట్టలు యూనిఫామ్, వంట పాత్రలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా నాయకులు వెంకట నరసమ్మ, శివమ్మ, ఇస్సరమ్మ అరుణ, నిరోషా, కుమారి, రమా, చిన్నక్క, క్రాంతి, దేవి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రచారం

నవతెలంగాణ-మణుగూరు

కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ వారి పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి సహకారంతో పోలూరి రాము జానపద కళాబృందం వారు సోమవారం మణుగూరు పట్టణంలో బస్టాండ్, పూల దుకాణం సెంటర్లో పల్లెసుద్దుల కళారూపాల ద్వారా హెచ్ఐవిఎస్ పై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవి ఎలా వస్తుంది, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పైన నిరోద్ ప్రాధాన్యత ఏఆర్టీ మందుల విశిష్టత సుఖ వ్యాధులు గుర్చి రక్తదానం, యువతీ, యువకులు చెడుదారులు నడవకూడదని వివరించారు. అలాగే సలహాలు సందేహాల కోసం1097 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేసినట్లయితే పూర్తి వివరాలు తెలియజేస్తారని వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో గాడ్స్ తెరిసా మహిళ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ వట్టి సాగర్ రెడ్డి, సిహెచ్ నాగేంద్ర, పీర్ ఎడ్యుకేటర్స్ రజిని, నీరజ, ఝాన్సీ, ప్రసన్న, నాగలక్ష్మి, కళాకారులు పోలూరి రాము, పుల్లారావు, ఆరింపుల సతీష్, కొచ్చర్ల గురవయ్య లలిత తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార వర్గాల అభివృద్ధికి కృషి చేస్తా : కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం



పట్టణ అభివృద్ధిలో అన్ని రకాల వ్యాపారాలు సరసంగా సాగితేనే పట్టణ అభివృద్ధి జరుగుతుందని, ఇతర ప్రాంతాలనుండి కొనుగోల దారులు వస్తారని, వ్యాపార వర్గాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం పట్టణానికి చెందిన వెండి, బంగారం వర్తక సంఘం, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. చిన్న బజార్‌లో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో కూనంనేని మాట్లాడారు. కొత్తగూడెం పట్టణం అభివృద్ధిలో వ్యాపారస్తుల పాత్ర ఎంతో ఉందని చెప్పారు. వివిధ వ్యాపారాలు కొనసాగిస్తున్న వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, ప్రముఖ న్యాయవాది భాగం మాధవరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము చౌదరి, పులి రాజశేఖర్, కొమ్ము వెంకటేశ్వర్లు, అనుప్ అగర్వాల్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

హోటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే

కొత్తగూడెం పట్టణం, రైల్వే స్టేషన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీబాలాజీ టిఫిన్ సెంటర్‌ను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం ప్రారంభించారు.

న్యాయవాదుల క్రికెట్ పోటీల్లో జ్యుడీషియల్ టీం గెలుపు

నవతెలంగాణ-కొత్తగూడెంలీగల్



గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రుద్రంపూర్‌లో జరిగిన క్రికెట్ పోటీల్లో జ్యుడీషియల్ టీమ్ 'ఏ', న్యాయవాదుల టీం 'సి' పై విజయం సాధించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన జ్యుడీషియల్ టీమ్ 'ఏ' ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్ చేసిన న్యాయవాదుల టీం 'సి' నిర్ణిత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 49 పరుగులు సాధించింది. తదుపరి విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేసిన జ్యుడీషియల్ టీమ్ 'ఏ' 6 వికెట్లు నష్టపోయి 8 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. విజేత కూటమికి జిల్లా ఆధనపు న్యాయమూర్తి వసంత్ పాటిల్ కెప్టెన్‌గా వ్యవహరించగా, ప్రిన్సిపల్ జ్యూనియర్ సివిల్ జడ్జి బి.రామారావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. రన్నర్స్ టీంకు బార్ అసోసియేషన్ క్రీడా శాఖ కార్యదర్శి పిట్టల రామారావు నాయకత్వం వహించారు. ఈ క్రీడలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రికెట్ కోచ్ సన్నీ సోబర్స్, జాకీర్ ఎంపైర్స్ వ్యవహరించారు. రెండు జట్లతో పాటు రమేష్ కుమార్ మక్కడ్, అనుబ్రోలు రాంప్రసాద్, పలివెల సాంబశివరావు, బి.దేవదాస్, పి.రాధాకృష్ణమూర్తి, సాదిక్ పాషా మూడు న్యాయవాదుల జట్లకు నాయకత్వం వహించగా రామిశెట్టి రమేష్ జ్యుడీషియల్ టీంకు నాయకత్వం వహించారు. క్రికెట్ కామెంట్రేటర్లుగా ఎన్.వి. రాజేష్, పాతూరి పాండు రంగ విఠల్ వ్యవహరించగా సింగరేణి కాలరీస్ తరపున క్రీడల ఏర్పాట్లను సాగర్ పర్యవేక్షించారు.

మహిళలకు క్రీడలు : ఖో-ఖో, రన్నింగ్ పోటీల్ని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి, ఫస్ట్ అడిషనల్ జ్యుడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సుచరిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ కుమార్ మక్కడ్, ఉపాధ్యక్షులు దుంద్రా రమేష్, ప్రధాన కార్యదర్శి రావిలాల రామారావు, జాయింట్ సెక్రెటరీ కాసాని రమేష్, సాంస్కృతిక, ఆటల కార్యదర్శి పిట్టల రామారావు, గ్రంథాలయ కార్యదర్శి యాస యుగేందర్, మహిళా ప్రతినిధి మనోరమ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ అన్నపూర్ణ, సీనియర్ న్యాయవాదులు జూనియర్ న్యాయవాదులు కోర్టు సిబ్బంది, న్యాయవాదుల గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు. ఈ ఆటల పోటీల్లో మహిళ న్యాయవాదులు, మహిళా కోర్టు సిబ్బంది, మహిళా న్యాయవాదుల గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు.



టీఎస్ యూటీఎఫ్ డైరీని ఆవిష్కరణ

నవతెలంగాణ-కొణిజర్ల

టిఎస్ యూటిఫ్2024 డైరీని స్థానిక ఎస్ఐ జె.శంకర్‌రావు, తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎస్ యుటిఎఫ్ నిబద్ధతగల సంఘమని కొనియాడారు. ఉద్యోగుల పక్షాన పోరాడేది కూడా యూటిఫ్ సంఘమేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ రంజాన్, మండల అధ్యక్షులు షేక్ లాల్ సయ్యద్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ట్రెజరర్ ఏ. నాగేశ్వరావు, కార్యదర్శి సిహెచ్. వీరస్వామి, సీనియర్ కార్యకర్త పి.శాంతయ్య, డిటి యర్రయ్య పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు సకాలంలో ఇవ్వాలి

- ఐఎన్‌టీయూసీ మిషన్ భగీరథ జిల్లా ఇంచార్జి రవీందర్
- మండల కమిటీ అధ్యక్షులుగా ఉప్పునూతల ఉపేంద్రయ్య

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మిషన్ భగీరథలో కార్మికులందరికీ జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు సకాలంలో ఇవ్వాలని ఐఎన్టియుసి మిషన్ భగీరథ జిల్లా ఇన్‌చార్జి గొర్రెపాటి రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని దమ్మాయిగూడెం గ్రామంలో మిషన్ భగీరథ కార్మికుల కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ కాలం లో మిషన్ భగీరథ కార్మికులకు సకాలంలో వేతనాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పట్ల చిత్తశుద్ధించి కార్మికులకు సకాలంలో వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ ఇస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. ఐఎన్టీయూసీ జిల్లా కమిటీ పిలుపులో భాగంగా నూతన మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఉప్పునూతల ఉపేంద్రయ్య, ధరావత్ కిషన్ నాయక్, ఉపాధ్యక్షులుగా నందిపాటి మల్లికార్జున్, సహాయ కార్యదర్శిగా భూక్య శ్రీధర్, కోశాధికారిగా సయ్యద్ సైదా మీర్, ప్రచార కార్యదర్శిగా జంపాల వెంకటేశ్వర్లు, సలహా దారులుగా తురక ప్రభాకర్, కమిటీ సభ్యులుగా వెంకన్న, వీరబాబు, మహేష్, నరేష్, అనిల్, గౌరవ అధ్యక్షుడిగా గొర్రెపాటి రవీందర్, గౌరవ సలహాదారుడిగా పల్లి ఉపేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చెట్టును ఢీకొన్న కారు

- ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావటంతో తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-కారేపల్లి



ఎదురుగా వస్తున్న మోటర్ సైకిల్ తప్పించే క్రమంలో కారు పక్కకు దూకెళ్లి చెట్టును ఢీ కొన్న ఘటన కారేపల్లి సమీపంలోని పేరుపల్లి రైల్వే గేటు వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఇల్లందుకు చెందిన టీఎస్‌టీయూసీ నేత కనగాల పేరయ్య ఖమ్మం నుండి ఇల్లందుకు కారులో వెళ్తున్నాడు. ఇల్లందు రైల్వే గేటు వద్ద మరమ్మత్తులు జరుగుతుండటంతో వాహనాల ను పేరుపల్లి గేటు మీదిగా అప్పాయిగూడెం నుండి ఇల్లందుకు మళ్లించారు. పేరయ్య కారులో పేరుపల్లి రైల్వే గేటు దాటి మూలమలుపు తిరుగుతుండగా ఎదురుగా మోటర్ సైకిల్ వేగంగా దూసుకవచ్చింది. దానిని తప్పించే క్రమంలో పక్కనే ఉన్న లోతైన కందలోకి దూసుకవెళ్ల చెట్టును ఢీ కొట్టి అగిపోయింది. ఇదే క్రమంలో కారులోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావటంతో ప్రమాదం తప్పింది.





రజక వృత్తిదారుల సంఘం జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రజక వృత్తిదారులు ఆర్థికంగా చాలా వెనకబడి ఉన్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, రజకులు ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్నారని, ఎట్టి చాకిరి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి రజకులు అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్లో 1000 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. రజకులపై రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో దాడులు విపరీతంగా పెరిగాయని, అదే విధంగా వివక్షతకు గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి అసెంబ్లీలో రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా విద్యా ఉద్యోగ రంగాలలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని, అన్ని ప్రభుత్వ రంగ సంస్థలలో గత ప్రభుత్వం రజకులకు సంబంధించిన వృత్తి పనులను కాంట్రాక్టర్లను రజకలకు ఇస్తున్నట్లు ప్రకటించి జీవో విడుదల చేశారని, ఆ జీవోను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు తీసుకొచ్చి రజక వృత్తికి సంబంధించిన కాంట్రాక్టులను రజకులకు ఇవ్వాలని, అర్హులైన రజకులకు పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉచిత విద్యుత్ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని, కొంతమంది విద్యుత్ అధికారులు ఉచిత విద్యుత్తు బిల్లులు చెల్లించాలని తిరుగుతున్నారని, ప్రభుత్వం విద్యుత్ అధికారులకు బిల్లులు వసూలు చేయకూడదని, సర్క్యులర్ ఇవ్వవలసిందిగా కోరుతున్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్తెనపల్లి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు నెల్లుట్ల వెంకన్న, దొనకొండ ముత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు పావురాల అనంత రాములు, నేరెళ్ల వెంకన్న ,శ్రీను, వెంకయ్య, రాజేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యకాస క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ- కూసుమంచి

వ్యవసాయ కార్మిక సంఘం క్యాలెండర్‌ను సోమవారం ఎస్సై రమేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరంతరం వ్యవసాయ కూలీల కోసం పోరాటం చేస్తూ కూలీల పక్షాన నిలబడుతున్న సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఇలాంటి క్యాలెండర్ ప్రింటింగ్ చేయించడం గొప్ప విషయం అని అన్నారు. కార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్షులు చిట్టురి వెంకన్న, మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మూడు గన్యా నాయక్, కార్మిక సంఘం మండల నాయకులు భూక్యా కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని జిల్లా, నగర కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావేద్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనమంతరావు, మాజీ ఎంఎల్సీ పోట్ల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్‌లు మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత ప్రియతమ నాయకులు రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర చేస్తున్న సందర్భంగా ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందనతో బెంబేలెత్తిపోయిన బీజేపీ గుండాలు అస్సాంలోని సోనిత్ పూర్ జిల్లాలో దాడికి పాల్పడ్డారని, బీజేపీ కార్యకర్తలు, గూండాలు చేసిన దాడిని సభ్య సమాజం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాహుల్‌గాంధీ పైన జరిగిన దాడి ప్రజాస్వామ్యంపైన జరిగిన దాడిగా వర్ణించారు. ఈ దాడిని ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమంలో భాగంగా ఖమ్మంలోని ధర్నా చౌక్ నుండి జెడ్ సెంటర్‌లోని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా ఐఎన్టీయుసీ సేవాదళ్, కిసాన్, మైనారిటీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు కొత్తా సీతారాములు, గౌస్, శేఖర్ గౌడ్, సయ్యద్ ముజాహిద్, హుస్సేన్, బొడ్డు బొందయ్య, రాష్ట్ర ఓబిసి సెల్ నాయకులు వడ్డెబోయిన నరసింహారావు, పిసిసి సభ్యులు వడ్డే నారాయణరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు గజ్జెళ్ళి వెంకన్న, కొంటెముక్కల నాగేశ్వరరావు, ఖమ్మం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ జోహారా ముక్తార్, కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వర్లు, దుద్దుకూరు వేంకటేశ్వర్లు, లకావత్ సైదులు నాయక్, మిక్కిలినేని మంజుల, పాకాలపాటి విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామకృష్ణ విద్యాలయంలో అయోధ్య ప్రతిష్ఠాపన వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక త్రీ టౌన్ ప్రాంతంలోని గుట్టల బజార్ నందు శ్రీ రామకష్ణ విద్యాలయంలో సోమవారం అయోధ్య బాల రామ విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు విద్యార్థులచే ఘనంగా నిర్వహించారు. అనంతరం స్కూల్ విద్యార్థులు శ్రీ రామ జయ రామ మంత్రంని 108 సార్లు ఆచార్యులతో కలిసి అధ్యాయానం చేశారు. అదేవిధంగా హనుమాన్ చాలీసా పారాయణం చదివి పిల్లలకు ప్రతిష్టాపన ముహూర్త సమయానికి ప్రొజెక్టర్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు డాక్టర్ జీవీ. వెంకటేశ్వర్లు, పాఠశాల విభాగ్ కార్యదర్శి సుబ్బారావు, పాఠశాల రాష్ట్ర శైక్షనిక్ ప్రముఖ్ నల్లాన్నచక్రవర్తుల కృష్ణమాచార్యుల, ప్రధానాచార్యులు సంతోషా గౌతం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నవతెలంగాణ-కల్లూరు

మిట్టపల్లి సబ్ స్టేషన్ పరిధిలోఉన్న 11 కేవీ నారయ్యబంజర ఫీడర్‌లో మరమ్మత్తుల దృష్ట్యా కల్లూరు మండలంలో మంగళవారం యజ్ఞనారాయణపురం, ఓబులరావుబంజర, ముచ్చారం, విశ్వనాథపురం, పాయపూర్, గ్రామాలలో ఉదయం 8.00 నుండి మధ్యాహ్నం 02.00 వరుకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ తిరుపతిరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు అందరు సహకరిచలని కోరారు.

బిజినెస్

ఎల్ఐసీ నుంచి కొత్త పెన్షన్ ప్లాన్

- జీవన్‌దార-2 ఆవిష్కరణ
- కనీస పెన్షన్ రూ.12వేలు పాలసీపై రుణం



హైదరాబాద్ : ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) కొత్త పెన్షన్ ప్లాన్‌ను విడుదల చేసింది. జీవన్ ధారా-2 పేరుతో ముంబయిలో దీన్ని ఎల్ఐసీ ఛైర్‌పర్సన్ సిద్ధార్థ మహంతి ఆవిష్కరించారు. ఈ కొత్త పాలసీ సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఇది వ్యక్తిగత, పొదుపు, డిఫర్డ్ యాన్యుటీ, నాన్ లింక్డ్ ప్లాన్ అని ఎల్ఐసీ తెలిపింది. 20 ఏళ్లు దాటిన వారు ఈ ప్లాన్‌కు అర్హులు. అదే విధంగా ఎంచుకునే యాన్యుటీ ఆప్షన్‌ను బట్టి గరిష్ఠ వయస్సు 80, 70, 65 ఏళ్లుగా ఉంది. పెన్షన్ (యాన్యుటీ) హామీని నెలకు, మూడు నెలలు, ఆరు నెలలు, వార్షిక పద్ధతిని ఎంచుకోవచ్చు. వయసు పెరిగినకొద్దీ అధిక యాన్యుటీ రేట్లు అందుకోవచ్చు. పాలసీదారులు రెగ్యులర్, సింగిల్ ప్రీమియంలను ఎంచుకోవడానికి వీలుంది. సింగిల్ లైఫ్ యాన్యుటీ, జాయింట్ లైఫ్ యాన్యుటీలుంటాయి. రెగ్యులర్ ప్రీమియంలో వాయిదా వ్యవధి ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల లోపు ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ ప్లాన్‌లో పాలసీదారుడు చనిపోతే వచ్చే ఆ మొత్తాన్ని ఒకేసారి లేదా వాయిదాల్లో నామినీలు తీసుకోవచ్చు. పాలసీదారుడు మరణిస్తే ప్రీమియం మొత్తానికి 105 శాతం సొమ్మును నామినీకి చెల్లిస్తుంది. ఆప్షన్ 2-10 ఎంచుకున్న వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది. జాయింట్ లైఫ్ ఎంచుకుంటే డిఫర్‌మెంట్ పీరియడ్‌లో ఒక వ్యక్తికి ఏదైనా జరిగితే జీవించి ఉన్న వ్యక్తికి యాన్యుటీ కొనసాగుతుంది. ఆ వ్యక్తి కూడా మరణించినప్పుడు నామినీకి ఆ మొత్తం చెల్లిస్తారు. జీవన్ ధారా-2లో నెలకు కనీస పెన్షన్ రూ.1000 నుంచి ప్రారంభమవుతుంది. ఏడాదికి రూ.12 వేలు చొప్పున లభిస్తుంది. సింగిల్ ప్రీమియం అయితే కనీసం రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుంది. అదే రెగ్యులర్ ప్రీమియం అయితే ఏడాదికి కనీస మొత్తం రూ.11 వేలు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. గరిష్ఠ ప్రీమియంపై ఎలాంటి పరిమితులు విధించలేదు. జాయింట్ లైఫ్ యాన్యుటీ కొనుగోలు పాలసీ భాగస్వామిగా కుటుంబ సభ్యులను ఎవరినైనా ఎంచుకోవచ్చు. పాలసీపై రుణ సదుపాయం లభిస్తుంది. ఈ పాలసీని ఆన్‌లైన్, ఏజెంట్ల వద్ద కొనుగోలు చేయవచ్చని ఎల్ఐసీ వెల్లడించింది.

బెడిసికొట్టిన సోనీ-జీ ఒప్పందం

- రూ.80వేల కోట్ల డీల్ రద్దు

న్యూఢిల్లీ : జపనీస్ సంస్థ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్, సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా మధ్య కుదురిన ఒప్పందం అనూహ్యంగా బెడిసికొట్టింది. దీంతో 10 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.83వేల కోట్ల) ఒప్పందం రద్దయినట్లయ్యింది. 2021 డిసెంబర్ 22న విలీన ఒప్పందంపై ఇరు సంస్థలు సంతకాలు చేశాయి. కొత్తగా ఏర్పాటయ్యే సంయుక్త కంపెనీలో సోనీ పరోక్షంగా 50.86 శాతం వాటా, జీ ఎంటర్‌టైన్‌మెంట్ 3.99, మిగతా జీ ఎంటర్‌టైన్‌మెంట్ వాటాదారులకు 45.15 శాతం చొప్పున వాటాలకు అంగీకారం కుదురింది. ఒప్పంద అమలు గడువు 2023 డిసెంబర్ 21తో ముగిసినప్పటికీ.. తదుపరి 2024 జనవరి 21 వరకూ పొడిగించారు. గడువు పొడిగించినప్పటికీ రెండు కంపెనీలు తమ విభేదాలను పరిష్కరించుకోవడంలో విఫలమయ్యాయి. జీ ఎంటర్‌టైన్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ పునీత్ గోయెంకాతో పాటు సంస్థ ప్రమోటర్లపై కేసులు, రెగ్యులేటరీ సంస్థల విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ విలీన ఒప్పందం నిలిచిపోయినట్లు రిపోర్టులు వస్తున్నాయి. గోయెంకా నాయకత్వంపై సోనీ యాజమాన్యం సందేహాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే విలీన ఒప్పందం నుంచి సోనీ పిక్చర్స్ నెట్ వర్క్స్ ఇండియా వైదొలిగినట్లు ప్రకటించిందని తెలుస్తుంది. దీనిపై సోనీకి న్యాయపరమైన నోటీసులు ఇస్తామని జీ ఎంటర్‌టైన్‌మెంట్ పేర్కొంది.

1న సలాసర్ టెక్నో బోనస్ ఇష్యూ షేర్లు

న్యూఢిల్లీ : సలాసర్ టక్నాలజీస్ తమ ఇన్వెస్టర్లకు బంపర్ ఆఫర్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. కంపెనీల్లో ఒక్కషేర్ ఉన్న వారికి 4 షేర్లను బోనస్‌గా ఇవ్వనున్నట్లు ఆ కంపెనీ వెల్లడించింది. డిసెంబర్ 20న జరిగిన బోర్డు సమావేశంలో 4:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల ఇష్యూకు కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. కాగా బోనస్ ఇష్యూ షేర్లకు గాను ఫిబ్రవరి 1వ తేదిని రికార్డ్‌గా నిర్ణయించినట్లు తాజాగా ఆ సంస్థ తెలిపింది.

స్లిమ్ ఎక్స్‌తో రూ.100 కోట్ల ఆదాయం లక్ష్యం

- హార్డ్‌విన్ వెల్లడి


Hardwyn

హైదరాబాద్ : తాము కొత్తగా ఏర్పాటు చేసిన అనుబంధ సంస్థ స్లిమ్ ఎక్స్‌తో రూ.100 కోట్ల ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని హార్డ్‌విన్ ఇండియా లిమిటెడ్ తెలిపింది. తమ ఈ సంస్థ అత్యాధునిక సాంకేతికతతో అల్యూమినియం ఉత్పత్తులను తయారు చేయనున్నట్లు పేర్కొంది. రూ.20 కోట్ల ప్రారంభ పెట్టుబడితో వచ్చే రెండేళ్లలో రూ.100 కోట్ల రెవెన్యూ అంచనా వేస్తున్నట్లు హార్డ్‌విన్ ఎండి రుబుల్‌జీత్ సింగ్ సయాల్ పేర్కొన్నారు. అల్యూమినియంలో ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్, లైటింగ్, ఎలక్ట్రానిక్స్ తదితర వాటిలో అల్ట్రా స్లిమ్ ప్రొఫైల్‌లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

తెలుగు రాష్ట్రాల్లో డ్రాగన్‌హిల్ విస్తరణ

హైదరాబాద్ : సంప్రదాయ, ఫ్యాషన్ దుస్తుల బ్రాండ్ డ్రాగన్ హిల్ తెలుగు రాష్ట్రాల్లో విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. కల్వకుర్తి, సంగారెడ్డి, ఖమ్మం, ఆర్మూర్, నిర్మల్, అనకాపల్లిలో కొత్త స్టోర్లను ప్రారంభించినట్లు వెల్లడించింది. దక్షిణాదిలో ప్రవేశాన్ని వేడుక చేసుకోవడానికి డ్రాగన్ హిల్ 50 శాతం వరకు తగ్గింపు ఆఫర్లను అందిస్తున్నట్లు డ్రాగన్ హిల్ వ్యవస్థాపకుడు మయూర్ సోలంకి తెలిపారు.

ఐఎంటిలో హెచ్ఆర్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్



హైదరాబాద్ : ఐఎంటి హైదరాబాద్‌లో హెచ్ఆర్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్-2024ను నిర్వహించారు.ఆ సంస్థహ్యూమన్ రిసోర్స్ క్లబ్ సినర్జీ కీలక పాత్ర పోషించిన ఈ సదస్సును 'ఎంపవరింగ్ ఫ్యూచర్ వర్క్‌ఫోర్స్: స్ట్రాటజీస్ ఫర్ ఇన్‌క్లూజివ్ లీడర్‌షిప్' నేపథ్యంతో ఏర్పాటు చేశారు. దీనికి ప్రొఫెసర్లు ఉమారావు గందూరి, వెంకట చక్రపాణి, తుంప డే, రోమీనా మాథ్యూ, మాళవిక జోషి హాజరై ప్రసగించారు. సంస్థల్లో మానవ వనరుల నిర్వహణ, నాయకత్వంపై చర్చించారు.

రెచ్చిపోయిన హిందూత్వ శక్తులు

- 'రామ్ కే నామ్' చిత్ర ప్రదర్శన అడ్డగింత
- నిర్వాహకుల అరెస్టు

న్యూఢిల్లీ : అవార్డును గెలుచుకున్న ఆనంద్ పట్వర్ధన్ డాక్యుమెంటరీ 'రామ్ కే నామ్' ప్రదర్శనను హైదరాబాద్‌లో హిందూత్వ గ్రూపులు అడ్డుకున్నాయి. అయితే, ఈ విషయంలో పోలీసుల తీరు చర్చకు దారి తీసింది. కార్యక్రమానికి అంతరాయం కలిగించిన హిందూత్వ గ్రూపులకు చెందిన వ్యక్తులను అరెస్టు చేయటానికి బదులు నిర్వాహకులను అరెస్టు చేశారు. దీంతో పలువురు సామాజికవేత్తలు, కార్యక్రమ నిర్వాహకులు పోలీసుల తీరుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈవెంట్ జరిగిన మార్లీస్ జాయింట్ బిస్ట్రో యాజమాన్యం, ఆర్గనైజింగ్ బాడీ హైదరాబాద్ సినీఫిల్స్ సభ్యులతో సహా నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. పోలీసులు వారిపై ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పట్వర్ధన్ డాక్యుమెంటరీ 1990ల నాటి రామజన్మభూమి ఉద్యమం, 1992 డిసెంబర్ 6 నాటి బాబ్రీ మసీదు కూల్చివేత గురించి వివరిస్తుంది.

ఆత్మ విమర్శ తక్కువ.. పరనింద ఎక్కువ...

(మొదటిపేజీ తరువాయి)

17 ఎంపీ స్థానాలపై నిర్వహించిన సమీక్షా సమావేశాలు 'ఆత్మ విమర్శ తక్కువ.. పరనింద ఎక్కువ...' అనే రీతిలో సాగాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి తేరుకుని, పార్లమెంటుపై దృష్టి పెట్టాలంటూ అగ్రనేతలు క్యాడర్‌కు దిశా నిర్దేశం చేసినట్టు పైకి కనబడుతున్నా... కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలపైన్నే వారు తమ ఫోకసంతా పెట్టారు తప్పితే పార్టీ బలోపేతానికి నిర్దిష్ట కార్యాచరణ ఇవ్వలేకపోయారనే విమర్శలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి. సీఎం రేవంత్ వంద రోజుల్లో అమలు చేస్తామన్న వాగ్దానాలపైన్నే బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్‌రావుల వాగ్బాణాలు కొనసాగాయి తప్ప పార్టీ నిర్మాణం, దాని బలోపేతంపై వారు లోతైన చర్చ చేయలేకపోయారంటూ పలువురు నేతలు బాహాటంగానే విమర్శించటం గమనార్హం. అయితే వివిధ పార్లమెంటు నియోజకవర్గాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నేతలు మాత్రం బీఆర్ఎస్ అధిష్టానానికి మాస్టర్ స్ట్రోక్ ఇచ్చారనే చెప్పాలి. వారు లేవనెత్తిన అంశాలకు ఎలా సమాధానం చెప్పాలో తెలియక నేతలు తలలు పట్టుకున్నారు. ముఖ్యంగా పదేండ్లుగా ప్రభుత్వంపైన పెట్టిన దృష్టి, పార్టీపై పెట్టలేదంటూ కిందిస్థాయి కార్యకర్తలు తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తం చేశారు. క్యాడర్‌ను అస్సలు పట్టించుకోలేదనీ, కార్యకర్తలకు సంబంధం లేకుండా సంక్షేమ కార్యక్రమాలను నేరుగా లబ్దిదారులకు అందజేయటం కూడా పార్టీకి తీరని నష్టం చేకూర్చిందనే విషయాన్ని పలు జిల్లాలకు చెందిన నేతలు అధిష్టానం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ప్రజల్లో పార్టీకి కావాల్సినంత మైలేజీ రాలేదంటూ తేల్చి చెప్పారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలే కేంద్రంగా పార్టీ నడిచింది తప్ప పార్టీ కేంద్రంగా ఎమ్మెల్యేలు వ్యవహరించలేదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆ ముగ్గురిని కలిసిందే లేదు...

పదేండ్ల కాలంలో పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావును తాము కలిసిందే లేదని పలు నియోజకవర్గాలకు చెందిన సీనియర్ నేతలు సైతం సమీక్షల సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. వారిని కలిసేందుకు వస్తే అపాయింట్‌మెంట్లు దొరికేవి కావనీ, ఒకవేళ దొరికినా ఎమ్మెల్యేలు తమను కలవనీయకుండా అడ్డుకున్నారంటూ వారు వాపోయారు. దీంతో సొంత పార్టీ నాయకులే ఈసారి ఓడించారని తెలిపారు. క్షేత్రస్థాయిలో నిర్మాణం, కమిటీలు, అనుబంధ కమిటీలను ఏర్పాటు చేయకపోవటం కూడా అసెంబ్లీ ఎన్నికల్లో దెబ్బ కొట్టిందంటూ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు తమ అనుచరులు, అనుయాయులు, మాట వినేవారినే అన్ని రకాలుగా ప్రోత్సహించటంతో మిగతా క్యాడర్ నైరాశ్యంలో మునిగిపోయిందంటూ వారు తమ బాధను వ్యక్తం చేశారు.

'తెలంగాణ' పదమే లేకుండా చేశారు...

తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరును భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చటం ద్వారా పార్టీ పేరులో తెలంగాణ పదమే లేకుండా చేశారంటూ సమీక్షల సందర్భంగా నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'తెలంగాణ గొంతుక, తెలంగాణ బలం, గళం, దళం మనమే' అంటున్నప్పుడు అసలు పార్టీ పేరులోనే ఆ పదం లేకపోతే ప్రజలు ఎలా రిసీవ్ చేసుకుంటారంటూ మహిళా నేతలు సైతం నిలదీశారు. అందువల్ల తక్షణమే బీఆర్ఎస్ పేరును ఉద్యమ పార్టీ అని చెప్పుకునేందుకు వీలుగా టీఆర్ఎస్ అని మార్చాలంటూ పలువురు పట్టుబట్టారు. మరోవైపు సన్నాహక సమావేశాల్లో అగ్రనేతలు కేటీఆర్, హరీశ్‌రావు తదితరులు రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలపై సొంత పార్టీ నేతలే పెదవి విరిచినట్టు సమాచారం. 'కాంగ్రెస్ ప్రభుత్వంపై త్వరలోనే ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడుతుంది, రెండు మూడేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది...' తదితర కామెంట్లు చేయకుండా ఉండాల్సిందంటూ సీనియర్లు హితవు పలికినట్టు తెలిసింది.

సర్దిచెప్పిన ఆ ఇద్దరు...

సన్నాహక సమావేశాల సందర్భంగా నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను విని, వారి ఆవేదనను, ఆక్రందనను చవిచూసిన మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు క్యాడర్‌కు సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. తీవ్ర నైరాశ్యంలో, అంతకుమించిన ఆగ్రహంలో ఉన్న నేతలను శాంతింపజేసేందుకు వారు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నామనీ, జిల్లాల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను, అభిప్రాయాలను అధినేత కేసీఆర్ దృష్టికి తీసుకుపోతామంటూ వారు భరోసానిచ్చారు. పార్టీ నిర్మాణం, బలోపేతం, శిక్షణా తరగతులు తదితర హామీలనివ్వటం ద్వారా క్యాడర్‌లో ఉన్న అసంతృప్తిని తగ్గించేందుకు వారు ప్రయత్నించి, సఫలీకృతులయ్యారు.

సీనియర్ల సమన్వయం...

పార్లమెంటు సన్నాహక సమావేశాలన్నింటినీ సీనియర్ నేతలు పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, మధుసూదనాచారి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దగ్గరుండి నడిపించగా, మరో సీనియర్ రావుల చంద్రశేఖరరెడ్డి సమన్వయపరిచారు. ప్రతీ రోజూ జరిగిన రివ్యూ తాలూకూ రిపోర్టులను ఆ మరుసటి రోజు కేసీఆర్ వద్దకు పంపారు. ఆయన వాటన్నింటినీ పరిశీలించి, మంచి సూచనలు, సలహాలనిచ్చిన జిల్లా నేతలకు ఫోన్లు చేసి అభినందించినట్టు నేతలు తెలిపారు. త్వరలోనే పార్టీలోని సీనియర్లు, ముఖ్యులతో కేసీఆర్ భేటీ అయి ఎంపీ స్థానాలపై వచ్చిన రిపోర్టులపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించనున్నారు.

ఆరు గ్యారెంటీలకు కాంగ్రెస్ పంగనామాలు..

- ఆ పార్టీకి ఇప్పటికే అనేక వర్గాలు దూరమయ్యాయి...
- కరెంటు కోతలు కూడా షురూ అయ్యాయి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అధికార కాంగ్రెస్ 'ఆరు గ్యారెంటీల'కు పంగనామాలు పెట్టబోతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పనితీరుతో ఇప్పటికే అనేక వర్గాలు ఆ పార్టీకి దూరమయ్యాయని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఇప్పటికే కరెంటు కోతలు షురూ అయ్యాయనీ, మున్ముందు పరిస్థితి ఎలా ఉండబోతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికలప్పుడు పరిస్థితి అంతా బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నట్టే కనబడిందని చెప్పారు. కానీ ఫలితాలు మాత్రం మరోలా వచ్చాయని తెలిపారు. సోషల్ మీడియాలో పార్టీపై జరిగిన దుష్ప్రచారాన్ని సైతం తిప్పికొట్టలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభూత కల్పనలు, అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. అధికారంలోకి వస్తామని ఆ పార్టీ కూడా కలగనలేదని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ అక్రమ, అపవిత్ర బంధం నల్లగొండ మున్సిపాల్టీలో అవిశ్వాసంతో బయటపడిందన్నారు. ఈ అంశాలన్నింటినీ ప్రజలకు విడమరిచి చెప్పటం ద్వారా పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.

గుత్తా ఇంటికి కేటీఆర్...

తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో కేటీఆర్... సోమవారం సాయంత్రం శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. తన కుమారుడు అమిత్ రెడ్డికి నల్లగొండ ఎంపీ టిక్కెట్‌ను ఇవ్వాలంటూ గుత్తా బీఆర్ఎస్ అధిష్టానాన్ని కోరుతున్నారు. అయితే మాజీ మంత్రి, ప్రస్తుత సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి...దీనికి అడ్డుపడుతున్నారని గుత్తా ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు తేరా చిన్నపరెడ్డి, చాడా కిషన్‌రెడ్డి లాంటి వారు కూడా ఆ టిక్కెట్‌ను ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో తన కుమారుడికి ఎంపీ టిక్కెట్ ఇవ్వకపోతే పార్టీని వీడతాననే సంకేతాలను గుత్తా తన అనుచరుల ద్వారా బీఆర్ఎస్ అధిష్టానానికి పంపారు. ఈ క్రమంలో ఆయన్ను బుజ్జగించేందుకు కేటీఆర్ రంగంలోకి దిగారు.



ఎస్‌బీఐ ఉద్యోగులు స్ఫూర్తిదాయకం

- గవర్నర్ తమిళిసై ప్రశంస
- సాయుధ దళాలకు భారీ సాయం

నవతెలంగాణ - హైదరాబాద్

సాయుధ దళాల ఫ్లాగ్ డే ఫండ్‌కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) హైదరాబాద్ సర్కిల్ ఉద్యోగులు భారీ సాయాన్ని ప్రకటించారు. రూ.34,16,750 విలువ చేసే చెక్కును తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ (తెలంగాణ) డైరెక్టర్ కల్నల్ రమేష్ కుమార్, డిజిఎం అండ్ సిడిఒ జితేంద్ర కుమార్ శర్మ, సిఎస్ఒ లెఫ్టినెంట్ కాడర్ అతుల్య ఆనంద్, ఎస్‌బిఐ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ.. "ఎస్‌బిఐ సిబ్బంది అందించిన సహకారం ఒక ఉదాత్తమైన ఉద్దేశ్యంతో కూడింది. ఇలాంటి పనులు స్ఫూర్తినిస్తాయి. ఎస్‌బిఐ ఉద్యోగులు స్ఫూర్తిదాయకం. ఇతర సంస్థలు, పౌరులు అనుకరించాలి. యుద్ధ అనుభవజ్ఞులు, మాజీ సైనికులు, యుద్ధ వితంతువుల సంక్షేమానికి మద్దతుగా ఎస్‌బిఐ సహకారం అందించడం గొప్ప అంశం." అని అన్నారు. ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ హెడ్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. "తమ సంస్థ సమాజానికి, దేశానికి తిరిగి ఇవ్వాలని విశ్వసిస్తుందన్నారు. సాయుధ దళాల కుటుంబాల పురోగతికి సహాయపడే లక్ష్యంతో హైదరాబాద్ సర్కిల్ సిబ్బంది సమిష్టిగా విరాళాలు అందించారు. యుద్ధ అనుభవజ్ఞులు, మాజీ సైనికులు, యుద్ధ వితంతువులకు, సైనికులకు సాయం అందించడంలో ఎస్‌బిఐ ఎప్పుడూ ముందుంటుంది." అని అన్నారు.



మద్యం ధరలు పెంచకుండానే అదాయం పెంచుకోండి

- డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- టూరిజం అభివృద్ధికిచర్యలు చేపట్టండి
- బడ్జెట్‌పై సమీక్షలో అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి సూచనలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మద్యం ధరలు పెంచకుండానే మరిన్ని ఆదాయ మార్గాలను పెంచే చర్యలను చేపట్టాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. ప్రీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖలపై మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సంర్భంగా భట్టి మాట్లాడుతూ ఎలైట్ బార్లు, షాప్‌లు మొదలైనవాటిని ఏర్పాటు చేయడానికి ఏకీకృత వ్యవస్థను ఏర్పాటు చేసి మార్గదర్శకాలను రూపొందించాలన్నారు. అబ్కారీ, పోలీసు, సమాచార శాఖలతో కూడిన మల్టీ డైమెన్షనల్ టీమ్‌లను ఏర్పాటు చేసి డ్రగ్స్ ముప్పుపై అవగాహన కల్పనకు ప్రణాళికను రూపొందించాలని పురాతన కట్టడాలు, దేవస్థానాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు ఎండోమెంట్, టూరిజం, ఆర్టీసీ శాఖల సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో సహజసిద్ధమైన ప్రదేశాలున్నప్పటికీ సరైన మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడంతో అవి ప్రాచుర్యంలోకి రాలేదన్నారు. పర్యాటక కేంద్రాలుగా అభివద్ధి చేయాల్సిన ప్రాంతాలను గుర్తించి సమగ్ర పర్యాటక విధానాన్ని రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యాలయ భవనాల నిర్మాణం, చెక్‌పోస్టుల పటిష్టత చేపట్టాలని ఎక్సైజ్ శాఖ ఈ సందర్భంగా ప్రతిపాదించింది. అలాగే పర్యాటక శాఖ కొత్త టూరిస్టు ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు స్పిల్ ఓవర్ పనులకు నిధులను అందించాలని పర్యాటక శాఖ కోరింది. ఈ సమీక్షలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఎక్సైజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ, టూరిజం అండ్ కల్చర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

8న దేశవ్యాప్తంగా 'కేరళ సంఘీభావ దినోత్సవం'

- అనుబంధ సంఘాలకు సీఐటీయూ పిలుపు

న్యూఢిల్లీ : ఫిబ్రవరి 8న దేశవ్యాప్తంగా 'కేరళ సంఘీభావ దినోత్సవం' నిర్వహించాలని తన అనుబంధ సంఘాలు, సమాఖ్యలకు సెంట్రల్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) సోమవారం పిలుపు పిలుపునిచ్చింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వంపై అనుసరిస్తు వివక్షకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 8న ఢిల్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్, మంత్రులు నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అదే రోజున దేశవ్యాప్తంగా కేరళ సంఘీభావ దినోత్సవం నిర్వహించాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. రాజ్యాంగం కల్పించిన రాష్ట్రాల హక్కుల పరిరక్షణకు, సమాఖ్యవాదం రక్షణ కోసం ఈ సంఘీభావ దినోత్సవం సందర్భంగా దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రదర్శనలు నిర్వహించాలని సిఐటియు పిలుపునిచ్చింది. రాజ్యాంగంలోని సమాఖ్య నిర్మాణంపై దాడులను, ప్రతిపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలపై కేంద్రం వివక్షను నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామని సీఐటీయూ ఈ సందర్భంగా తెలిపింది. గత ఏడాది ఆగస్టు 24న జరిగిన సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ ఐక్య వేదిక జాతీయ సమావేశంలో సమాఖ్య నిర్మాణంపై జరిగే అన్ని రకాల దాడులను వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేసింది. నిరంకుశ మోడీ పాలనకు వ్యతిరేకంగా తీవ్ర ప్రచారం నిర్వహించాలని తన అన్ని కమిటీలు, యూనిట్లుకు సీఐటీయూ పిలుపునిచ్చింది. కేరళలోని ఎల్‌డీఎఫ్ నేతృత్వంలోని ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా అనుకూల విధానాలను అనుసరిస్తోందని, అలాగే ప్రజా సంక్షేమం, ప్రభుత్వ సంస్థలను రక్షించడానికి గట్టిగా నిలబడుతోందని సీఐటీయూ తెలిపింది. కాబట్టి కేరళ సంఘీభావ దినోత్సవాన్ని భారీ స్థాయిలో నిర్వహించాలని తన అనుబంధ సంస్థలకు, సభ్యులకు సీఐటీయూ విజ్ఞప్తి చేసింది.

హర్షిత తెలిస్తే సంప్రదించండి

- లీగల్ సర్వీసెస్ అథారిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మానసిక రోగి హర్షిత అలియాస్ హరిత రాజా తెలిసినా లేదా గుర్తించగలిగిన వారు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీని ఫోన్ నెంబర్ 040-2344 6723లో సంప్రదించాలని అథారిటీ సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమెను ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులో రెండు సంవత్సరాల పాపతో ఉన్న ఆమెను గరియాబాద్ జిల్లా సఖి వన్ స్టాప్ సెంటర్ కాపాడి బిలాస్ పూర్‌లోని మానసిక చికిత్సాలయంలో చేర్పించిందని తెలిపారు. అయితే ఆమెకు భాషాపరమైన ఇబ్బంది ఉండటంతో ఆమెను తెలంగాణ రాష్ట్రానికి తరలించాలని ఛత్తీస్‌ఘడ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీకి లేఖ రాశారు. దీని ఆధారంగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్ జస్టిస్ పి.శ్యాం కోషీ, సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్ రెడ్డి ఒక బృందాన్ని ఛత్తీస్‌ఘడ్‌కు పంపించారు.

గ్యారంటీలకు రేషన్‌కార్డు ప్రామాణికమా?

అర్హత ఉండీ.. కార్డు లేని కుటుంబాల్లో ఆందోళన

- ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసుకున్న 'ప్రజాపాలన' దరఖాస్తులు
- లెక్కతేలిన అర్జీదారుల వివరాలు

నవతెలంగాణ -కరీంనగర్‌ప్రాంతీయ ప్రతినిధి

సాధారణంగా ఏ ప్రభుత్వ పథకం అమలుకైనా లబ్దిదారుల ఎంపిక కోసం రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకుంటారు. గడిచిన ఇన్నేండ్లలో ఆ కార్డు ప్రామాణికంగానే ప్రభుత్వ సేవలు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,25,84,383 దరఖాస్తులొచ్చాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 8.20లక్షల రేషన్‌కార్డులు ఉండగా.. కొత్తగా జిల్లాకు 30వేల చొప్పున మరో 1.20లక్షల అర్జీలు రేషన్‌కార్డు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే అమలయ్యే విధంగా కనిపిస్తున్న 200యూనిట్ల ఫ్రీ కరెంటు, మహిళలకు ప్రతినెలా రూ.2500, రూ.500కు వంటగ్యాస్ సిలిండర్‌పైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ స్కీములకు సంబంధిత అధికారులు ఏయే పత్రాలు అడుగుతారోనన్న చర్చ జనంలో ఉంది. ఇప్పటికే రేషన్‌కార్డులు ఉన్నవారు, లేని వారంతా కొత్తగా కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తు కోసం మీసేవ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. వంటగ్యాస్ సిలిండర్ కనెక్షన్‌పై కేవైసీ చేయించుకునేందుకు ఏజెన్సీల ఎదుటబారులు తీరుతున్నారు. ఇంకోవైపు చాలామందికి రైతు భరోసా అందలేదు. ఈ యాసంగికి పాత సాయాన్నే అందిస్తామని చెప్పిన సర్కారు సీజన్ ముగిసినా ఇప్పటివరకు కేవలం 2.5ఎకరాల్లోపు రైతుల ఖాతాల్లోనే జమ చేసింది. వచ్చే సీజన్‌లో ఇవ్వబోయే రూ.15వేల కోసం ఎలాంటి నిబంధనలు ఉంటాయో తెలియాల్సి ఉంది. నిబంధనలు ఉంటాయని ప్రభుత్వం లీక్‌లు ఇచ్చిన విషయం తెలిసిందే. కౌలుదారుల గుర్తింపు విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది. ప్రజాపాలన దరఖాస్తుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతుభరోసా కింద సాధారణ రైతులు 3,08,835 మంది, 4,01,624కౌలుదారులు పెట్టుబడి సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు.



'గృహజ్యోతి'కి అర్హులు ఎందరో..?

200యూనిట్ల ఫ్రీ కరెంటు అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష తరువాత సంబంధిత విద్యుత్ అధికారులు లెక్కలు తేల్చే పనిలో పడగా.. జనవరి కరెంటు బిల్లులు చెల్లించొద్దంటూ బీఆర్ఎస్ ప్రకటనలు చేస్తోంది.ఈ క్రమంలో కరీంనగర్ జిల్లా వరకు పరిశీలిస్తే.. 200యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే సర్వీసులు 2లక్షల వరకు ఉంటాయని అధికారులు లెక్కలు తేల్చగా.. ప్రజాపాలన దరఖాస్తుల్లో 235091 మంది అప్లయ్ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 8,09,496 అర్జీలు రాగా, ఇందులో పెద్దపల్లి జిల్లాలో 1,76,410, జగిత్యాల జిల్లాలో 2,55,031, సిరిసిల్ల జిల్లాలో 1,42,964 వచ్చాయి.

వంటగ్యాస్, రూ.2500సాయం కోసం ఎదురుచూపు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 8.93లక్షల ఎల్‌పీజీ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాల వారీగా చూస్తే కరీంనగర్‌లో 2.89లక్షలు, జగిత్యాలలో 2.54లక్షలు, పెద్దపల్లిలో 2.10లక్షలు, సిరిసిల్లలో 1.40లక్షలు ఉండగా.. ఇటీవల ప్రజాపాలన సభల్లో రూ.500కు వంటగ్యాస్ సిలిండర్లు కావాలని 9,33,997 దరఖాస్తులు రావడం గమనార్హం. వీరంతా ఆయా ఏజెన్సీల్లో కేవైసీ చేసుకునేందుకు బారులు తీరుతున్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8.15లక్షల దరఖాస్తులు రాగా, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మి రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇల్లు, యువ వికాసం, చేయూత, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను దశల వారీగా అమలు చేస్తామని చెబుతోంది. అయితే ప్రధానంగా రేషన్‌కార్డు లేని వారు తమ పేర్లు ఆయా పథకాల జాబితాలో ఉంటాయో? లేదా అని చర్చించుకుంటున్నారు. అయితే 'కొత్త రేషన్ కార్డులు ఇచ్చాకే లబ్దిదారుల ఎంపిక జరిగే అవకాశం ఉంది' అని రెవెన్యూ అధికారులు చెబుతుండటం కొసమెరుపు.

కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై కసరత్తు తొలి రోజుల్లోనే ప్రారంభించింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేసిన సర్కారు.. మిగిలిన ఐదు గ్యారంటీల అమలు కోసం ప్రజలు నుంచి ప్రజాపాలన సభల ద్వారా తీసుకున్న దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఆయా స్కీములకు లబ్దిదారుల ఎంపిక విషయంలో తెల్లరేషన్‌కార్డుయే ప్రామాణికంగా కనిపిస్తుండగా.. అర్హత ఉండీ కార్డు లేని కుటుంబాల్లో ఆందోళన మొదలైంది. రూ.2500 మహాలక్ష్మి, 200యూనిట్లలోపు వినియోగించే వారికి ఫ్రీ కరెంటు, రైతుభరోసా కింద రైతులు, కౌలుదారులు, రూ.500వంటగ్యాస్, గృహలక్ష్మి వంటి స్కీముల కోసం లక్షల్లో అర్జీలు ఇచ్చిన వారిలో గ్యారెంటీ.. మాటేంటి? అనే చర్చ సాగుతోంది.

మహిళా రైతుల చిత్రకళ



మమతా చిట్నీస్ సేన్... ఈమె ఓ జర్నలిస్ట్. అంతే కాదు అద్భుతమైన పెయింటర్ కూడా. మహిళా విముక్తి, కళ, సంస్కృతి పట్ల మక్కువ ఉన్న ఆమె తనకు తెలిసిన కళను కేవలం తనకే పరిమితం చేసుకోలేదు. గ్రామీణ మహిళలకు ఆర్ట్ స్పేస్‌లను సృష్టించడం ద్వారా వారికి సాధికారత కల్పిస్తోంది. దీని కోసం రెడ్ హౌస్ ఆర్ట్ ఎక్స్ఛేంజ్ అనే ఆర్ట్ స్టూడియోను నిర్మించిన ఆమె కృషి గురించి నేటి మానవిలో తెలుసుకుందాం...



మహారాష్ట్రలోని రోనాపాల్ అనే గ్రామంలోని మహిళా రైతులు భగభగా మండి పోతున్న ఎండలో, బురద నీటిలో చీలమండలం వరకు తడిసిన పాదాలతో వరి పొలాల నుండి బయటికి వస్తున్నారు. ఎండ వేడికి వారి బుగ్గల నుండి చెమట కారిపోతోంది. సూర్య ప్రతాపాన్ని భరించలేక తమ అరచేతులను ఆకాశానికి అడ్డు పెట్టి ముఖాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఈ మహిళలంతా పగలంతా పొలంలో కష్టపడి పని చేసిన తర్వాత ఇంటికి వెళ్లడం లేదు. తమ హృదయాలను ఖాళీ కాన్వాస్‌లపై చిత్రించుకోవడానికి ఆర్ట్ స్టూడియో వైపు నడుస్తున్నారు. ఎందుకంటే ఈ మహిళలంతా ది రెడ్ హౌస్ ఆర్ట్ ఎక్స్ఛేంజ్‌లో భాగంగా ఉన్నారు. ఇది రోనాపాల్ గ్రామంలోని వరి పొలాలతో చుట్టుముట్టబడిన ఉన్న ఓ కళా స్థలం. తమకు తెలిసిన కళ ద్వారా కొంకణ్ ప్రాంతంలోని మహిళా రైతులంతా శక్తివంతంగా తయారవుతున్నారు. జీవితం, ప్రేమ, అభిరుచి, కోరిక, చర్య, శక్తి, విశ్వాసాన్ని సూచించే కొంకణ్ ప్రాంతంలోని ఎర్రటి నేల నుండి ఈ కళ పుట్టుకొచ్చింది. మమతా 2020లో ఈ కేంద్రాన్ని స్థాపించారు.

ఎలా మొదలయిందంటే..?

ముంబైలోని సర్ జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన మమతకు 2012లో తన పూర్వీకుల నుండి వారసత్వంగా కొంత భూమి వచ్చింది. కానీ ఆమె దూరపు బంధువులు ఎదురు తిరగడంతో ఆ భూమి వివాదంలో ఇరుక్కుంది. తన భూమిని తాను దక్కించుకోడానికి మూడేండ్ల పాటు న్యాయపోరాటం చేశారు. దాని కోసం ప్రతి నెలా గ్రామ న్యాయస్థానం వద్దకు వెళ్ళేవారు. అప్పుడే వరి పొలాల పక్కనే ఉండే ఒక చిన్న గదిని చూశారు. అక్కడ తమ భూమి కోసం పోరాడుతున్న చాలా మంది స్త్రీలను కలుసుకున్నారు. ఈ సందర్భనే ఆమెలో కొంకణ్ మహిళా రైతులపై పెయింటింగ్ సిరీస్ ఆలోచనను పుట్టించింది. తర్వాత ఈ కళను ప్రపంచవ్యాప్తంగా వివిధ గ్యాలరీలలో ప్రదర్శించడం మొదలుపెట్టారు.

ప్రయాణం అంత సులభం కాలేదు

2021లో టొక్టే తుఫాను ఈ ప్రాంతాన్ని తాకింది. ఎడతెగని వారం రోజుల వర్షపాతం వల్ల ఎనిమిది రోజుల పాటు విద్యుత్తు అంతరాయం ఏర్పడింది. ఫలితంగా కూలీల కొరత ఏర్పడింది. అప్పటికే నిర్మించినవి పాక్షికంగా దెబ్బతిన్నాయి. దాంతో భవన నిర్మాణ ఖర్చులు పెరిగాయి. కానీ ఆమె లక్ష్యం, సాధించగలను అనే నమ్మకం మమతను నిలబెట్టాయి. చివరకు 2021లో స్వాతంత్ర్య దినోత్సవం నాడు మహిళా రైతులతో వారి స్వేచ్ఛా ఆలోచనలపై మొదటి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. తర్వాత వాటిని ఆర్ట్ స్పేస్‌లో ఆర్ట్ ఎగ్జిబిషన్‌గా ప్రదర్శించారు.

అవగాహన కల్పించేందుకు

'వీరిలో చాలా మంది మహిళలు పెయింట్ బ్రష్‌ను ఎన్నడూ పట్టుకోలేదు. అలాంటి వారు అందమైన కళాఖండాలను సృష్టించారు. ఇది నన్ను ఆశ్చర్యపరిచింది' అని మమత చెప్పారు. ప్రాజెక్ట్ వైల్డ్‌ఫ్లవర్ అనే రెండవ వర్క్‌షాప్ న్యూయార్క్‌కు చెందిన కళాకారిణి సోరయా మార్కానో సహకారంతో జరిగింది. ఇందులో మహిళా రైతుల పిల్లలకు అడవుల్లో దొరికే వైల్డ్ ఫ్లవర్స్‌కు రంగులు వేసే పని అప్పగించారు. నెమ్మదిగా ఈ కార్యక్రమం ప్రభుత్వ అధికారులు, చుట్టు పక్కల గ్రామ పెద్దల దృష్టిని ఆకర్షించింది. ఆర్ట్ స్పేస్ గురించి మహిళల్లో మరింత అవగాహన కల్పించడానికి ఆమె ఒక వంటల పోటీని ఏర్పాటు చేశారు. స్థానిక మాల్వానీ వంటకాలను వండమని పోటీ పెట్టారు. వీటికి జడ్జీలుగా ఉండమని అధికారులను కోరారు. జనవరి 2023లో ఆమె తన భర్తతో ఫోటో, ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. దీనికి పెద్ద పెద్ద వారు హాజరయ్యారు. దాంతో మంచి గుర్తింపు వచ్చింది.

ఆలోచనలు మారుతున్నాయి

ఆర్ట్ స్పేస్‌ను ఏర్పాటు చేసిన తర్వాత కూడా ఆమెకు సవాళ్లు ఆగలేదు. మహిళలంతా దినసరి కూలీలు కావడంతో కళాకేంద్రాన్ని సందర్శించేందుకు సిద్ధపడలేదు. అయినప్పటికీ తన నిరంతర ప్రయత్నం, గ్రామ పెద్దల సహాయంతో ఖాళీ సమయంలో వారు కళా స్థలాన్ని సందర్శించేలా ఒప్పించారు. వారికి ఎప్పుడూ అందుబాటులో ఉండాలని మధ్యాహ్నాలు కూడా ఆర్ట్ స్పేస్‌ను తెరిచి ఉంచేవారు. చాలా మంది సోమవారాల్లో ఖాళీగా ఉన్నందున వాటిని సందర్శించేవారు. గ్రామాల్లో కళకు ఎంత ప్రాధాన్యం ఇస్తారో తెలియక మమత మొదట్లో తన ప్రాజెక్ట్ విజయవంతం కాదేమోనని సందేహం వ్యక్తం చేశారు. ఆర్ట్ వర్క్‌షాప్ ఆలోచన మొదట్లో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. మొదటి వర్క్‌షాప్ తర్వాత మహిళల ఆలోచనలో మార్పు వచ్చింది. 'వారందరూ ఒక గంట రావడానికి అంగీకరించారు. వచ్చిన తర్వాత వారు కళను చాలా ఇష్టపడ్డారు. గంట ఉంటామని వచ్చిన వారు సాయంత్రం వరకు ఉన్నారు' అని గుర్తుచేసుకున్నారు. మొదటి వర్క్‌షాప్‌ను పెట్టి చుట్టుపక్కల గ్రామాల నుండి మహిళలు ఆర్ట్ స్పేస్‌లో భాగం కావాలని కోరారు. మమత మొదట్లో రెండు గ్రామాలకు చెందిన మహిళలతో దీన్ని ప్రారంభించారు. ఇప్పుడు పది గ్రామాలకు పైగా పెరిగింది.

ముందున్న మార్గం

ఆర్ట్ స్పేస్‌లో షాప్‌ను ఏర్పాటు చేసి మహిళా రైతులు తమ కళ ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడం ఆమె లక్ష్యం. భవిష్యత్‌లో తాను నిర్వహించే ఆర్ట్ వర్క్‌షాప్‌తో అణగారిన వర్గాల కోసం స్థలాన్ని తెరవాలని ఆమె లక్ష్యంగా పెట్టుకున్నారు. అక్టోబర్ 2023లో యూకేలోని బ్రిస్టల్‌లో ఈ మహిళలు రూపొందించిన పెయింటింగ్‌లను కూడా ప్రదర్శించబోతున్నారు. ఈ అట్టడుగు మహిళలకు అందుబాటులో ఉండేలా విజువల్ ఆర్ట్, డిజిటల్ ఆర్ట్, ఫోటోగ్రఫీ వంటి విభిన్న రకాల సమకాలీన కళలను రూపొందించాలని కూడా ఆమె భావిస్తున్నారు. 'ఈ మహిళల కోసం ప్రపంచంలో చాలా మార్పులు రావాలి. వారికి సాధికారత కల్పించడానికి, వృద్ధి అవకాశాలను అందించడానికి ఈ ఆర్ట్ స్పేస్ చిన్న ప్రయత్నం చేస్తుంది' అంటూ ఆమె ముగించారు.



ఎదురైన సవాళ్లు

'నేను టైఫాయిడ్‌తో బాధ పడుతున్నాను. దానికి తోడు మధుమేహం కూడా ఉన్నందున తిరిగి కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. కరోనా సమయంలో నేను 10 రోజులు మంచాన పడ్డాను. నా ఆరోగ్యం క్షీణించడం ప్రారంభించింది. నేను ఇక బతుకుతానో లేదో కచ్చితంగా తెలియదు' అంటూ ఆమె ఆ రోజులను గుర్తు చేసుకున్నారు. జీవితం, మరణం మధ్య వేలాడుతూ కూడా ఆమె మిగతా వాటి గురించి ఆలోచించారు. 'నా చివరి కోరికగా ఈ భూమిని ఆర్ట్ గ్యాలరీ కోసం ఉపయోగించాలని మా అమ్మను కోరాను' అని ఆమె గుర్తు చేసుకున్నారు. అనారోగ్యం నుండి కోలుకున్న తర్వాత మమత సెప్టెంబర్ 2020లో తాను దాచుకున్న డబ్బుతో పాటు, మరికొంత రుణం తీసుకుని పెట్టుబడిగా పెట్టి 10,000 చదరపు అడుగుల స్థలంలో 500 చదరపు అడుగుల భవనాన్ని నిర్మించారు. ఫొటో గ్రాఫరైన ఆమె భర్త సంజిత్ సేన్ రూపొందించిన ఆర్ట్ స్పేస్ ఇప్పుడు 4,000 చదరపు అడుగులకు విస్తరించింది. అందులో రెండు అంతర్గత ఆర్ట్ గ్యాలరీలు కూడా ఉన్నాయి.



మహిళా రైతులకు సాధికారత

'కళ ఎల్లప్పుడూ నా జీవితంలో అంతర్భాగంగా ఉంది. కనుక నా ఈ కళా అభిరుచి ద్వారా అట్టడుగున ఉన్న మహిళా రైతులకు సాధికారత కల్పించాలని నిర్ణయించుకున్నాను' అని ఆమె పంచుకున్నారు. 2015లో మమత తన భూమి వివాద కేసులో విజయం సాధించారు. తన కళా కేంద్రాన్ని ప్రారంభించడానికి ఆ భూమినే ఉపయోగించాలని నిర్ణయించుకున్నారు. అయితే ఆమె తల్లి దీనికి ఒప్పుకోలేదు. మమత కరోనా బారిన పడి తీవ్ర అనారోగ్యంతో చివరి దశలో ఉన్నంత వరకు తల్లి ఆమెను వ్యతిరేకిస్తూనే ఉంది.



పూర్తయిన ప్రాణ ప్రతిష్ట

(మొదటిపేజీ తరువాయి)

కోశాధికారి, ట్రస్టీ గోవింద దేవ్ గిరీజీ మహరాజ్ ప్రధానిని పొగడ్తలతో ముంచెత్తారు. ఛత్రపతి శివాజీ వంటి మరో మహారాజును మోడీ గుర్తుకు తెచ్చారని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమం కోసం మోడీ ఉపవాస దీక్ష చేశారని, నేలపై నిద్రించారని అంటూ ఈ ఆచారాలను మోడీ తన తల్లి నుండి అలవరచుకున్నారని, 40 సంవత్సరాలుగా వీటిని ఆచరిస్తున్నారని చెప్పుకొచ్చారు. దేశంలో నేడు నెలకొన్న రాజకీయ వాతావరణాన్ని కూడా ప్రస్తావించారు. అయితే దానిపై వివరణ ఇవ్వలేదు.

మోడీ విజయం వల్లనే కల సాకారమైంది : యోగి ఆదిత్యనాథ్

మనం తిరిగి త్రేతాయుగంలో ప్రవేశించినట్లు అన్పిస్తోందని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. దేశంలోని మెజారిటీ ప్రజలు సుదీర్ఘ కాలం కృషి చేసి ఈ దేవాలయాన్ని పొందగలిగారని చెప్పారు. రామ మందిరానికి వాస్తవ రూపం అందించేందుకు కులాలు, వర్గాలకు అతీతంగా హిందువులు చేసిన త్యాగాలను ఆయన ప్రస్తావించారు. 2014 ఎన్నికల్లో మోడీ విజయం సాధించడం వల్లనే హిందువులు తమ కలను సాకారం చేసుకోగలిగారని అన్నారు. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ కూడా మోడీని ఆకాశానికి ఎత్తేశారు. మోడీ ఓ సన్యాసి అని, అది తనకు తెలుసునని చెప్పారు.

రాహుల్ గాంధీపై దాడి గర్హనీయం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత్ న్యాయ్ యాత్రలో భాగంగా అస్సాంలో పర్యటిస్తున్న రాహుల్ గాంధీపై స్థానిక బీజేపీ నేతల దాడి గర్హనీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాహుల్ యాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం, గుడి సందర్శనకు అనుమతి ఇవ్వకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి ధోరణి మంచిది కాదని తెలిపారు రాహుల్ భద్రత విషయంలో సైతం అక్కడ రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవరించిందని విమర్శించారు. ఇలాంటి చర్యలతో ఆయన మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయాలన్న కుట్రలు ఫలించవని హితవు చెప్పారు. రాహుల్ యాత్రకు లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు అండగా ఉన్నారని అన్నారు. తెలంగాణ సమాజం రాహుల్ గాంధీకి అండగా ఉందని తెలిపారు.

ఏపీలో అంగన్‌వాడీలను తొలగించడం దుర్మార్గం

- ఇది జగన్ ప్రభుత్వానికే నష్టం
- సమ్మె డిమాండ్లను పరిష్కరించాలి..తొలగింపును ఆపాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అంగన్‌వాడీ కార్మికులను విధుల్లోంచి తొలగించడం దుర్మార్గమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరించిన ఏపీ ప్రభుత్వ తీరును ఖండించారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై నిర్బంధాలు విధించడాన్నీ, అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. నెలన్నర నుంచి సమ్మె చేస్తున్నా అక్కడి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లనే అంగన్‌వాడీలు చలో విజయవాడకు పిలుపునిచ్చారని తెలిపారు. వారు గొంతెమ్మ కోరికలేం కోరటం లేదనీ, తమ హక్కులను నెరవేర్చాలని కోరటంలో న్యాయం ఉందని పేర్కొన్నారు. అంగన్‌వాడీల పట్ల కర్కశంగా వ్యవహరించడం జగన్ ప్రభుత్వానికే నష్టదాయకమని హెచ్చరించారు. అంగన్‌వాడీలతో మొండి వ్యవహరించిన తమిళనాడులోని జయలలిత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వాలు కుప్పకూలిపోయిన విషయాన్ని ప్రస్తావించారు. ఇప్పటికైనా అంగన్‌వాడీల విషయంలో జగన్ వెనక్కి తగ్గి వారికి న్యాయం చేయాలని సూచించారు. అదేవిధంగా, అంగన్‌వాడీల చలో విజయవాడ కార్యక్రమాన్ని కవరేజీ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపైనా పోలీసులు వ్యవహరించిన తీరును ఖండించారు.

గణతంత్ర వేడుకల్లో తెలంగాణ శకటం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు 'స్వీయ పాలన, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమ స్ఫూర్తి' ఇతివృత్తంతో తెలంగాణ శకటం సిద్ధం అయింది. 75వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో జనవరి 26న కర్తవ్య పథ్‌లో వికసిత్ భారత్ థీమ్‌లో భాగంగా తెలంగాణ శకటాన్ని ప్రదర్శించనున్నారు. నిరంకుశ విధానాలు, రాజరిక, ఫ్యూడల్ వ్యవస్థలకు వ్యతిరేకంగా తెలంగాణలో జరిగిన ఎన్నో ప్రజా ఉద్యమాలను గుర్తు చేస్తూ రూపొందించిన శకటం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్నది.

దాదాపు మూడేండ్ల అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో గణతంత్ర వేడుకల్లో తెలంగాణ శకటం ప్రదర్శనకు చోటు దక్కింది. 2015, 2020 సంవత్సరాల అనంతరం ఈ సంవత్సరమే తెలంగాణ శకటానికి అవకాశం దక్కింది. ఈ సంవత్సరంతో పాటు వచ్చే మరో రెండేండ్ల పాటు కూడా తెలంగాణా శకటం ప్రదర్శనకు అనుమతి లభించింది. నిరంకుశ విధానాలు, రాజరిక, ఫ్యూడల్ వ్యవస్థలకు వ్యతిరేకంగా తెలంగాణలో ఎన్నో ప్రజా ఉద్యమాలు వచ్చాయి. దీనిలో భాగంగా కొమరం భీం, రాంజీ గోండు, చాకలి ఐలమ్మ తదితర పోరాట యోధులు ఎందరో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా స్వయం పాలన, ప్రజాస్వామ్య పరిరక్షణకై తమ తమ పంథాలో పోరాటాన్ని చేశారు.

ఈ స్వీయ పాలన, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమ స్ఫూర్తిని మరోసారి ప్రపంచానికి తెలియచేసే విధంగా రిపబ్లిక్ దినోత్సవ వేడుకలో ప్రదర్శనకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాతో శకటాన్ని రూపొందించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తోడ్పాటుతో అతి స్వల్ప సమయంలో ఈ శకటం ఏర్పాటైంది.

కొమురంభీం, రాంజీ గోండ్, చిట్యాల ఐలమ్మల వీరోచితమైన పోరాటాలు ఈ ప్రాంత సామాన్య ప్రజల జీవితాలపై అత్యంత ప్రభావాన్ని చూపాయి. వీరి పోరాటాలు జానపద కళలు, సాహిత్యంలోనూ ప్రతిబింబించాయి. 20వ శతాబ్దం ప్రారంభంలో ఈ విప్లవకారులు స్వయం పాలన, ప్రజల ప్రజాస్వామ్య (లోక్ తంత్ర) పునరుద్ధరణ, మా భూమిలో మా రాజ్యం అంటూ చేసిన వీరోచిత పోరాటాలు ఇక్కడి పౌర సమాజానికి ఒక అద్భుతమైన ప్రజాస్వామ్య పోరాట వారసత్వాన్ని అందించాయి. ఆదివాసీ గిరిజనుల స్వేచ్ఛ, గౌరవం, హక్కుల కోసం కొమరంభీం, రాంజీ గోండ్‌లు పోరాటాలు చేశారు. వారి లక్ష్య సాధన కోసం తమదైన పద్ధతుల్లో గెరిల్లా యుద్ధ వ్యూహాలను అవలంబించారు. "జల్, జంగల్, జమీన్" (నీరు, అటవీ, భూమి) అనే నినాదాలతో పోరాటాలు చేశారు. రైతులు, రైతు కూలీలపై భూస్వాములు చేసిన దోపిడీకి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మగా పిలువబడే చిట్యాల ఐలమ్మ చేసిన పోరాటం అమోఘమైనది. అచంచల సంకల్పంతో, అట్టడుగు వర్గాల తోడ్పాటుతో భూస్వాములను ఎదుర్కొనడం ద్వారా సామాన్య గ్రామీణులలో అవసరమైన ధైర్యాన్ని కల్పించింది.

ఈ వీరోచిత పోరాట యోధుల త్యాగాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. ప్రస్తుత సమాజంలో అట్టడుగు వర్గాల హక్కుల పరిరక్షణకు, ప్రజాస్వామ్య విలువలు పెంపొందించేందుకు, అందరికి సమ న్యాయం అందేందుకు ఈ ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటాలు పునాదులు వేసాయి. సామాజిక, ఆర్థిక న్యాయం, గౌరవనీయమైన జీవనం, అవకాశాల కల్పన, వ్యక్తిగత గౌరవాలు పెంపొందించేలా చేశాయి. సమకాలీన కాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామసభలు, గ్రామ పంచాయితీల ఏర్పాటుకు దారితీసింది. గిరిజనులకు అధికారాలను అందించింది. "జల్, జంగల్ జమీన్" నినాదంతో అట్టడుగు వర్గాల భూములకు రక్షణ కల్పించడం జరిగింది. ఈ స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తిని, అట్టడుగు వర్గాల్లో ప్రజాస్వామ్య విలువలను కొనసాగించేలా తెలంగాణా ప్రభుత్వ నిబద్ధతకు ఈ శకటం ప్రత్యేకంగా నిలవనున్నది.

రెండు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయండి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని (నారీ శక్తి వందన్ చట్టం-2023) తక్షణమే అమలు చేయాలనీ, తద్వారా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మూడింట ఒక వంతు సీట్లు రిజర్వు అయ్యేలా చూడాలంటూ దాఖలైన పిటిషన్‌పై రెండు వారాల్లోగా స్పందించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. కాంగ్రెస్ నేత జయ ఠాకూర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. సమగ్ర సమాధానాన్ని దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి కొంత సమయం కావాలని ప్రభుత్వం తరుపు సీనియర్ న్యాయవాది కను అగర్వాల్ కోరడంతో, ధర్మాసనం కేంద్రానికి సమయమిచ్చింది. పిటిషనర్ జయ ఠాకూర్ తరపున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపిస్తూ సార్వత్రిక ఎన్నికలకు ముందు చట్టాన్ని అమలు చేసేలా కోర్టు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ దశలో ఆదేశాలు ఇవ్వలేమనీ, కేంద్రం సమాధానం కోసం వేచి చూడాలని జస్టిస్ ఖన్నా అన్నారు. అనంతరం విచారణను మూడువారాలకు వాయిదా వేశారు. 2023 సెప్టెంబర్ 21న లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మూడింట ఒక వంతు సీట్లను మహిళలకు రిజర్వ్ చేసే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. లోక్‌సభ దాదాపు ఏకాభిప్రాయంతో రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించగా, రాజ్యసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

మళ్లీ తెరపైకి వీఆర్వో, వీఆర్ఎ వ్యవస్థలు ?

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. ఇందుకు సంబంధించి సర్కార్ త్వరలో విధాన పరమైన నిర్ణయం తీసుకోనుంది. గ్రామాల్లో తిష్టవేసిన ఎన్నో సమస్యలు ఆరేండ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. భూ సమస్యల పరిష్కారాలు, ప్రకతి వైపరీత్యాలు, ధాన్యం కొనుగోళ్లు, సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, ఎన్నికల విధులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, కుల, ఇన్‌కం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు మొదలగు దాదాపు 20కి పైగా సమస్యలు, విఆర్వో బాధ్యతలకు సంబంధించినవే కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్నికల సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఎన్నో సమస్యలు వచ్చాయనీ, వాటన్నింటినీ దష్టిలో ఉంచుకొని రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణ జరిగి తీరాలని ఆయన చాలా పట్టుదలగా ఉన్నట్టు సమాచారం.

మార్పులు, చేర్పులపై కసరత్తు

గతంలో ఉన్న గ్రామ రెవెన్యూ ఆఫీసర్ (వీఆర్వో), విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (వీఆర్ఎ) పోస్టులను యథావిధిగా ప్రవేశపెడతారా? లేక రెండు రకాల పోస్టులను కలిపి ఒకే పోస్టుగా సర్దుబాటు చేసి విలేజ్ రెవెన్యూ సెక్రటరీ (వీఆర్ఎస్) అనే పోస్టును సృష్టించి నియామకాలు చేస్తారా? అనే అంశాలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ముఖ్యమంత్రి స్థాయిలో సమీక్ష తర్వాత విధానపరమైన తుది నిర్ణయం తీసుకోనున్నారు. ప్రభుత్వానికి, గ్రామాలకు మధ్య వారధిగా ఉన్న ఈ వ్యవస్థ లేక పోవడం వల్ల సర్కారుకు, ప్రజలకు మధ్య క్రమంగా దూరం పెరుగుతూ వస్తోంది. ఈనేపథ్యంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత రెవెన్యూ వ్యవస్థవైపు అడుగులు వేస్తోందని సమాచారం.

"భూమాత"గా ధరణి

గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ధరణి పోర్టల్ భూమాతగా మారనుంది. ఈ పోర్టల్‌లో ఉన్న లొసుగులను సరిదిద్దేందుకు సీసీఎల్ఏ కమిషనర్ కన్వీనర్‌గా పలువురు భూ నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ధరణి కమిటీని ఏర్పాటు చేసింది. మూడు దఫాలు సమావేశమైన ఈ కమిటీ ఇప్పటికే ఆ పోర్టల్‌లో ఉన్న అనేక లొసుగుల పరిష్కారంపై ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

ఈ క్రమంలో ఇందులో మార్పులు చేసి ధరణి స్థానంలో భూమాతను తీసుకురానున్నారు. పాత రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణతో పాటు దీనిని కూడా అందుబాటులోకి తేనున్నట్టు తెలుస్తోంది.

రాహుల్ యాత్రకు ఆటంకం

(మొదటిపేజీ తరువాయి)

ఆలపించారు. రెండు గంటల అనంతరం థాన్‌ను సందర్శించేందుకు కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్, బటద్రవ ఎమ్మెల్యే శిబామొని బోరాను మాత్రం పోలీసులు అనుమతించారు. దీనిపై ఏఐసీసీ నేత జైరాం రమేష్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ థాన్‌ను సందర్శించాలని రాహుల్ భావించారని, అయితే పోలీసులు ఇద్దరు అసోం నేతలను మాత్రమే అనుమతించారని ఆరోపించారు. అయోధ్య ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని వేలాది మంది ప్రజలు బటద్రవ థాన్‌కు వస్తారని, అందుకే రాహుల్‌ను అనుమతించలేమని, అయితే ఆయన సాయంత్రం మూడు గంటల తర్వాత ఈ ప్రాంతానికి రావచ్చని థాన్ యాజమాన్య కమిటీ అధ్యక్షుడు ఆదివారం స్థానిక ఎమ్మెల్యేకు లేఖ రాశారు. కాగా అయోధ్య కార్యక్రమం పూర్తయిన తర్వాత రాహుల్ థాన్ వెళ్లవచ్చని రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తెలిపారు. 'ఇది అయోధ్య - బటద్రవ థాన్ మధ్య పోటీగా మారడం అసోంకు మంచిది కాదు. కాబట్టి అయోధ్యలో మందిర కార్యక్రమం పూర్తయిన తర్వాత ఆయన బటద్రవ వెళితే మంచిది. ఆయన ఇక్కడికి వచ్చి పోటీ భావనను కలిగించడం మంచిది కాదు' అని అన్నారు. కాగా బటద్రవ నుండి గొగోయ్, బోరా తిరిగి వచ్చిన తర్వాత యాత్ర ప్రారంభమైంది.

నా ఒక్కడికే శాంతి భద్రతల సమస్యా ? : రాహుల్

యాత్ర తిరిగి ప్రారంభమైన తర్వాత రాహుల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. వైష్ణవ గురువు శంకరదేవ సిద్ధాంతాలను తాను విశ్వసిస్తానని ఆయన అన్నారు. ప్రజలను ఏకం చేయాలనే తాను కోరుకుంటాను తప్పించి విద్వేషాలను వ్యాపింపజేయబోనని చెప్పారు. 'ఆయన మాకు గురువు వంటి వారు. మాకు మార్గనిర్దేశం చేశారు. అస్సాం వచ్చినప్పుడు ఆయన జన్మస్థలాన్ని సందర్శించి ప్రార్థనలు చేయాలని అనుకున్నాను. శంకరదేవ జన్మస్థలానికి రావాల్సిందిగా ఈ నెల 11న నాకు ఆహ్వానం అందింది. అయితే శాంతి భద్రతల పరిస్థితి నెలకొన్నదని మాకు ఆదివారం సమాచారం ఇచ్చారు. ఈ ప్రాంతంలో ఆ సమస్య ఉండడం ఆశ్చర్యంగా ఉంది. గౌరవ్ గొగోయ్, ఇతరులు అక్కడికి వెళ్లవచ్చు. నేను మాత్రం వెళ్లకూడదు. అందుకు కొన్ని కారణాలు ఉండవచ్చు. నాకు తెలీదు. నాకు అవకాశం వచ్చినప్పుడు బటద్రవ వెళతాను. శంకరదేవ చూపిన మార్గాన్ని అస్సాంతో పాటు దేశమంతా అనుసరించాలని కోరుకుంటున్నాను' అని రాహుల్ తెలిపారు.

సోషల్ మీడియాలో రాజ్యాంగ పీఠిక షేర్

తిరువనంతపురం : అయోధ్యలో రామ మందిర ప్రారంభం రోజు మలయాళ నటులు, డైరెక్టర్లు వినూత్న చర్యకు దిగారు. తమ సోషల్ మీడియా ఖాతాల్లో రాజ్యాంగ పీఠిక ఫోటోలను షేర్ చేశారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు తన హిందూత్వ వాగ్దానాల్లో ఒకటైన అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని ఆవిష్కరిస్తున్న తరుణంలో భారత రాజ్యాంగ మూల స్వభావాన్ని గుర్తు చేసే ఉద్దేశంతో మలయాళ నటులు, డైరెక్టర్లు ఈ చర్యకు పూనుకున్నారు. సెక్యులర్, సోషలిస్ట్, డెమోక్రటిక్ విలువలు తెలిసేలా రాజ్యాంగ పీఠికను షేర్ చేయటం కనిపించింది. రాజ్యాంగ పీఠికను షేర్ చేసినవారిలో ప్రముఖ మలయాళ నటులు పార్వతి తిరువోతు, రిమా కల్లింగల్, దివ్య ప్రభ, కనీ కుస్రుతి, డైరెక్టర్లు జియో బేబి, ఆశిక్ అబూ, కమల్ కె.ఎం, గాయకులు సూరజ్ సంతోశ్‌లు ఉన్నారు. దేశ ప్రజలందరికి ప్రతినిధిగా ప్రధాని హోదాలో అయోధ్యలోని రామ మందిర ప్రారంభోత్సవంలో మోడీ పాల్గొనటంపై ఇప్పటికే సర్వత్రా విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. సెక్యులర్ భావనకు విరుద్ధంగా మోడీ వ్యవహరించారని రాజకీయ విశ్లేషకులు, రాజ్యాంగ నిపుణులు, మేధావులు ఆరోపిస్తున్నారు.

ఓట్లే లక్ష్యంగా..అయోధ్యకు బీజేపీ ప్రత్యేక రైళ్లు

(మొదటిపేజీ తరువాయి)

వెనుక ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

ఏ నియోజకవర్గం వారు ఎక్కడ నుంచి అంటే..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి : సికింద్రాబాద్, నిజామాబాద్, జహీరాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, మల్కాజ్‌గిరి, మెదక్ పార్లమెంట్ స్థానాల వాళ్లు. కాజీ పేట రైల్వే స్టేషన్ నుంచి : వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, నల్లగొండ, పెద్దపల్లి, కరీంనగర్, పెద్దపల్లి.



క్వార్టర్స్‌లో మెద్వదేవ్

- అల్కరాజ్, జ్వెరెవ్ సైతం
- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా) : ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రష్యా స్టార్ డానిల్ మెద్వదేవ్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల సింగిల్స్‌లో ప్రీ క్వార్టర్స్‌లో మూడో సీడ్ డానిల్ మెద్వదేవ్ నాలుగు సెట్ల సమరంలో విజయం సాధించాడు. పోర్చుగల్ ఆటగాడు నునోపై 6-3, 7-6(7-4), 5-7, 6-1తో మెద్వదేవ్ గెలుపొందాడు. 13 ఏస్‌లు, ఆరు బ్రేక్ పాయింట్లతో సత్తా చాటాడు. పాయింట్ల పరంగా 152-130తో పైచేయి సాధించాడు. రెండో సీడ్ స్పెయిన్ ఆటగాడు కార్లోస్ అల్కరాజ్ వరుస సెట్లలో నెగ్గాడు. 6-4, 6-4, 6-0తో మియోమిర్ (సెర్బియా)ను చిత్తు చేసి క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. అల్కరాజ్ ఐదు బ్రేక్ పాయింట్లు సాధించగా, సెర్బియా ఆటగాడు ఒక్క సర్వ్‌ను బ్రేక్ చేయలేకపోయాడు. జర్మనీ కుర్రాడు అలెగ్జాండర్ జ్వెరెవ్ 7-5, 3-6, 6-3, 4-6, 7-6(10-3)తో ఐదు సెట్ల పోరులో కామెరూన్ నోరీపై గట్టెక్కాడు. జ్వెరెవ్‌తో సమానంగా నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించిన కామెరూన్ నిర్ణయాత్మక ఐదో సెట్ సూపర్‌టైబ్రేకర్‌లో వెనుకంజ వేశాడు. హుబర్ట్ 7-6(8-6), 7-6(7-3), 6-4తో ఆర్థర్‌పై ఉత్కంఠ విజయం నమోదు చేశాడు. మహిళల సింగిల్స్‌లో జెంగ్, అనా కలినిస్కయ, లిండా నోస్కోవా, డయానలు వరుస సెట్ల విజయాలతో క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు. మెన్స్ డబుల్స్‌లో రోహన్ బోపన్న, ఎబ్డెన్ జోడీ 7-6(10-8), 7-6(7-4)తో మూడో రౌండ్లో విజయం సాధించింది.

సారథి సూర్యకుమార్

ఐసీసీ టీ20 టీమ్ ఆఫ్ ది ఇయర్



దుబాయ్ : భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఐసీసీ టీ20 జట్టుకు సారథిగా నిలిచాడు. యశస్వి జైస్వాల్, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింగ్ సైతం జట్టులో చోటు సాధించారు. 2023లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 11 మంది ఆటగాళ్లతో ఐసీసీ టీమ్ ఆఫ్ ది ఇయర్‌ను విడుదల చేసింది.

ఐసీసీ టీ20 జట్టు : యశస్వి జైస్వాల్, ఫిల్ సాల్ట్, నికోలస్ పూరన్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), మార్క్ చాప్‌మన్, సికందర్ రజా, రంజాని, మార్క్ ఎడైర్, రిచర్డ్, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింగ్.

టెస్టు క్రికెట్. ఐదు రోజుల పాటు ఆటగాళ్ల సత్తాకు పరీక్ష పెట్టే సిసలైన క్రికెట్ ఫార్మాట్. మేటి బ్యాటర్, మేటి బౌలర్ స్థాయిని అంచనా వేసేది టెస్టుల్లోనే. అత్యుత్తమ క్రికెట్ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ ఐదు రోజుల ఆటలో ఆధిపత్య పోరు అభిమానులకు సైతం పసందైన వినోదమే. ఆధునిక వైట్‌బాల్ క్రికెట్ జోరుతో టెస్టులకు కాస్త ఆదరణ తగ్గుతున్న మాట వాస్తవం.

సుదీర్ఘ విరామం తర్వాత హైదరాబాద్‌కు టెస్టు క్రికెట్ తిరిగి రావటంతో.. ఈ మ్యాచ్‌ను పండుగలా నిర్వహించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) రంగం సిద్ధం చేసింది. గురువారం నుంచి భారత్, ఇంగ్లాండ్ తొలి టెస్టు ఆరంభం కానుండగా.. క్రికెట్ అభిమానులకు అద్భుత అనుభూతి అందించేందుకు హెచ్‌సీఏ సిద్ధమైంది.



పండుగలా టెస్టు క్రికెట్!

- భారత్, ఇంగ్లాండ్ మ్యాచ్‌కు ఘనంగా ఏర్పాట్లు
- సరికొత్తగా ముస్తాబైన ఉప్పల్ స్టేడియం

గురువారం నుంచి తొలి టెస్టు పోరు

నవతెలంగాణ-హైదరాబాద్

విద్యార్థులు, జవాన్లకు ఉచితం

టెస్టు మ్యాచులకు స్టేడియం నిండటం గగనం. మన దగ్గర వన్డే, టీ20లకు ఉన్న ఆదరణ టెస్టులకు లేదు. ప్రతిష్టాత్మక ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా జరుగుతున్న టెస్టులో స్టాండ్స్‌లో అభిమానులు లేకపోతే ఆతిథ్య జట్టు అనుకూలత ఏముంటుంది?. అందుకే, హెచ్‌సీఏ సరికొత్త ఆలోచనతో ముందుకొచ్చింది. భారత జట్టు జోరు చూసేందుకు పాఠశాల విద్యార్థులు, సాయుధ దళాల కుటుంబ సభ్యులకు కల్పించింది. 25 వేల మంది స్కూల్ స్టూడెంట్స్‌కు ఉచితంగా ప్రవేశం కల్పించనుంది. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా సాయుధ దళాల కుటుంబాలకు స్టేడియంలో ప్రవేశం ఉచితం. స్కూల్ స్టూడెంట్స్, జవాన్ల కుటుంబాలకు ఉచిత భోజనం, తాగునీరు సౌకర్యం సైతం హెచ్‌సీఏ అందిస్తోంది.

స్టేడియం చూడతరమా..!

ఉప్పల్ స్టేడియంలో టీమ్ ఇండియాకు మంచి రికార్డు ఉంది. కానీ అభిమానులకు మాత్రం చేదు సంఘటనలే ఎక్కువ. పరిశుభ్రత అంశంలో హెచ్‌సీఏ గతంలో తీవ్ర నిర్లక్ష్యం వహించింది. టెస్టు మ్యాచ్‌కు భిన్నంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. స్టేడియం మొత్తం నూతన సీట్లను ఏర్పాటు చేశారు. ఆధునాతన సౌకర్యవంతమైన బకెట్ చైర్స్‌ను అమర్చారు. స్టేడియానికి నాలుగు వైపులా పైకప్పు వేశారు. గతంలో సౌత్, నార్త్ పెవిలియన్స్‌కు మాత్రమే పైకప్పు సదుపాయం ఉండేది. కొత్తగా ఈస్ట్, వెస్ట్ స్టాండ్స్‌కు సైతం పైకప్పు వచ్చింది. నాలుగువైపులా పైకప్పుతో స్టేడియం అందం చూడతరమా అన్నట్టు ఉంది. సాంకేతికత జోడించిన ఎల్‌ఈడీ ఫ్లడ్‌లైట్ల వెలుగులు, స్టాండ్స్‌లో ప్రేక్షకులు వీక్షించేందుకు భారీ ఎల్‌ఈడీ తెరలు అదనపు హంగులు. ఇక అంతిమంగా, మైదానం పచ్చికతో కమనీయంగా కనిపిస్తోంది. ప్రపంచ స్థాయి సదుపాయాలు, ప్రపంచ స్థాయి స్టేడియంలో టెస్టు మ్యాచ్ వీక్షించిన అనుభూతి అభిమానులకు దక్కటం లాంఛనమే.

ప్రచారంలో దూకుడు

డిజిటల్ యుగంలో ప్రచారానిదే ప్రధాన పాత్ర. టెస్టు మ్యాచ్‌కు ఘనంగా ఏర్పాట్లు చేసిన హెచ్‌సీఏ.. ఈ అస్త్రాన్ని సైతం వదల్లేదు. భారత్, ఇంగ్లాండ్ టెస్టు పోరుకు హైదరాబాద్‌లో భారీ హోర్డింగ్‌లు పెట్టారు. హైదరాబాద్ సంస్కృతి ప్రతిబింబించే నినాదం సైతం జోడించారు. హైదరాబాద్ అంటే.. 'చాయ్, బిర్యానీ, క్రికెట్' అంటూ ప్రచారం మరో స్థాయికి తీసుకెళ్లారు. స్టేడియంలో అభిమానులు సైతం క్రికెట్‌ను వీక్షిస్తూ.. బిర్యానీ, చాయ్ ఆస్వాదించేందుకు నాణ్యమైన వంటకాలు అందించే హోటళ్లతో హెచ్‌సీఏ ఒప్పందం సైతం చేసుకుంది. ఉప్పల్ స్టేడియం దారిలో ఏర్పాటు చేసిన ప్రచార చిత్రాలు క్రికెట్ అభిమానులతో పాటు సాధారణ ప్రజలను సైతం విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



> 'హెచ్‌సీఏ కొత్త కార్యవర్గం ఎన్నిక అనంతరం జరుగుతున్న తొలి మ్యాచ్ ఇది. టెస్టు మ్యాచ్‌ను పండుగలా జరపాలనే పట్టుదలతో ఘనంగా ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, సాయుధ దళాల కుటుంబ సభ్యులకు ఉచిత ప్రవేశంతో పాటు భోజన వసతి అందిస్తున్నాం. పండుగ వాతావరణంలో టెస్టు మ్యాచ్‌ను వీక్షించిన అనుభూతి అభిమానులకు అందించేందుకు కష్టపడుతున్నాం. హైదరాబాద్ అనగానే చాయ్, బిర్యానీతో పాటు క్రికెట్ సైతం గుర్తుకొచ్చే స్థాయిలో మ్యాచ్‌ను నిర్వహిస్తున్నాం'
>
> \- అర్శనపల్లి జగన్‌మోహన్ రావు, హెచ్‌సీఏ అధ్యక్షుడు

ఐదు రోజుల 'పిచ్'

ఇక చివరగా, టెస్టు మ్యాచ్ ఇటీవల కాలంలో 3 రోజుల్లోనే ముగుస్తుంది. గతంలో ఇంగ్లాండ్ ఇక్కడ పర్యటించినప్పుడూ ఇదే జరిగింది. ఇటీవల భారత జట్టు దక్షిణాఫ్రికాలో రెండు టెస్టులు ఆడితే.. రెండు రోజుల్లోనే ఫలితం వచ్చేసింది. ఉప్పల్ టెస్టుకు ఈ బెంగ అక్కర్లేదు!. ఐదు రోజుల ఆటతో పాటు కచ్చితంగా ఫలితం అందించే పిచ్ ఇక్కడ సిద్ధమవుతోంది. ఉప్పల్ పిచ్ బ్యాటర్లు, బౌలర్లకు సమాన అవకాశాలు కల్పించిన ఘనత సాధించింది. తాజా టెస్టు మ్యాచ్‌కు సైతం అటువంటి పిచ్‌నే ఆశించవచ్చు. ఇక హైదరాబాద్‌లో టీమ్ ఇండియాకు టెస్టుల్లో ఓటమే ఎదురు కాలేదు. 2010లో కివీస్ టెస్టును డ్రా చేసుకున్న భారత్..2012లో న్యూజిలాండ్‌ను ఓడించింది. 2013లో ఆసీస్, 2017లో బంగ్లాదేశ్, 2018లో వెస్టిండీస్‌ను ఇచత్తు చేసింది. ఇక్కడ ఐదు టెస్టులు ఆడగా.. నాలుగింట విజయాలు సాధించింది. ఓ మ్యాచ్ డ్రాగా ముగిసింది.

ఉప్పల్, విశాఖ టెస్టులకు కోహ్లి దూరం


వ్యక్తిగత కారణాలతో జట్టును వీడిన విరాట్



ముంబయి : ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సవాల్‌కు సిద్ధమవుతుండగా.. ఆతిథ్య భారత్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. భారత స్టార్ బ్యాటర్, టెస్టు జట్టులో కీలక ఆటగాడు విరాట్ కోహ్లి తొలి రెండు మ్యాచుల నుంచి తప్పుకున్నాడు. వ్యక్తిగత కారణాలతో ఉప్పల్, విశాఖ టెస్టులకు అందుబాటులో ఉండలేనని బీసీసీఐకి సమాచారం అందించాడు. తొలి టెస్టు కోసం ఆదివారమే హైదరాబాద్‌కు చేరుకున్న విరాట్ కోహ్లి సోమవారం జరిగిన ఆప్షనల్ ప్రాక్టీస్ సెషన్‌కు హాజరు కాలేదు. కోహ్లి స్థానంలో ప్రత్యామ్నాయ ఆటగాడిని ఎంపిక చేస్తామని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. 'కెప్టెన్ రోహిత్ శర్మ, జట్టు మేనేజ్‌మెంట్, సెలక్టర్లతో విరాట్ కోహ్లి మాట్లాడారు. జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించటమే తన అత్యంత ప్రాధాన్య అంశమని.. కానీ కొన్ని వ్యక్తిగత పరిస్థితులు కుటుంబంతో ఉండాల్సిన స్థితిని కలిగించాయని' కోహ్లి మాటలను బీసీసీఐ తన ప్రకటనలో పేర్కొంది. విరాట్ కోహ్లి స్థానం కోసం చతేశ్వర్ పుజార, రజత్ పటీదార్, అభిమన్యు ఈశ్వరన్, సర్ఫరాజ్ ఖాన్ సహా తెలుగు తేజం తిలక్ వర్మ పోటీపడుతున్నారు. జట్టులో మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ కొనసాగుతున్నారు. వికెట్ కీపర్‌గా కె.ఎస్ భరత్, ధ్రువ్ జురెల్‌లలో ఒకరికి అవకాశం కల్పిస్తే.. కెఎల్ రాహుల్ మిడిల్ ఆర్డర్‌లో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా చోటు సాధించే అవకాశం ఉంది. భారత్, ఇంగ్లాండ్ ఐదు మ్యాచుల టెస్టు సిరీస్ జనవరి 25న హైదరాబాద్ టెస్టుతో ఆరంభం కానుంది. 2025 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో నిలువగా.. టీమ్ ఇండియా రెండో స్థానంలో కొనసాగుతుంది.

ప్రాక్టీస్ మొదలైంది

సాధనలో చెమటోడ్చిన రోహిత్, శ్రేయస్



నవతెలంగాణ-హైదరాబాద్ : ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టులకు టీమ్ ఇండియా కఠోరంగా సన్నద్ధమవుతోంది. ఆదివారం హైదరాబాద్‌కు చేరుకున్న టీమ్ ఇండియా.. ఉప్పల్ స్టేడియంలో సోమవారం ప్రాక్టీస్ సెషన్లో చెమటోడ్చింది. ఉదయం 9.30 గంటలకు భారీ బందోబస్తు నడుమ స్టేడియంకు చేరుకున్న రోహిత్‌సేన.. మూడు గంటల పాటు సాధన చేసింది. ప్రాక్టీస్ సెషన్‌కు ముందు 20 నిమిషాలు రోహిత్, ద్రవిడ్ చర్చించుకున్నారు. అనంతరం కోచ్ ద్రవిడ్ పిచ్‌ను పరిశీలించారు. విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా మినహా అందరూ ప్రాక్టీస్ సెషన్‌కు హాజరయ్యారు. యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్, రోహిత్ శర్మలు పూర్తి స్థాయిలో నెట్స్‌లో బ్యాటింగ్ సాధన చేశారు. భారత బౌలర్లు నెట్స్‌లో ప్రణాళిక బద్ధంగా బౌలింగ్ చేశారు. బుమ్రా, సిరాజ్, ముకేశ్, అవేశ్ సహా కుల్దీప్ యాదవ్ నెట్స్‌లో టాప్ ఆర్డర్ బ్యాటర్లకు బంతులు సంధించారు. తొలిసారి టెస్టు జట్టులోకి వచ్చిన ధ్రువ్ జురెల్.. బ్యాటింగ్‌తో పాటు వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ సైతం చేశాడు. మధ్యాహ్నం సెషన్లో ఇంగ్లాండ్ ఆటగాళ్లు సాధన చేశారు.

నవచిత్రం

మాట విలువ, గౌరవాన్ని తెలిపే సినిమా



సోహెల్, మేఘ లేఖ

సోహెల్ టైటిల్ రోల్‌లో శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్, కథ వేరుంటాది బ్యానర్స్ పై ఎం.డీ పాషా నిర్మిస్తున్న చిత్రం 'బూట్ కట్ బాలరాజు'. మేఘ లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఫిబ్రవరి 2న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ చిత్ర ట్రైలర్‌ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు. హీరో సోహెల్ మాట్లాడుతూ, 'మా బిగ్ బాస్ ఫ్యామిలీ అందరికీ ధన్యవాదాలు. విజయ్ లాంటి వారు వచ్చి సపోర్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. నేను బిగ్ బాస్ నుంచి బయటికి రాగానే నాతో సినిమా చేస్తానని పాషా భాయ్ చెప్పారు. ఆయన సాధారణమైన వ్యక్తే. చాలా ప్యాషన్‌తో సినిమాని పూర్తి చేశాం. ఈ సినిమా గురించి హీరో వెంకటేష్‌కి మెసేజ్ చేశాను. ఆల్ ది బెస్ట్ చెబుతూ వాయిస్ మెసేజ్ పెట్టారు. అంత పెద్ద హీరో నాకు రిప్లయ్ ఇవ్వడం చాలా నమ్మకాన్ని, ధైర్యాన్ని ఇచ్చింది. భీమ్స్ అద్భుతమైన పాటలు ఇచ్చారు' అని తెలిపారు.

సోహెల్‌లో మంచి తపన ఉంది. తను తప్పకుండా విజయం సాధిస్తాడు. తప్పకుండా నిలబడతాడు. మంచి కథని పట్టుకోవడంలో గోపి దిట్ట. తను చేసిన ప్రతి సినిమా విజయం సాధించింది' అని హీరో శివాజీ అన్నారు. నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ,'కంటెంట్ ఉన్న ప్రతి సినిమా హిట్ అవుతుంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరికీ పైసా వసూల్ వస్తుంది. అందరినీ బాగా ఎంటర్ టైన్ చేస్తుంది' అని చెప్పారు.

'ఇదొక మంచి వినోదాత్మక చిత్రం. మాటకి ఉన్న విలువ, గౌరవాన్ని గురించి ఈ చిత్రంలో చెబుతున్నాం. తప్పకుండా అందరూ థియేటర్స్‌కి వచ్చి చూడాలి' అని దర్శకుడు శ్రీ కోనేటి తెలిపారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలె మాట్లాడుతూ, 'కష్టపడి ఒకొక్క మెట్టు ఎదుగుతూ ఈ స్థాయికి వచ్చిన సోహెల్ కోసం ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి. దర్శకుడు దగ్గర ఉండి మరీ ఇందులో పాటలు చేయించారు' అని అన్నారు. 'నాకు ట్రైలర్ బాగా నచ్చింది. పాటలు ఇంకా బాగా నచ్చాయి. ఈ సినిమా ఖచ్చితంగా విజయం సాధిస్తుంది' అని హీరో శివబాలాజీ చెప్పారు. మరో హీరో బాలాదిత్య మాట్లాడుతూ, 'శంకరాభరణం, నేను నటించిన లిటిల్ సోల్జర్స్ ఈ రెండూ ఫిబ్రవరి 2న విడుదలై విశేష ఆదరణ పొందాయి. అదే డేట్‌కి వస్తున్న ఈసినిమా కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుంది' అని తెలిపారు.


హను-మాన్ విజువల్ ఎఫెక్ట్స్‌కి విశేష స్పందన



ఉదయ్ కృష్ణ

'విశేష ప్రేక్షకాదరణతో అఖండ విజయం సాధించిన 'హను-మాన్' చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడిగా పని చేసే అవకాశం రావడం నా పూర్వ జన్మ సుకృతం' అని ఉదయ్ కృష్ణ అన్నారు. విజువల్ ఎఫెక్ట్స్ రంగంలో రెండున్నర దశాబ్దాల సుదీర్ఘ అనుబంధం కలిగి, ఈ క్రాఫ్ట్‌లో గ్రాఫిక్స్ మాంత్రికుడుగా పేరొందిన ఉదయ్ కృష్ణ 'హను-మాన్' చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్ అందించారు. తేజ సజ్జా టైటిల్ పాత్రలో ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ పతాకంపై కె.నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ఈనెల 12న విడుదలై విజయ దుందుభి మోగిస్తోంది. ప్రశాంత్ వర్మ స్వయంగా సమకూర్చిన కథ - కథనాలకు ఉదయ్ కృష్ణ సారథ్యంలో అద్దిన గ్రాఫిక్స్ జత కలవడంతో ఈ చిత్రం అత్యద్భుతంగా తెరకెక్కింది. ఈ సినిమాకి వస్తున్న అద్భుత స్పందనకు ఆనందం వ్యక్తం చేస్తూ ఈ చిత్రానికి పని చేసిన తీరుని, దర్శకుడు ప్రతిభ గురించి ఉదయ్‌కృష్ణ మాట్లాడుతూ, 'భారతీయ చలనచిత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే 'హనుమాన్' చిత్రానికి పని చేసే అవకాశం ఇచ్చిన ప్రశాంత్ వర్మకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. విజువల్ ఎఫెక్ట్స్ అద్భుతంగా వినియోగించుకోవడంలో విజనరీగా పేరొందిన ఎస్.ఎస్.రాజమౌళి సరసన సగర్వంగా నిలిచేంత దార్శనికత ప్రశాంత్ వర్మలోనూ పుష్కలంగా ఉంది. రెండేళ్లుగా నా జీవితంలో అంతర్భాగంగా మారిపోయిన ఈ సినిమా సాధిస్తున్న సంచలన విజయం మేం పడిన కష్టమంతా మరిచిపోయేలా చేసింది. పతాక సన్నివేశాల్లో భూమ్యాకాశాలకు విస్తరించే హనుమాన్‌కు జీవం పోయడం ఈ చిత్రం కోసం నేను ఫేస్ చేసిన అతి పెద్ద ఛాలెంజెస్‌లో ముఖ్యమైంది. దర్శకులు కలలు గనే ఎంత గొప్ప విజువల్ అయినా సునాయాసంగా సాకారం చేయగలనని ఈ సినిమా నిరూపించింది. 'బీస్ట్ బెల్స్' పేరుతో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన విజువల్ ఎఫెక్ట్స్ సంస్థను హైదరాబాద్‌లో నెలకొల్పబోతున్నాను' అని అన్నారు.

రామం.. రాఘవం



సముద్ర ఖని, ధనరాజ్

స్లేట్ పెన్సిల్ స్టోరీస్ బ్యానర్ పై ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో పృథ్వి పొలవరపు నిర్మాణంలో ప్రొడక్షన్ నెం.1గా తెరకెక్కుతున్న ద్విభాషా చిత్రానికి 'రామం రాఘవం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. సోమవారం అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ను ఇరవై రెండు మంది సినీ ప్రముఖుల చేతుల మీదుగా విడుదల చేశారు. అలాగే ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలని ఆకాంక్షిస్తూ ట్వీట్‌లో అభినందనలు తెలిపారు. నటుడు ధనరాజ్ మొదటిసారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సముద్రఖని ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో తండ్రీ కొడుకులుగా సముద్రఖని, ధనరాజ్ డైనమిక్‌గా కనిపిస్తున్నారు. ఇదివరకు ఎప్పుడూ చూడని ఒక తండ్రీ కొడుకుల కథను అద్భుతంగా తెరమీద ఆవిష్కరిస్తున్నామని దర్శకుడు ధనరాజ్ కొరనాని తెలిపారు. మోక్ష, హరీష్ ఉత్తమన్, సత్య పృధ్వి, శ్రీనివాసరెడ్డి, చిత్రం శ్రీను, ప్రమోదిని, రాకెట్ రాఘవ, రచ్చ రవి, ఇంటూరి వాసు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి 'విమానం' చిత్ర దర్శకుడు శివ ప్రసాద్ యానా కథను సమకూర్చగా అరుణ్ చిలువేరు సంగీతం అందిస్తున్నారు. హైదరాబాద్, చెన్నై, అమలాపురం, రాజమండ్రి, రాజోలు పరిసర ప్రాంతాల్లో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రానికి తమిళ, తెలుగు భాషలలో ఒకేసారి విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటింగ్ : మార్తాండ్ కె వెంకటేష్, కెమెరా : దుర్గా ప్రసాద్.

ఫిబ్రవరి 23న రిలీజ్‌కి రెడీ




ఆనంద్ రాజ్

'కాలింగ్ బెల్', 'రాక్షసి' వంటి బ్లాక్ బస్టర్ హర్రర్ సినిమాల తర్వాత దర్శకుడు పన్నా రాయల్ రూపొందించిన మరో హర్రర్ అండ్ మిస్టీరియస్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ఇంటి నెం.13'. రీగల్ ఫిలిం ప్రొడక్షన్స్ పతాకంపై డా. బర్కతుల్లా సమర్పణలో హేసన్ పాషా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమాను ఫిబ్రవరి 23న విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

ఈ సందర్భంగా దర్శకుడు పన్నా రాయల్ మాట్లాడుతూ, 'ఆడియన్స్‌కి ఒక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇచ్చే సినిమా ఇది. ఇప్పటివరకు సస్పెన్స్ థ్రిల్లర్స్ చాలా వచ్చాయి. కానీ, ఈ సినిమాలోని యూనిక్ పాయింట్ ఆడియన్స్‌ని మెస్మరైజ్ చేస్తుంది. ప్రతి పది నిమిషాలకు వచ్చే ట్విస్ట్‌తో ఆడియన్స్‌కి గూస్‌బంప్స్ గ్యారంటీ. ఆడియన్స్‌ని థ్రిల్ చేసేందుకు హాలీవుడ్ టెక్నీషియన్స్‌తో ఓ విజువల్ వండర్‌గా ఈ చిత్రాన్ని నిర్మించాం. మా నిర్మాత హేసన్ పాషా ఖర్చుకు వెనకాడకుండా చాలా రిచ్‌గా ఈ సినిమాని నిర్మించారు' అని అన్నారు. 'మా దర్శకుడు పన్నా రాయల్ ఈ చిత్ర కథ చెప్పినపుడు చాలా ఎగ్జైట్ అయ్యాను. తప్పకుండా ఈ సినిమా గొప్ప విజయం సాధిస్తుందన్న నమ్మకం కలిగింది. పన్నా టేకింగ్, ఫుటేజ్ చూసిన తర్వాత నా నమ్మకం రెట్టింపు అయ్యింది' అని నిర్మాత హేసన్ పాషా చెప్పారు.

భిన్న కథతో అరి



సూర్య పురిమెట్ల

ఆర్‌వీ రెడ్డి సమర్పణలో ఆర్వీ సినిమాస్ పతాకంపై శ్రీనివాస్ రామిరెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేష మారంరెడ్డి నిర్మిస్తున్న సినిమా 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. వినోద్ వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'పేపర్ బాయ్' ఫేమ్ జయశంకర్ దీనికి దర్శకుడు.

ఈ సినిమా నుంచి ఇప్పటి వరకు విడుదల చేసిన క్యారెక్టర్ లుక్స్, ట్రైలర్, సాంగ్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ సందర్భంగా బాల రాముని దివ్యాశీస్సులతో ఈ సినిమాలో ఓ ముఖ్య పాత్రలో నటించిన సూర్య పురిమెట్ల క్యారెక్టర్‌ను ఇంట్రడ్యూస్ చేశారు. ఈ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తూ ఆకట్టుకుంటోంది. ఈ సినిమా ప్రస్తుతం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదల సిద్ధమవుతోంది. ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ భాగస్వామి కానున్న ఈ సినిమాను త్వరలోనే గ్రాండ్‌గా థియేట్రికల్ రిలీజ్ చేయబోతున్నారు. అలాగే ఈ చిత్ర హిందీ రీమేక్ పై బాలీవుడ్ హీరో అభిషేక్ బచ్చన్ ఆసక్తి చూపిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

వైవా హర్ష, శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర, శుభలేక సుధాకర్, సురభి ప్రభావతి, అక్షయా శెట్టి, రిధిమా పండిట్, పి.అనిల్ కుమార్, నవీనా రెడ్డి, తమిళ బిగ్ బాస్ ఫేమ్ పావని రెడ్డి, జెమినీ సురేష్, ఐ డ్రీమ్ అంజలి, మనిక చిక్కాల, సుమన్, ఆమని, ప్రవళ్లిక చుక్కల, గాయత్రి భార్గవి, మీనా కుమారి, లావణ్య రెడ్డి, ఇంటూరి వాసు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ : అనుప్ రూబెన్స్, ఎడిటర్ : జి.అవినాష్, లిరిక్స్ : కాసర్ల శ్యాం, వనమాలి, కళ్యాణ్ చక్రవర్తి, కొరియోగ్రఫీ - భాను, జీతు, ప్రొడక్షన్ డిజైనర్ : రాజీవ్ నాయర్, సినిమాటోగ్రఫీ : కృష్ణ ప్రసాద్, శివశంకర వరప్రసాద్, లైన్ ప్రొడ్యూసర్ : శివకాంత్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : వినయ్.

ప్రేమలో.. పడితే?



చరిష్మా శ్రీకర్, చందు కోడూరి

చందు కోడూరి హీరోగా, చరిష్మా శ్రీకర్ హీరోయిన్‌గా డ్రీమ్ జోన్ పిక్చర్స్ బ్యానర్ పై రూపొందిన చిత్రం 'ప్రేమలో'. చందు కోడూరి స్వీయ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాజేష్ కోడూరి నిర్మించారు. ఈనెల 26న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ను నటుడు శివాజీ రాజా విడుదల చేశారు.

హీరో, దర్శకుడు చందు కోడూరి మాట్లాడుతూ, 'ఈ సినిమాలో భారీ తారాగణం, ఎలివేషన్స్.. టెక్నీషియన్స్ లేరు.. కానీ భారీ ఎమోషన్స్ ఉన్నాయి. కథలో బలం ఉంది. కాన్సెప్ట్‌లో దమ్ముంది. అందుకే ఈ సినిమాను చేశాను. తెలుగులో ఇప్పటివరకు ఎవ్వరూ ట్రై చేయని కథ ఇది. చిన్న పాయింట్‌ను నేచురల్‌గా తీశాను. మా టీమ్ సహకారంతో అవుట్‌పుట్ బాగా వచ్చింది. కంటెంట్ ఉండే చిత్రాలను సినీ లవర్స్ ఎప్పుడూ ఆదరిస్తుంటారు. అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవం రోజున మా చిత్ర ట్రైలర్‌ను లాంచ్ చేయడం ఆనందంగా ఉంది' అని తెలిపారు.

'ఇందులో మూడు రోజుల క్యారెక్టర్ చేశాను. చందు ప్యాషన్ చూసి.. నేను మూడ్రోజులు ఉంటే ఖర్చు ఎక్కువ అవుతుందని. ఒకటిన్నర రోజులోనే కంప్లీట్ చేయమన్నాను. అతను పడ్డ కష్టానికి మంచి పేరు వస్తుంది. ఇలాంటి చిన్న చిత్రాలను ఆదరించండి' అని నటుడు శివాజీ రాజా చెప్పారు. సంగీత దర్శకుడు సందీప్ మాట్లాడుతూ, 'పాటలు బాగా వచ్చాయి. ఆర్ ఆర్ దగ్గరుండి ఎలా కావాలో.. ఏం కావాలో చేయించు కున్నారు. ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని కోరుకుంటు న్నాను' అని తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886